మన

# నేషనలిస్ట్ వాయిస్

తెలుగు దిన పత్రిక

RNI : TGTEL / 25 / A4284

ప్రచురణ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 01 | సంచిక : 79 | 13 శుక్రవారం, ఫిబ్రవరి 2026 | పేజీలు :12 | వెల: రూ. 3/-

హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి, ఆదిలాబాద్, మెదక్, నల్గొండ, మహబూబ్ నగర్, ఖమ్మం, విజయవాడ, గుంటూరు, అమరావతి, క్రిష్ణ, గోదావరి, కర్నూలు, చిత్తూరు, కడప, ప్రకాశం, శ్రీకాకుళం



రిపోర్టర్లు కావలెను

మన నేషనలిస్ట్ వాయిస్

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

తెలుగు రాష్ట్రాలలో సంచనాలు సృష్టిస్తున్న నేషనలిస్ట్ వాయిస్ మీకు సరైన వేదిక.. అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పింస్తోంది. రిపోర్టర్లు కావాలి.

ఇంకెందుకు ఆలస్యం...

9666023180.8096660656 నంబర్లకు

వాట్సాప్‌లో మీ బయోడేటాను పంపండి.




## అమెరికా ట్రేడ్ డీల్ ఫ్యాక్ట్‌షీట్‌లో మార్పులు

వాణిజ్య ఒప్పందంపై భారత్ కీలక ప్రకటన

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి12 నేషనలిస్ట్ వాయిస్:**

ఇండియా-యూఎస్ మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై భారత్ కీలక ప్రకటన చేసింది. రెండు దేశాల పరస్పర ప్రయోజనాలకు అనుగుణంగా ఈ ట్రేడ్ డీల్ జరిగినట్లు వెల్లడించింది. ఈ వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన ఫ్రేమ్‌వర్క్ అమలుకు ఇరుదేశాలు కలిసి పనిచేస్తున్నాయని తెలిపింది. మిగతా 2 లో

రాష్ట్రంలో 44వేలకు పైగా జర్నలిస్టు

## అక్రిడిటేషన్ కార్డులు



పారదర్శకంగా అర్హులందరికీ న్యాయం

సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి

**హైదరాబాద్,ఫిబ్రవరి12 నేషనలిస్ట్ వాయిస్:**

రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకూ అక్రిడిటేషన్ కార్డు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మిగతా 2 లో



## రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు పచ్చజెండా

కొత్తగా 114 విమానాల కొనుగోలుకు సన్నద్ధం

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి12 నేషనలిస్ట్ వాయిస్:**

త్రివిధ దళాల సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణ శాఖ మరో కీలక నిర్ణయం తీసుకుంది. 3.60 లక్షల కోట్ల రూపాయల విలువైన ఆయుధాలు, సైనిక పరికరాల కొనుగోలుకు కేంద్రం పచ్చజెండా ఊపింది. 2 లో

కేసీఆర్ నాయకత్వమే

# శ్రీరామరక్ష

ఎన్ని కార్పోరేషన్‌లు అయినా ఎగిరేది గులాబీ జెండాయే

శేరిలింగంపల్లి నేతలతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్

**హైదరాబాద్,ఫిబ్రవరి12 నేషనలిస్ట్ వాయిస్:**

హైదరాబాద్ కార్పొరేషన్‌ను ఎన్ని కార్పొరేషన్లు చేసినా ఎగిరేది మాత్రం ఖచ్చితంగా గులాబీ జెండానేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన యువ నాయకుడు విజయ్ కుమార్ రెడ్డి తన అనుచరులతో కలిసి గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలోకేటీఆర్ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. ఎమ్మెల్యేలు పోయినా.. పార్టీ వెన్నెముక కార్యకర్తలేనన్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే పార్టీని వీడినా, కార్యకర్తలు మాత్రం చెక్కుచెదరకుండా కేసీఆర్ నాయకత్వంలోనే ఉన్నారని ప్రశంసించారు. మొత్తం హైదరాబాద్‌లోనే శేరిలింగంపల్లి నియోజకవర్గం పార్టీకి నంబర్ వన్ కోటగా నిలిచింది. స్వార్థ ప్రయోజనాల కోసం కొందరు వెళ్లినా, బంగారం వంటి కొత్త నాయకులు వందల సంఖ్యలో పార్టీలో చేరుతున్నారు. శేరిలింగంపల్లిలోని 24 డివిజన్లలో క్లీన్ స్వీప్ చేసే సత్తా మనకుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.



# ఉగాదికి సనత్‌నగర్ టిమ్స్

మార్చి రెండో వారానికల్లా పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశం

సిద్ధమైన 16 ఆపరేషన్ థియేటర్లు



▶ రెడీగా సీటీ స్కాన్, ఎంఆర్ఐ మిషన్లు ▶ గుండె ఆపరేషన్ల కోసం క్యాథల్యాబ్ ▶ అవయవమార్పిడి కోసం ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్ ▶ ఏర్పాట్లపై మంత్రి దామోదర్ రాజనర్సింహ రివ్యూ

**హైదరాబాద్,ఫిబ్రవరి12 నేషనలిస్ట్ వాయిస్:**

పేదలకు కార్పొరేట్ స్థాయి సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని పూర్తి ఉచితంగా అందించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. ఉగాది పండుగ రోజున ఈ హాస్పిటల్‌ను ప్రారంభించి ప్రజలకు అంకితం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈలోగా సివిల్ పనులు, ఎక్విప్‌మెంట్ ట్రయల్స్ అన్నీ పూర్తి చేసి, హాస్పిటల్‌ను వైద్య సేవలు అందించేందుకు సిద్ధం చేయాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆఫీస్‌లో టిమ్స్ సనత్‌నగర్ పనుల పురోగతి, డాక్టర్లు, సిబ్బంది నియామకంపై మంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, డీఎంఈ డాక్టర్ నరేంద్ర కుమార్, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ ఫణీంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓపీ రూమ్‌లు, దయాగ్నస్టిక్స్, ఇన్‌పేషెంట్ డిపార్ట్‌మెంట్లు, వార్డులు, ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూల ఏర్పాటుపై మంత్రి ఆరా తీశారు. 1000 బెడ్ల కెపాసిటీతో నిర్మించిన సనత్‌నగర్ టిమ్స్‌లో మౌలిక వసతుల కల్పన తుది దశకు చేరుకుందని అధికారులు మంత్రికి వివరించారు. హాస్పిటల్ అత్యంత కీలకమైన 16 ఆపరేషన్ థియేటర్లు శస్త్రచికిత్సలకు సిద్ధంగా ఉన్నాయన్నారు. రోగ నిర్ధారణ కోసం అత్యాధునిక సీటీ స్కాన్, ఎంఆర్ఐ , డిజిటల్ ఎక్స్-రే మిషన్ల ఇన్‌స్టాలేషన్ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. దయాగ్నస్టిక్స్ యంత్రాలు ఇన్‌స్టాలేషన్ జరుగుతోందన్నారు. 2 లో



రైతుల రక్తాన్ని ట్రంప్‌నకు

## మోదీ అమ్మేశారు

- ▶ నాపై కేసులు పెట్టినా వెనక్కి తగ్గను
- ▶ ట్రంప్ చేతుల్లో నరేంద్ర మోదీ పగ్గాలు ఉన్నాయి
- ▶ ఆ ట్రేడ్ డీల్ వల్ల దేశ రైతులు నష్టపోతారు
- ▶ నరేంద్ర మోదీపై తీవ్ర విమర్శలు చేసిన రాహుల్

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి12 నేషనలిస్ట్ వాయిస్:** మిగతా 2 లో

రాబోయే పదిన్నరేళ్ల పాటు

## నేనే సీఎం



- 2029 ఏప్రిల్‌లో జమిలి ఎన్నికలు
- అప్పుడే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు
- నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది
- ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని ప్రతిపాదిస్తా
- నా ప్రభుత్వంలో ఫోన్ ట్యాపింగ్ అనేది లేదు
- కిషన్ రెడ్డి లేఖ రాస్తే ఫోన్‌ట్యాపింగ్ కేసు సీబీఐకి
- నిబంధనల ప్రకారమే సింగరేణి టెండర్లు
- ఢిల్లీలో మీడియాతో ఇష్టాగోష్టిలో రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి12 నేషనలిస్ట్ వాయిస్:**

2029 ఏప్రిల్‌లో జమిలి ఎన్నికలు జరుగుతాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అప్పుడే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ఉంటాయని పేర్కొన్నారు. మిగతా 2 లో



రాహుల్ గాంధీ సభ్యత్వం

## రద్దు చేయాలి

లోక్‌సభలో బిజెపి ఎంపి నిషికాంత్ దూబె తీర్మానం

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి12 నేషనలిస్ట్ వాయిస్:**

కాంగ్రెస్ నేత, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని బిజెపి ఎంపి నిషికాంత్ దూబె గురువారం లోక్‌సభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆయన వ్యాఖ్యలతో దేశాన్ని తప్పుదోవ పట్టించారని ఆరోపిస్తూ నిషికాంత్ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. రాహుల్ పార్లమెంటరీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీ చేయకుండా జీవితకాలం నిషేధం విధించాలని దూబే కోరారు. ఈ సందర్భంగా ఆయన పార్లమెంటు వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. 'నేను రాహుల్ సోరస్ సంస్థతో చేతులు కలిపి దేశాన్ని ఎలా తప్పుదారి పట్టిస్తున్నారో వివరిస్తూ మిగతా 2 లో



కార్మికుల హక్కులను

## కాలరాసిన మోడీ

లేబర్ కోడ్‌లపై మండిపడ్డ పిసిసి చీఫ్

**హైదరాబాద్,ఫిబ్రవరి12 నేషనలిస్ట్ వాయిస్:**

కార్మికుల హక్కులను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఆ హక్కు మోదీకి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. కార్మికుల పరిపూర్ణమైన హక్కులను ప్రధాని మోదీ మిగతా 2 లో

విద్య సహా అన్ని రంగాల్లో

## ఏఐ విస్తరిస్తోంది



- ➤ మూడవ తరగతి నుంచే అందుబాటులోకి 'ఏఐ'
- ➤ అన్ని విధాలుగా ఏఐని అందుబాటులోకి తెస్తాం
- ➤ కృత్రిమ మేధ రంగంలో భారత్ అభివృద్ధి
- ➤ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడి

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి12 నేషనలిస్ట్ వాయిస్:**

కృత్రిమ మేధస్సు (ఏఐ) విధానాన్ని భారతదేశంలోని విద్యార్థులందరికీ చేరువ చేస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా విద్య సహా అన్ని రంగాల్లో ఏఐ విస్తరిస్తోందని అన్నారు. మిగతా 2 లో

# నాపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారు

## నేనెప్పుడూ మహదేవప్పకు ఫోన్ చేయలేదు

## మహదేవప్ప ఆత్మహత్యపై మంత్రి వాకిటి



హైదరాబాద్,ఫిబ్రవరి12 నేషనలిస్ట్ వాయిస్: మక్తల్ మున్సిపాలిటీలో 6వ వార్డు బీజేపీ అభ్యర్థి మహదేవప్ప ఆత్మహత్యపై మంత్రి వాకిటి శ్రీహరి స్పందించారు. మహదేవప్ప ఆత్మహత్యతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆయన అన్నారు. తనపై చేస్తున్న ఆరోపణలు రుజువైతే తాను దేనికైనా సిద్ధమని అన్నారు. మహదేవప్పను బెదిరించినట్లుగా జరిగిన ప్రచారంపై మంత్రి స్పందించారు. బీజేపీ అభ్యర్థికి తాను ఎప్పుడూ ఫోన్ చేయలేదని స్పష్టం చేశారు. తన ఫోన్ కాల్ డేటాను పరిశీలించవచ్చని అన్నారు. పోస్టుమార్టం నివేదిక తర్వాత వాస్తవాలు వెలుగు చూస్తాయని అన్నారు. మహదేవప్ప ఆత్మహత్య కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతుందని అన్నారు. ఎన్నికల భయంతోనే మరణించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారని వివరించారు. కాగా, మహదేవప్ప ఆత్మహత్యకు సంబంధించి ఆయన భార్య సత్యమ్మ పోలీసులకు ఇచ్చిన లేఖ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తనకు ఎవరూ ఓటు వేయరనే భయంతో తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు ఆమె పోలీసులకు లేఖ ఇచ్చారు. ఓడిపోతాననే భయంతో క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకున్నట్లు ఆమె ఆ లేఖలో పేర్కొన్నారు.

# పోలీసులపై దురుసు ప్రవర్తన

## కాంగ్రెస్ నేత జగ్గారెడ్డిపై కేసు నమోదు



సంగారెడ్డి,ఫిబ్రవరి12 నేషనలిస్ట్ వాయిస్: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, కాంగ్రెస్ నేత జగ్గారెడ్డిపై సంగారెడ్డి పోలీసులు కేసు నమోదు చేశారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల విధులకు ఆటంకం కలిగించారంటూ ఆయనపై కేసు నమోదు చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ చర్య తీసుకున్నారు. జగ్గారెడ్డిపై సంగారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో బీఎన్ఎస్ 223, 351, 352, 132, 329 సెక్షన్ల కింద కేసు నమోదు అయ్యింది. బుధవారం సంగారెడ్డి పోలింగ్ బూత్ వద్ద జరిగిన సంఘటనపై ప్రెస్‌నోట్‌లో వివరణ ఇచ్చారు జగ్గారెడ్డి. నిన్న సంగారెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో పోలింగ్ బూత్ వద్ద కాంగ్రెస్ నాయకుడిని సీఐ గల్లా పట్టుకొని ఈడ్చుకొచ్చి కొట్టారని తెలిపారు. తన పార్టీ నాయకుడిని రక్షించుకోవడానికి బూత్‌కు వెళ్లి సీఐని తిట్టాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. ప్రత్యర్థి పార్టీ అభ్యర్థికి మద్దతుగా సీఐ... తమ పార్టీ నాయకుడిని అవమానించారని తెలిపారు. కావాలని లా అండ్ ఆర్డర్ దెబ్బతినేట్లు చేసిన సీఐని తిట్టడం జరిగిందని జగ్గారెడ్డి వివరించారు. ఈ విషయంపై పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయవచ్చని.. కానీ పది మంది మధ్యలో తమ పార్టీ నాయకుడికి సీఐ చేసిన అవమానం పోగొట్టడానికి బూత్ దగ్గరకు వెళ్లాల్సి వచ్చిందని జగ్గారెడ్డి తెలిపారు.

# కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో అరిచేతుల వైకుంఠం చూపి అధికారం దక్కించుకుందని కేటీఆర్ విమర్శించారు. మరోవైపు బీజేపీ 12 ఏళ్లుగా తెలంగాణకు 12 పైసల పని కూడా చేయలేదని, అది 'పూజకు పనికిరాని పువ్వు' అని ఎద్దేవా చేశారు. 'వెట్టి పనికైనా, మట్టి పనికైనా మనోడే ఉండాలి' అన్న నానుడిని గుర్తు చేస్తూ, తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని కేటీఆర్ పేర్కొన్నారు.నగరంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయని కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్ ప్రతిష్ఠ దెబ్బతింటోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టపగలే సుల్తాన్ బజార్ ఎస్‌బీఐ బ్రాంచ్‌లో దోపిడీలు, చందానగర్‌లో జ్యువెలరీ షాపులపై దాడులు, హత్యలు జరుగుతున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో వ్యాపారాలు, వాణిజ్య సంస్థలు కుదేలయ్యాయని, కొత్త కొలువులు రాకపోగా ఉన్న పోయే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. త్వరలో రాబోయే కార్పొరేషన్ ఎన్నికల కోసం డివిజన్ల వారీగా సమావేశాలు నిర్వహించి పార్టీని మరింత పటిష్టం చేస్తామన్నారు కేటీఆర్. ఎమ్మెల్యే లేదని భయపడకండి, మీకు అండగా నేను, తలసాని శ్రీనివాస్ యాదవ్, అరికెపూడి, కృష్ణారావు ఉంటాం. ఏ అవసరమొచ్చినా మేము అందుబాటులో ఉంటామని కేటీఆర్ హామీ ఇచ్చారు. తప్పుడు ఓటు వేస్తే ఐదేళ్ల పాటు శిక్ష అనుభవించాల్సి వస్తుందని, ఓటు వేసే ముందు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని... ముఖ్యంగా మహిళా లోకానికి కేటీఆర్ విన్నవించారు. చదువుకున్న యువత రాజకీయాల్లోకి రావడం శుభపరిణామమని, విజయ్ కుమార్ రెడ్డి వంటి యువకులు పార్టీకి ఆస్తి అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీష్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు , నేతలు పాల్గొన్నారు.

# అమెరికా ట్రేడ్ డీల్ ఫ్యాక్ట్‌షీట్‌లో మార్పులు

మొదటి పేజీ తరువాయి

ఈ ట్రేడ్ డీల్‌కు సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌పై ఫ్యాక్ట్‌షీట్‌లో అమెరికా ఇటీవల చేసిన సవరణలు రెండు దేశాల మధ్య భాగస్వామ్య అవగాహనను ప్రతిబింబిస్తాయని స్పష్టం చేసింది. ఈ మేరకు విలేకరుల సమావేశంలో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణ్?ధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. ట్రేడ్ డీల్‌పై ఫ్యాక్ట్‌షీట్‌లో వైట్ హౌస్ చేసిన మార్పుల గురించి రణ్?ధీర్ జైస్వాల్‌ను విలేకరులు ప్రశ్నించారు. "ఇండియా-యూఎస్ మధ్యంతర వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌పై విడుదల చేసిన ఉమ్మడి ప్రకటన ఇరుపక్షాల మధ్య పరస్పర అవగాహనకు నిదర్శనం. ఇరుదేశాలు పరస్పర ప్రయోజనాల కోసం వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈ డీల్‌కు సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌పై ఇరుదేశాలు ఫిబ్రవరి 7న ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. భారత్, అమెరికా ఇప్పుడు ట్రేడ్ డీల్‌కు సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌ను అమలు చేయడానికి, మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడానికి కలిసి పనిచేస్తున్నాయి. యూఎస్ ఫ్యాక్ట్ షీట్‌లోని సవరణలు ఇరుదేశాల ఉమ్మడి ప్రకటనలోని ఉన్న పరస్పర అవగాహనలను ప్రతిబింబిస్తాయి." అని రణ్‌ధీర్ జైస్వాల్ తెలిపారు. ఇటీవల ఇండియా-యూఎస్ మధ్యంతర వాణిజ్య ఒప్పందం ఖరారైంది. ఈ నేపథ్యంలో కీలక అంశాలతో కూడిన ఫ్యాక్ట్ షీట్‌ను శ్వేతసౌధం సోమవారం రిలీజ్ చేసింది. ఆ తర్వాత కొన్ని గంటల్లోనే దానిలో ఇబ్బందికర అంశాల్లో మార్పులు చేపట్టింది. భారత ప్రభుత్వం కొన్ని పప్పు ధాన్యాలపై సుంకాలను తగ్గిస్తుందంటూ తొలుత పేర్కొన్న యూఎస్ ఆ తర్వాత ఆ లైన్‌ను తొలగించింది. నట్స్, సోయాబీన్ ఆయిల్, వైన్ వంటి జాబితా నుంచి పప్పు ధాన్యాలను తీసేసింది. అలాగే 500 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తుల కొనుగోళ్లకు 'భారత్ కట్టుబడి ఉంది' అన్న పదాన్ని 'కొనుగోలు చేయాలనే ఉద్దేశంతో ఉంది' అన్నట్లు మార్చేసింది.కాగా, భారత్‌కు అమెరికా ఎగుమతి చేసే వ్యవసాయ, పాడి ఉత్పత్తులపై సుంకాలను తగ్గించేందుకు మన దేశం తొలి నుంచి ఒప్పుకోవడం లేదు. అమెరికాతో ట్రేడ్ డీల్ వల్ల భారత రైతులకు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఎటువంటి నష్టం ఉండదని ఇటీవల కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూశ్ గోయల్ వెల్లడించారు. ఈ క్రమంలోనే ఫ్యాక్ట్‌షీట్‌లో అమెరికా సవరణలు చేయడం గమనార్హం. వాస్తవానికి ఫ్యాక్ట్‌షీట్‌ను శ్వేతసౌధం సోమవారమే రిలీజ్ చేసింది. అయితే 24 గంటల వ్యవధిలోనే దానిలో మార్పులు చేసింది. కొన్ని పదాలు, నిబంధనల విషయంలో అమెరికా వెనక్కి తగ్గింది. అయితే ఈ ఫ్యాక్ట్‌షీట్‌లో చేసిన సవరణల గురించి తాజాగా భారత్ క్లారిటీ ఇచ్చింది. ఈ వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన ఫ్రేమ్‌వర్క్ అమలుకు ఇరుదేశాలు కలిసి పనిచేస్తున్నాయని స్పష్టం చేసింది.అలాగే బంగ్లాదేశ్‌లో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలపైనా విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణ్?ధీర్ జైస్వాల్ స్పందించారు. ఎన్నికల కార్యకలాపాలను పర్యవేక్షించడానికి ఢాకా నుంచి భారత్‌కు అధికారిక ఆహ్వానం అందిందని వెల్లడించారు. అయితే బంగ్లాదేశ్ ఎన్నికల్లో ఇండియా జోక్యం చేసుకుంటుందనే భావనను నివారించడానికి తాము ఢాకాకు పరిశీలకులను పంపకూడదని నిర్ణయించుకున్నామన్నారు. "బంగ్లాదేశ్ ఎన్నికల కార్యకలాపాలను పర్యవేక్షించడానికి పరిశీలకులను పంపమని భారత్‌కు ఆహ్వానం అందింది. అయినా మేము ఎన్నికలను పర్యవేక్షించడానికి పరిశీలకులను బంగ్లాదేశ్‌కు పంపలేదు. బంగ్లా ప్రజలు ఏ విధమైన తీర్పు ఇస్తారో వేచి చూస్తాం. బంగ్లాదేశ్‌లో స్వేచ్ఛాయుతమైన, న్యాయమైన, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరగాలని మేం కోరుకున్నాం " అని రణ్‌ధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు.

# రాబోయే పదిన్నరేళ్ల పాటు నేనే సీఎం

మొదటి పేజీ తరువాయి

నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని ఆయన వెల్లడించారు. నూటికి నూరు శాతం తన ప్రభుత్వంలో ఫోన్ ట్యాపింగ్ లేదని స్పష్టం చేశారు. దిల్లీలో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్రబడ్జెట్?లో తెలంగాణకు బుల్లెట్? ట్రైన్? ప్రాజెక్టు వచ్చిందని, హైదరాబాద్? నగరాన్ని బుల్లెట్? ట్రైన్? హబ్?గా మారుస్తామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఆ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలను కేంద్రమంత్రికి ఇచ్చామన్నారు. ఫ్యూచర్?సిటీ, ఎయిర్?పోర్టునకు సమీపంలో 500-700 ఎకరాలు ఇవ్వాలనుకుంటున్నామని వెల్లడించారు. అమీర్‌పేటలో ఎన్టీఆర్ విగ్రహం పెట్టితీరుతామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నందమూరి తారకరామారావుకు భారతరత్న ఇవ్వాలని ప్రతిపాదిస్తానని తెలిపారు. 2018లో తెచ్చిన నిబంధనల ప్రకారమే సింగరేణిలో టెండర్లు జరిగాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సింగరేణి టెండర్లపై ప్రతి డాక్యుమెంట్?ను అసెంబ్లీలో పెడతానన్నారు. ఆరోపణలు తప్పని తేలితే కిషన్?రెడ్డి క్షమాపణలు చెబుతారా అని రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. సింగరేణి సంస్థ అప్పులు తమ హయాంలో పెరగలేదన్నారు. కేసీఆర్? పెట్టిన బకాయిలే ఎక్కువగా ఉన్నాయని వివరించారు. సింగరేణి విషయంలో కేసీఆర్?ను కిషన్?రెడ్డి ఎందుకు ప్రశ్నించలేదన్నారు. మొత్తగా ఉన్నానని తనను మాత్రమే ఆయన ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు."2029 ఏప్రిల్‌లో జమిలి ఎన్నికలు జరుగుతాయి. జమిలి ఎన్నికల్లోనే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ఉంటాయి. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు వచ్చింది. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు ప్రతిపాదనలు కేంద్రమంత్రికి ఇచ్చాము. ఫ్యూచర్‌సిటీ, ఎయిర్‌పోర్టు సమీపంలో 500-700 ఎకరాలు ఇవ్వాలనుకుంటున్నామని తెలిపారు. తన ప్రభుత్వంలో నూటికి నూరుశాతం ఫోన్?ట్యాపింగ్ లేదని రేవంత్ రెడ్డి అన్నారు. తాను ప్రజల అభిప్రాయాన్ని మాత్రమే తెలుసుకుంటానని ఆయన తెలిపారు. నాలుగు గోడల మధ్య జరిగే వ్యవహారం తనకు అవసరం లేదని వివరించారు. ఎస్?ఐబీ ఫిర్యాదుతోనే కేసు దర్యాప్తు జరుగుతోందని వివరించారు. ఎస్?ఐబీలో పరికరాల మాయంతోనే కేసు బయటపడిందన్నారు. కిషన్?రెడ్డి లేఖ రాస్తే ఫోన్? ట్యాపింగ్ కేసు కూడా సీబీఐకి ఇస్తామని రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్?కు రాజకీయ ప్రత్యర్థులే తప్ప శత్రువులు లేరని రేవంత్ రెడ్డి చెప్పారు. కాళేశ్వరంపై సీబీఐ దర్యాప్తు కోరుతూ లేఖరాసి 6 నెలవుతుందని, కేంద్రం ఇంతవరకు ఎందుకు నిర్ణయం తీసుకోలేదని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. విద్యుత్? కొనుగోలు వ్యవహారం కేసును త్వరలోనే సీబీఐకి ఇస్తామని ఆయన వెల్లడించారు. రాబోయే పదిన్నరేళ్ల పాటు తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని, తనకు రాష్ట్రంలో ఎవరూ పోటీ లేరని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలోనే కాకుండా, ప్రతిపక్షాల్లో కూడా తనకు పోటీ ఇచ్చే నాయకుడు లేడని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. బీఆర్ఎస్ నేతల విమర్శలపై స్పందిస్తూ, తనను విమర్శించిన వారికే తాను సమాధానం ఇస్తున్నానని, ఎవరిపైనా వ్యక్తిగత కక్ష సాధించడం లేదని అన్నారు. "కేసీఆర్‌ను జైల్లో పెట్టాలనుకుంటే ఎప్పుడో పెట్టేవాడిని. కానీ, ఆయన ఫామ్‌హౌస్‌కే పరిమితమై స్వీయ శిక్ష విధించుకున్నారు. అలాంటి వ్యక్తిని జైల్లో వేయాల్సిన అవసరం నాకు లేదు" అని రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫార్మా సిటీ కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలు ఉన్నప్పటికీ కేటీఆర్‌ను ఈడీ ఎందుకు విచారించడం లేదని ఆయన ప్రశ్నించారు.సింగరేణి బొగ్గు గనుల కేటాయింపు వివాదంపై రాబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పూర్తి వివరాలతో చర్చిస్తామని సీఎం తెలిపారు. కేంద్ర బొగ్గు శాఖ మంత్రిగా కిషన్ రెడ్డి ఈ వ్యవహారంలో వాస్తవాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఇక కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై సీబీఐ విచారణ కోరుతూ కేంద్రానికి లేఖ రాసినా ఇప్పటివరకు ఎలాంటి స్పందన రాలేదని అన్నారు.

# ఉగాదికి సనత్‌నగర్ టిమ్స్

మొదటి పేజీ తరువాయి

మార్చి రెండో వారం నాటికి అన్ని పనులు, ఎక్విప్‌మెంట్ ఇన్‌స్టాలేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. హాస్పిటల్ ప్రారంభమయ్యే నాటికి టెక్నీషియన్లకు, సిబ్బందికి ట్రైనింగ్ కూడా పూర్తి చేయాలని మంత్రి సూచించారు. సనత్‌నగర్ టిమ్స్‌ను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ కార్డియాక్ కేర్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్÷-లాంటేషన్‌గా తీర్చిదిద్దాలని గతంలోనే అధికారులకు మంత్రి సూచించారు. ఇందుకు అనుగుణంగా అన్నిరకాల గుండె సంబంధిత ఆపరేషన్లు చేసేలా, అవయవమార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహించేలా క్యాథ్‌ల్యాబ్స్, ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ థియేటర్ల ఏర్పాటుపై మంత్రి ఆరా తీశారు. క్యాథ్‌ల్యాబ్ ఏర్పాటు పనులు చివరి దశలో ఉన్నాయని, ఓటీలు ట్రయల్ రన్‌కు సిద్ధంగా ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. నగరంలోని నిమ్స్, ఉస్మానియా, గాంధీ హాస్పిటల్‌పై పెరుగుతున్న రోగుల ఒత్తిడిని తగ్గించేందుకు టిమ్స్ సనత్‌నగర్ ప్రధాన భూమిక పోషిస్తుందని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. ఆయా హాస్పిటళ్లలో శస్త్రచికిత్సల కోసం నెలల తరబడి వేచి చూస్తున్న రోగులను ఇక్కడికి రిఫర్ చేసి, త్వరితగతిన వైద్యం అందించేందుకు ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు. దీనికి సంబంధించి ఆయా హాస్పిటళ్ల సూపరింటెండెంట్లు సమన్వయం చేసుకోవాలని మంత్రి సూచించారు. హాస్పిటల్ నిర్వహణకు అవసరమైన ప్రొఫెసర్లు, డాక్టర్లు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది నియామక ప్రక్రియపై మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆరా తీశారు. పూర్తిగా కొత్త హాస్పిటల్ అయినందున.. డీఎంఈ, నిమ్స్ పరిధిలోని సీనియర్ డాక్టర్ల సేవలను సనత్‌నగర్ టిమ్స్‌లో వినియోగించుకోవాలని అధికారులకు మంత్రి సూచించారు. అలాగే, పారిశుధ్యం, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ సేవలను అత్యున్నత ప్రమాణాలతో ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ విషయంలో ఇప్పటికే నగరంలోని పలు కార్పొరేట్ హాస్పిటల్స్, నిమ్స్, ఎయిమ్స్‌లో అనుసరిస్తున్న పద్ధతులను డీఎంఈ నేతృత్వంలోని కమిటీ అధ్యయనం చేసి, నివేదిక అందజేసింది. ఆయా హాస్పిటల్స్‌లో అవలంభిస్తున్న బెస్ట్ ప్రాక్టీస్ విధానాలనే టిమ్స్‌లోనూ అమల్లోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. మెడికల్ సర్వీసెస్‌తో పాటు సానిటేషన్, సెక్యూరిటీ వంటి నాన్ మెడికల్ సర్వీసెస్ విభాగాలు కూడా పటిష్టంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. రోగులకు ఓపీ రిజిస్ట్రేషన్ నుంచి డిశ్చార్జి వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ-హెచ్ఎంఐఎస్ (ı-ఊఓఎ÷ూ) సాఫ్ట్‌వేర్ ద్వారా సేవలను అనుసంధానించాలని మంత్రి సూచించారు. రోగులకు, వారి సహాయకులకు నాణ్యమైన భోజనం అందించేందుకు సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు చేయాలని సూచించారు. మార్చి 15 నాటికి పెండింగ్‌లో ఉన్న చిన్న చిన్న పనులన్నీ పూర్తి చేసి, ఉగాది నాటికి హాస్పిటల్‌ను ప్రారంభానికి సిద్ధం చేయాలని మంత్రి స్పష్టం చేశారు.

# కార్మికుల హక్కులను కాలరాసిన మోడీ

మొదటి పేజీ తరువాయి

అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నారు. కొత్తగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆటో, ఆర్టీసీ యూనియన్లు, వివిధ వర్గాల కార్మికులు, రైతు సంఘాలు, ప్రజా సంఘాలు, సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ఒక రోజు బంద్‌లో మహేశ్ గౌడ్ పాల్గొన్నారు. వీఎస్టీ నుంచి ఆర్టీసీక్రాస్ రోడ్ మీదుగా ఇందిరాపార్క్ వరకు భారీ ర్యాలీ తీశారు. అనంతరం ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించారు. కార్మికుల చెమట కష్టంతో ఈ దేశం నడుస్తోంది. దేశవ్యాప్తంగా సెంట్రల్ ట్రేడ్ యూనియన్ పిలుపుమేరకు కార్మికులు ధర్నా చేస్తున్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వం పెట్టుబడి వ్యవస్థకు దారులు తెరిచింది. మోదీ, అమిత్ షాలను కేంద్రంలో రాహుల్ గాంధీ ధైర్యంగా ఎదుర్కొంటున్నారు. పేదల హక్కులను కాలరాయడమే కాకుండా.. నరేగా ఉపాధి హామీకి పథకానికి మహాత్మాగాంధీ పేరు తొలగించారు. కేంద్రం తీసుకువచ్చిన ఆ చట్టాలపై అసెంబ్లీలో చర్చిస్తాం. నాలుగు కోడ్‌ల రద్దు విషయంలో కాంగ్రెస్ పార్టీ కార్మికులకు సంపూర్ణ మద్దతు ఇస్తుంది. కాంగ్రెస్ పార్టీ కార్మికుల పక్షపాతి. ప్రధాని మోదీ దిగొచ్చి కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి. అప్పటి వరకు ఈ ఉద్యమం కొనసాగాలి' అని మహేశ్ గౌడ్ అన్నారు.

# రాహుల్ గాంధీ సభ్యత్వం రద్దు చేయాలి

మొదటి పేజీ తరువాయి

ఈరోజు లోక్‌సభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టాను. నేను ప్రతిపాదించిన తీర్మానంలో రాహుల్ గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఆయనను జీవితకాలం ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించాలని అభ్యర్థించాను' అని అన్నారు. కాగా, నిన్న రాహుల్‌గాంధీ లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మోడీ ప్రభుత్వం అమెరికాకు లొంగిపోయిందని, భరతమాతను అమ్మేశారని వ్యాఖ్యానించారు. మరుసటి రోజే ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని బిజెపి ఎంపి తీర్మానం ప్రవేశపెట్టారు. అయితే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై సభా హక్కుల తీర్మానానికి కేంద్రం విముఖత వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ బీజేపీ ఏంపీ నిషికాంత్ దూబే గురువారం లోక్‌సభలో 'సబ్‌స్టాంటివ్ మోషన్' దాఖలు చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడమే కాకుండా, జీవితాంతం ఆయన ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధించాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ ఎంపీ ప్రవేశపెట్టిన ఆ తీర్మానంపై కేంద్రం విముఖంగా ఉన్నట్టు సమాచారం. అయితే రాహుల్‌గాంధీ బుధవారం చేసిన ప్రసంగం నుంచి కొన్ని వ్యాఖ్యలు తొలగించాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. 'జార్జ్ సోరోస్ వంటి శక్తుల సహాయంతో రాహుల్ గాంధీ దేశాన్ని ఎలా తప్పుదారి పట్టిస్తున్నారో వివరిస్తూ నేను ఈరోజు లోక్‌సభలో ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టాను. ఈ విషయాన్ని చర్చించాలని, ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఆయన జీవితాంతం ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించాలని డిమాండ్ చేస్తున్నా' అంటూ దూబే అన్నారు. అమెరికా-భారత్ ట్రేడ్ డీల్ గురించి రాహుల్ గాంధీ బుధవారం లోక్‌సభలో తీవ్ర ఆరోపణలు చేశార. ఈ ఒప్పందం ద్వారా భారత ప్రయోజనాలను పూర్తిగా అమెరికాకు తాకట్టు పెట్టారని ఆయన ఆరోపించారు. ఈ ట్రేడ్ డీల్‌ను రాహుల్ గాంధీ 'పూర్తి లొంగుబాటు'గా అభివర్ణించారు. భారతదేశ ఇంధన భద్రతను అమెరికాకు అప్పగించారని, రైతుల ప్రయోజనాల విషయంలో రాజీ పడ్డారని ఆరోపించారు.

# రైతుల రక్తాన్ని ట్రంప్‌నకు మోదీ అమ్మేశారు

మొదటి పేజీ తరువాయి

ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు. తనపై కేసులు పెట్టినా, ప్రివిలేజ్ మోషన్ దాఖలు చేసినా తాను పట్టించుకోనని అన్నారు. తాను దేశ రైతుల కోసం పోరాడుతానని తెలిపారు. అలాగే భారత్- అమెరికా ట్రేడ్ ద్వారా ప్రధాని మోదీ దేశాన్ని, రైతులను అమ్మేశారని ఆరోపించారు. ఈ క్రమంలో మోదీని రైతు వ్యతిరేకిగా అభివర్ణించారు. యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేతుల్లో నరేంద్ర మోదీ పగ్గాలు ఉన్నాయని ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో తాను మాట్లాడిన ఓ వీడియోను రాహుల్ పోస్టు చేశారు.రైతుల జీవనోపాధిని హరించే లేదా దేశ ఆహార భద్రతను బలహీనపరిచే ఏ వాణిజ్య ఒప్పందం అయినా అన్నదాతలకు వ్యతిరేకమే. రైతు వ్యతిరేక మోదీ ప్రభుత్వాన్ని ఆహార సరఫరాదారుల ప్రయోజనాలపై రాజీ పడనివ్వం. నిన్న(బుధవారం) నేను పార్లమెంటులో నిజం మాట్లాడాను. మీకు (ప్రభుత్వానికి) నచ్చకపోతే అది వేరే విషయం. దేశం సత్యాన్ని అర్థం చేసుకోగలదు. నేను రైతులపక్షాన నిలబడతాను. అస్సలు వెనక్కి తగ్గను. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ, నేను రైతులకు అండగా ఉంటాం. వారిని అన్యాయం జరగనివ్వమని అన్నారు. రైతులే దేశానికి పునాది అని రాహుల్ గాంధీ తెలిపారు. అమెరికాతో ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా ప్రధాని మోదీ దేశంలోని పత్తి, సోయాబీన్స్, యాపిల్, పండ్ల రైతులను అమ్మేశారని ఆరోపించారు. కొన్నేళ్లుగా విదేశీయులు దేశ వ్యవసాయ మార్కెట్‌ను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, వారికి నరేంద్ర మోదీ ఈ ట్రేడ్ డీల్ ద్వారా ద్వారాలు తెరిచారని మండిపడ్డారు. ఇది నిజమని, ఈ విషయం మోదీకి కూడా తెలుసని విమర్శించారు. మోదీ తన మిత్రులైన అదానీ, అంబానీ, విదేశీ శక్తుల కోసం మొత్తం దేశ వ్యవసాయ మార్కెట్‌కు తలుపులు తెరుస్తారని ఆరోపించారు. మోదీ రైతు వ్యతిరేకి అని ఈ విషయం యావత్ దేశానికి, అన్నదాతలకు తెలుసని పేర్కొన్నారు.విదేశీ వ్యవసాయ ఉత్పత్తులకు భారత మార్కెట్ ద్వారాలు తెరవడం దేశ ఆహార భద్రత, రైతుల జీవనోపాధిపై చేసిన ప్రత్యక్ష దాడిగా రాహుల్ అభివర్ణించారు. పత్తి, సోయాబీన్స్, జొన్నలు, పండ్ల రైతులు ఇప్పటికే ప్రమాదంలో ఉన్నారన్నారు. దేశంలోని 99.5 శాతం మంది పేద, సన్నకారు రైతులే ఉన్నారని వెల్లడించారు. వారు పండించే పంటలకు మద్దతు ధర ఉండదని, సబ్సిడీలు కూడా అందవని పేర్కొన్నారు. ఈ క్రమంలో దేశ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. అమెరికాలో వ్యవసాయం యంత్రాలను ఉపయోగించి చేస్తారని, వారికి ప్రభుత్వం భారీ సబ్సిడీలను అందిస్తుందన్నారు.

## విద్య సహా అన్ని రంగాల్లో

# ఏఐ విస్తరిస్తోంది

మొదటి పేజీ తరువాయి

దేశంలో 30 కోట్ల మంది విద్యార్థులు ఉన్నారని, 3వ తరగతి విద్యార్థుల నుంచి ఆధునాతన పరిశోధనలు నిర్వహించే విద్యార్థుల వరకు కృత్రిమ మేధను అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. ఢిల్లీలో జరిగిన ఏఐ-కాంక్లేవ్-2026 సదస్సులో పాల్గొన్న ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ, కృత్రిమ మేధ రంగంలో భారత్ అభివృద్ధి చెందుతోందని అన్నారు. మన వద్ద మేధో సామర్థ్యానికి లోటు లేదన్నారు. కృత్రిమ మేధకు సంబంధించి పలు పరిశోధనలు జరుగుతున్నట్లు తెలిపారు. ఏఐకి సంబంధించిన పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలను సృష్టించడంలో సాంకేతిక సంస్థలు నిమగ్నమయ్యాయని అన్నారు.

# రాష్ట్రంలో 44వేలకు పైగా జర్నలిస్టు అక్రిడిటేషన్ కార్డులు

మొదటి పేజీ తరువాయి

జర్నలిస్టుల సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పనిచేస్తోందని పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ విధానం, అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటు తదితర అంశాలపై గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ సిహెచ్. ప్రియాంక, ముఖ్యమంత్రి సిపిఆర్‌వో జి. మల్సూర్‌లతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. అక్రిడిటేషన్ కార్డుల జారీకి సంబంధించి ప్రభుత్వం ముందుగా జి.ఓ. 252 జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. అనంతరం జర్నలిస్టు సంఘాలతో సమావేశమై వారి సూచనలు, అభిప్రాయాలను సవివరంగా పరిగణనలోకి తీసుకొని అవసరమైన సవరణలు చేసి జి.ఓ. 103ను జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ సవరణల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా మరియు డిజిటల్ మీడియా విభాగాల్లో మొత్తం 44,706 అక్రిడిటేషన్ కార్డులు పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. గతంలో సుమారు 23 వేల మందికి మాత్రమే అక్రిడిటేషన్ కార్డులు ఉండగా, తాజా నిర్ణయంతో దాదాపు 21 వేలకు పైగా కార్డుల సంఖ్య పెరుగుతుందని మంత్రి వివరించారు. 2.50 లక్షల పైగా సర్క్యులేషన్ ఉన్న 8 పత్రికలకు 6,256 కార్డులు, 75 వేల నుండి 2.50 లక్షల వరకు సర్క్యులేషన్ ఉన్న24 పత్రికలకు 17,784 కార్డులు , 25001 నుంచి 75 వేల వరకు సర్క్యులేషన్ ఉన్న 30 పత్రికలకు 3,390, అదేవిధంగా 15001 నుంచి 25000 వరకు సర్క్యులేషన్ ఉన్న 169 చిన్న పత్రికలకు 11,661 , 15వేలలోపు సర్క్యులేషన్ ఉన్న 113 చిన్న పత్రికలకు 226, పీరియాడికల్స్‌కు 624, 20 న్యూస్ ఏజన్సీలకు 68 అక్రిడిటేషన్‌లు పొందుతాయని తెలిపారు. అలాగే 21 శాటిలైట్ ఛానళ్లకు 4,431 కార్డులు, 8 జాతీయ ఛానల్స్‌కు 32, వంద లోకల్ కేబుల్ ఛానళ్లకు 200 ,డిజిటల్ మీడియా విభాగానికి 10 కార్డులు మొత్తంగా 44,706 కార్డులు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర మరియు జిల్లా స్థాయిలో 16,056, నియోజకవర్గ మరియు మండల స్థాయిలో 28,650 మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, అవసరాన్ని బట్టి మరోసారి సమావేశమై తదుపరి చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా ఉన్న మీడియా ప్రతినిధుల గౌరవం, భద్రత, సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

# రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు పచ్చజెండా

మొదటి పేజీ తరువాయి

ఈ మేరకు రక్షణశాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ నేతృత్వంలో సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ సంబంధిత ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. డీఏసీ ఆమోదించిన ప్రతిపాదనల్లో 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్ లభించింది. అదే విధంగా కాంబాట్ క్షిపణులు, ఎయిర్‌షిప్ ఆధారిత హై ఆల్టిట్యూడ్ సూడో శాటిలైట్ల కొనుగోలుకు అనుమతి లభించింది. వైభవ్ యాంటీ ట్యాంక్ మైన్స్, పీ-8ఐ విమానాల వంటి కీలక ఆయుధాలకు కూడా డీఏసీ ఆమోదం తెలిపింది. 'ఆత్మనిర్భర్ భారత్'కు ఇది మరింత ఊతమిస్తుందని రక్షణశాఖ తెలిపింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు వణుకు పుట్టించిన రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. మరికొన్ని రోజుల్లో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ భారత్ పర్యటనకు రానున్న వేళ ఈ డీల్‌కు డీఏసీ అమోదం తెలిపింది. 'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా రఫేల్ విమానాలను భారత్‌లోనే తయారు చేసే విధంగా కేంద్రం ప్రయత్నాలు చేస్తోంది. విమానాల విడిభాగాల తయారీ కోసం రఫేల్ మాతృ సంస్థ డసో ఏవియేషన్‌తో భారత్ చర్చలు జరపనుంది. ఫ్రాన్స్‌తో ఈ ఒప్పందం కుదిరితే భారత వైమానిక దళంలో రఫేల్ యుద్ధ విమానాల సంఖ్య 150కు చేరుకుంటుంది. ప్రస్తుతం భారత వాయుసేన దగ్గర 36 రఫేల్ యుద్ధ విమానాలు ఉన్నాయి.కాంబాట్ క్షిపణుల ద్వారా సుదూర లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించవచ్చని రక్షణశాఖ తెలిపింది. గగనతలంలో నిరంతరం నిఘా ఉంచేందుకు, ఇంటెలిజెన్స్ సమాచారం సేకరించేందుకు ఎయిర్‌షిప్ ఆధారిత హై ఆల్టిట్యూడ్ సూడో శాటిలైట్లు ఎంతో ఉపయోగపడతాయని వెల్లడించింది. స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన విభవ్ యాంటీ- ట్యాంక్ మైన్లు శత్రువుల యుద్ధ ట్యాంకర్‌లను సులభంగా అడ్డుకుంటాయని పేర్కొంది. ప్రస్తుతం ఉన్న ి-72 ట్యాంకులు, ఆర్మోర్డ్ రికవరీ వెహికల్స్, ఇన్‌ఫాంట్రీ కాంబాట్ వెహికల్స్‌లను పూర్తిగా మరమ్మతు చేసి, వాటి జీవితకాలాన్ని పెంచుతామని రక్షణశాఖ తెలిపింది. సముద్ర జలాల్లో జలాంతర్గాములను పసిగట్టడంలో పీ-8ఐ యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ యుద్ధవిమానం ప్రపంచంలోనే అత్యుత్తమైనదని రక్షణశాఖ స్పష్టం చేసింది.

# కోనసీమ జిల్లాలో అగ్నిప్రమాదం

## 11 తాటాకు పూరిళ్లు దగ్ధం

**అంబేద్కర్ కోనసీమ,ఫిబ్రవరి12(నేషనలిస్ట్ వాయిస్):**

మామిడికుదురు మండలంలోని ఆల్ క్యాస్ట్ కాలనీలో గురువారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 11 తాటాకు ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రమాదం వల్ల 13 కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. మరికొన్ని ఇళ్లకు మంటలు వ్యాపించకుండా త్వరితగతినే మంటలను అదుపుచేశారు. ప్రమాదంలో 13 కుటుంబాలకు చెందిన విలువైన గృహోప కరణాలు, వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. ఓ వ్యక్తి గ్యాస్ సిలిండర్ వెలిగించే సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. అగ్నిమాపక శాఖ అధికారులు ప్రస్తుతం ఆస్తి నష్టాన్ని అంచనా వేస్తున్నారు. పరిహారం, పునరావాసం కోసం సంబంధిత అధికారులు చర్యలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. అగ్నిప్రమాద ఘటనతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది.

# పోలీస్ పెట్రోలింగ్ కారు ఢీకొని యువతి మృతి

## రెండేళ్ల తరవాత జాహ్నవికి భారీ పరిహారం

**కర్నూలు,ఫిబ్రవరి12(నేషనలిస్ట్ వాయిస్):**



అమెరికాలో ఓ బాధ్యత గల పోలీసు అధికారి నిర్లక్ష్యం వల్ల రోడ్డు ప్రమాదంలో మరణించిన కర్నూలు యువతి కందుల జాహ్నవి(23) అనే యువతి కుటుంబానికి న్యాయం జరిగింది. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీస్ అధికారిని విధులనుంచి తొలగించడంతో పాటు మృతురాలు కుటుంబానికి అక్కడి ప్రభుత్వం రూ.262 కోట్ల భారీ పరిహారాన్ని ఇవ్వనున్నట్లు ప్రకటించింది. కర్నూలు జిల్లాకు చెందిన జాహ్నవి పై చదువుల కోసం అమెరికా వెళ్లింది. 2023 జనవరిలో సియాటెల్ నగరంలో రోడ్డు దాటుతున్న జాహ్నవిని పోలీస్ పెట్రోలింగ్ కారు ఢీకొట్టిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో జాహ్నవి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదానికి కారణమైన డేనియల్ అదరర్ అనే పోలీసు అధికారి కనీసం బాధ్యతగా ప్రవర్తించక పోగా ఎగతాలిగా మాట్లాడారు. ఆమె చనిపోయింది, ఆమె చాలా మాములు మనిషి, 11 వేల డాలర్లు ఇస్తే సరిపోతుంది హహహ ‘ అంటూ ఎగతాలిగా మాట్లాడాడు. కారుతో ఢీకొట్టి కనీసం పాశ్చాతాపం లేకండా వెకిలిగా ప్రవర్తించిన అధికారిపై సియాటెల్ నగర యంత్రాంగ చర్యలు తీసుకంది

# లాటరీ టిక్కెట్ల కేసులో రిమాండ్

## రాజమండ్రి జైలుకు అంబటి తరలింపు

**గుంటూరు,ఫిబ్రవరి12(నేషనలిస్ట్ వాయిస్):**

వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు కోర్టు మరోసారి 14 రోజుల రిమాండ్ విధించింది. ఈ మేరకు గుంటూరు స్పెషల్ ప్రిన్సిపల్ కోర్టు న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. సంక్రాంతి పండగ వేళ.. సత్తెనపల్లిలో లక్కీ డ్రా పేరుతో బలవంతంగా టికెట్లు కొనుగోలు చేసేలా వ్యవహరించిన కేసులో అంబటి రాంబాబుకు న్యాయమూర్తి ఈ రిమాండ్ విధించారు. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు అంబటి రాంబాబును భారీ బందోబస్తు నడుమ తరలించారు. సంక్రాంతి పండగ వేళ సత్తెనపల్లిలో లక్కీ డ్రా పేరుతో టికెట్లు విక్రయించారు. వీటిని ప్రజలకు వైసీపీ నేత అంబటి రాంబాబు బలవంతంగా విక్రయించేలా చర్యలు చేపట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఆయనపై జనసేన పార్టీకి చెందిన నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో అంబటిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల సీఎం చంద్రబాబుపై అంబటి రాంబాబు తీవ్ర అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. దాంతో రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో అంబటిపై పోలీసులకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ మేరకు అంబటిపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అనంతరం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. తాజాగా లక్కీ డ్రా కేసులో ఈ రోజు గుంటూరు కోర్టులో అంబటిని సత్తెనపల్లి పోలీసులు హాజరుపరిచారు. ఆయనకు 14 రోజుల రిమాండ్ విధిస్తూ.. స్పెషల్ ప్రిన్సిపల్ కోర్టు న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. దాంతో గుంటూరు నుంచి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు ఆయన్ని తరలించారు.

# గవర్నర్ ప్రసంగంపై చర్చ ప్రారంభం

## ఉభయ సభలు నేటికి వాయిదా

**అమరావతి,ఫిబ్రవరి12(నేషనలిస్ట్ వాయిస్):**

ఆంధ్రప్రదేశ్ శాసనసభ, శాసన మండలి వాయిదా పడ్డాయి. శాసనసభ వాయిదా పడిన కొద్దిసేపటికే శాసనమండలి సైతం శుక్రవారానికి వాయిదా పడింది. గురువారం ఉదయం రెండు సభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఇరు సభల్లో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరిగింది. ఇక శాసన మండలిలో అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. మంత్రి పార్థసారథి, వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ మధ్య మాటల యుద్ధం చోటు చేసుకుంది. ఒకానొక దశలో ఈ ఇరువురు ఒకరిపై ఒకరు ఛాలెంజ్ చేసుకునే వరకు పరిస్థితి వెళ్లింది. దాంతో సభలో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో శాసన మండలి శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు ఛైర్మన్ మోషేన్ రాజు ప్రకటించారు. సమావేశాల ప్రారంభం వేళ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రసంగించారు. ఈ సమావేశానికి వైసీపీ ఎమ్మెల్యేలు మొత్తం 11మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా సభలో పెద్దఎత్తున వారు నినాదాలు, నిరసనలు తెలిపారు. సభ ప్రారంభమైన కొన్ని నిమిషాలకే వైసీపీ సభ్యులంతా వాకౌట్ చేశారు. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై గురువారం చర్చ జరిగింది. అనంతరం సభ శుక్రవారానికి వాయిదా పడింది. మరోవైపు బుధవారం నాడు అసెంబ్లీలో వైసీపీ ఎమ్మెల్యేలు అనుసరించి తీరు పట్ల స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వైసీపీ వాళ్లకి 11 అసెంబ్లీ సీట్లు వచ్చాయని.. అసెంబ్లీకి 11వ తేదీన వచ్చారని.. కేవలం 11 నిమిషాలసేపు సభలో వారు ఉన్నారంటూ స్పీకర్ వ్యంగ్యంగా పేర్కొన్నారు.

# అమరావతి మన భవిష్యత్‌కు బాట

## కేవలం రాజధానిగా మాత్రమే కాదు

## గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంలో ఎమ్మెల్యే మద్దిపాటి

**అమరావతి,ఫిబ్రవరి12(నేషనలిస్ట్ వాయిస్):**

అమరావతి నిర్మాణం ఒక్క రాజధానిగా చూడరాదని, అది తెలుగు ప్రజల భవిష్యత్ అని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. అమరావతిని వ్యతిరేకిస్తున్న వారు అసలు నిజాలు గుర్తించాలన్నారు. ఏపీ శాసనసభలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ గురువారం ప్రారంభమైంది. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఈ చర్చను ప్రారంభించారు. ఈ ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించి 20 నెలలు అయిన సందర్భంగా, గవర్నర్ తన ప్రసంగంలో ప్రభుత్వ లక్ష్యాలు, విజయాలను ప్రస్తావించారని ఆయన అన్నారు. వైసీపీ హయాంలోని 'జంగిల్ రాజ్' నుంచి రాష్టాన్ని కూటమి ప్రభుత్వం బయటపడేసి స్థిరత్వం తీసుకొచ్చిందని వెంకట్రాజు పేర్కొన్నారు. రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు వంటి అనేక అంశాల్లో పురోభివృద్ధి కనిపిస్తోందని తెలిపారు. నేక రంగాల్లో గణనీయమైన మార్పు వచ్చిందని గవర్నర్ ప్రసంగంలో పేర్కొన్నారని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని.. తనను తాను సామాజిక సేవకుడిగా ప్రకటించుకున్నారని ఆయన చెప్పారు. ఎడారి ప్రాంతాలను కూడా ఉద్యానవనాలుగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో విద్యా విధానం ఒడిదుడుకులు ఎదుర్కొందని.. గత ప్రభుత్వ పాలకుల వ్యవస్థల విధ్వంసం వల్ల అనేక కంపెనీలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయాయని ఆయన విమర్శించారు. వైసీపీ హయాంలో మహిళల భద్రత, శాంతిభద్రతలు దారుణమైన పరిస్థితుల్లో ఉన్నాయని ఎమ్మెల్యే వెంకట్రాజు ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం 'సూపర్ సిక్స్' పేరుతో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. అమరావతి రాజధాని మాత్రమే కాదని.. ఆంధ్రప్రజల భవిష్యత్తు అని ఆయన అన్నారు. నదుల అనుసంధానం, సాగునీరు అంద జేయడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. గవర్నర్ ప్రసంగానికి పూర్తి మద్దతు తెలియజేస్తున్నామని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పేర్కొన్నారు.




# పోలీసులపై దురుసు ప్రవర్తన

## కాంగ్రెస్ నేత జగ్గారెడ్డిపై కేసు నమోదు

**సంగారెడ్డి,ఫిబ్రవరి12(నేషనలిస్ట్ వాయిస్):**

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, కాంగ్రెస్ నేత జగ్గారెడ్డిపై సంగారెడ్డి పోలీసులు కేసు నమోదు చేశారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల విధులకు ఆటంకం కలిగించారంటూ ఆయనపై కేసు నమోదు చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ చర్య తీసుకున్నారు. జగ్గారెడ్డిపై సంగారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో బీఎన్ఎస్ 223, 351, 352, 132, 329 సెక్షన్ల కింద కేసు నమోదు అయ్యింది. బుధవారం సంగారెడ్డి పోలింగ్ బూత్ వద్ద జరిగిన సంఘటనపై ప్రెస్‌నోట్‌లో వివరణ ఇచ్చారు జగ్గారెడ్డి. నిన్న సంగారెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో పోలింగ్ బూత్ వద్ద కాంగ్రెస్ నాయకుడిని సీఐ గల్లా పట్టుకొని ఈడ్చుకొచ్చి కొట్టారని తెలిపారు. తన పార్టీ నాయకుడిని రక్షించుకోవడానికి బూత్‌కు వెళ్లి సీఐని తిట్టాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. ప్రత్యర్థి పార్టీ అభ్యర్థికి మద్దతుగా సీఐ... తమ పార్టీ నాయకుడిని అవమానించారని తెలిపారు. కావాలని లా అండ్ ఆర్డర్ దెబ్బతినేట్లు చేసిన సీఐని తిట్టడం జరిగిందని జగ్గారెడ్డి వివరించారు. ఈ విషయంపై పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయవచ్చని.. కానీ పది మంది మధ్యలో తమ పార్టీ నాయకుడికి సీఐ చేసిన అవమానం పోగొట్టడానికి బూత్ దగ్గరకు వెళ్లాల్సి వచ్చిందని జగ్గారెడ్డి తెలిపారు. ఎన్నికల నిబంధనలను సీఐ లేదా తాను ఉల్లంఘించినా.. అధికారులు తగిన చర్యలు తీసుకుంటారని చెప్పారు. అందరూ దానిని స్వాగతించాలని అన్నారు. న్యాయస్థానంలో ఎవరి తప్పు, ఎవరి ఒప్పు తేలుతుందని పేర్కొన్నారు. ఈ సంఘటనను నిన్న సాయంత్రం 5 గంటలకే వదిలేశానని చెప్పారు. సంగారెడ్డిలో జరిగిన సంఘటనను కేటీఆర్, హరీశ్ రావు, బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియాలో తిప్పారని మండిపడ్డారు. అధికారులపై జగ్గారెడ్డి దాడి చేస్తున్నారంటూ పదేపదే ప్రచారం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే ఆరోపించారు. 'గతంలో కేటీఆర్ ఒక పోలీసు అధికారిని బూతు పదజాలంతో తిట్టారు. తెలంగాణ పోలీసులను తన్ని, తిట్టి, 'ఆంధ్రోళ్లకు పుట్టారా' అంటూ హరీశ్ రావు నీచంగా మాట్లాడారు' అని గుర్తు చేశారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా ముందుగా కేటీఆర్, హరీశ్ రావు తిట్టిన విషయాలకు సమాధానం చెప్పి, ఆ తర్వాత తన గురించి మాట్లాడితే బాగుంటుందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి హితవుపలికారు

# రోజూ గంటన్నర పాటు ప్రశ్నోత్తరాలు బిఎఎసి

**అమరావతి,ఫిబ్రవరి12(నేషనలిస్ట్ వాయిస్):**

శాసనమండలి బీఏసీ సమావేశం జరిగింది. అన్ని పార్టీల సభ్యులతో చర్చించి పలు నిర్ణయాలను మండలి బీఏసీ తీసుకుంది. మండలిని ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నడపాలని నిర్ణయించినట్లు మండలి ఛైర్మన్ మోషేన్ రాజు తెలిపారు. 'ప్రశ్నోత్తరాలు రోజూ గరిష్ఠంగా గంటన్నరపాటు నడపాలని నిర్ణయించాం. సభ్యుల ప్రశ్నలు, మంత్రుల సమాధానాలు క్లుప్తంగా ఇవ్వాలి' అని మోషేన్ రాజు తెలిపారు.

# తల్లికి వందనంపై మండలిలో మాటల యుద్ధం

## - ఎవరికీ పూర్తిగా రూ. 15 వేలు ఇవ్వలేదన్న బొత్స

## - ఫీజు రియంబర్స్‌మెంటులో ఎంత ఇచ్చారని నిలదీత

## -బొత్సస వ్యాఖ్యలను తిప్పికొట్టిన మంత్రి పార్థసారథి



**అమరావతి,ఫిబ్రవరి12(నేషనలిస్ట్ వాయిస్):**

తల్లికి వందనంపై శాసన మండలిలో మాటల యుద్ధం నడిచింది. శాసన మండలిలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మంత్రి పార్థసారథి - వైకాపా నేత బొత్స సత్యనారాయణ మధ్య వాడీవేడి చర్చ జరిగింది. పరస్పరం సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకున్నారు. తల్లికి వందనం కింద ప్రభుత్వం ఎవరికీ పూర్తిగా రూ. 15 వేలు ఇవ్వలేదని బొత్స అన్నారు. 15 శాతం మందికి తల్లికివందనం కింద కేవలం రూ. 7-8 వేలే చెల్లించారని చెప్పారు. ఏ నియోజకవర్గంలోనూ తల్లికి వందనం కింద పూర్తి డబ్బు చెల్లించలేదని బొత్స పేర్కొన్నారు. సభను తాను తప్పుదోవ పట్టించినట్లు రుజువు చేస్తే క్షమాపణ చెబుతానని చెప్పారు. మండలిలో గవర్నర్ ప్రసంగంపై టీడీపీ.. ధన్యవాదాల తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. తీర్మానంపై చర్చలో వైఎస్సార్‌సీపీ సభ్యులు సంధించిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక మంత్రి పార్థసారధి ఎదురుదాడికి దిగారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు మొత్తం ఇచ్చారా? అంటూ శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ నిలదీశారు. 80 శాతం మందికి పైగా విద్యార్థులకు ఏడు నుంచి ఎనిమిది వేల రూపాయల మాత్రమే ఇచ్చారని.. రికార్డుల ప్రకారమే మాట్లాడుతున్నామని తెలిపారు. 'నేను మాట్లాడిన మాటలు తప్పైతే రికార్డుల నుంచి తొలగించండి. నేను చెప్పింది వాస్తవమోకాదో మీ అధికారులతో విచారణ చేయించండి. తప్పు నాదైతే సభకు క్షమాపణ చెప్పడానికి నేను సిద్ధం' అంటూ బొత్స సవాల్ విసిరారు. తానూ 15 ఏళ్లు మంత్రిగా పనిచేశానని.. మీరు మాకు సభా సాంప్రదాయాలు నేర్పించాల్సిన అవసరం లేదని బొత్స పేర్కొన్నారు. విపక్ష నేత బొత్స చేసిన ఛాలెంజ్‌ను స్వీకరించేందుకు తాము సిద్ధమని మంత్రి పార్థసారథి వెల్లడించారు. 48 లక్షల మందికి 'అన్నదాత సుఖీభవ' ఇవ్వలేదని అబద్దాలు చెబుతున్నారని విమర్శించారు. ఒక్క రైతుకు కూడా రూ. 20 వేలు ఇవ్వలేదని వైకాపా సభ్యులు చెప్పడం సరికాదన్నారు. మైక్ ఉంది కదా అని ప్రభుత్వంపై బురదజల్లి.. ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని మంత్రి సూచించారు. చర్చ అనంతరం శాసనమండలి శుక్రవారానికి వాయిదా పడింది. సభ అనంతరం బొత్స సత్యనారాయణ అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ.. ప్రశ్నోత్తరాల్లో రెండు అంశాల పై చర్చ నడిచిందన్నారు. భూములు 99 పైసలుకే ఇవ్వడం పై ప్రశ్నించామని.. కానీ ప్రభుత్వం నుంచి సరైన సమాధానం రాలేదని తెలిపారు. వైఎస్సార్ హయాంలోనే విశాఖలో ఐటీని అభివృద్ధి చేశాం.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం 99 పైసలుకే భూములి స్తానంటోంది.. ఎందుకు కంపెనీలతో లాలూచీ పడి భూములివ్వాలంటూ బొత్స ప్రశ్నించారు. వైఎస్ జగన్ హయాంలోనే అదానీ డేటా సెంటర్ వచ్చింది. సీఎం కుటుంబ సభ్యులు 5 వేల కోట్ల భూములు కబ్జా చేశారు. 5 వేల కోట్లు కాదు వెయ్యి కోట్ల భూములే తమ వద్ద ఉన్నాయని గీతం సంస్థ చెబుతోంది. వేల కోట్ల భూములు కబ్జా చేయడమేంటి?. పెన్షన్లపై ప్రశ్నిస్తే ప్రభుత్వం వద్ద నుంచి సమాధానం లేదు. గవర్నర్ ప్రసంగంపై అధికారపార్టీ సభ్యులు డబ్బాలు కొట్టారు. ప్రతీ ఒక్కరికీ 15 వేలు తల్లికం వందనం ఇస్తామన్నారు. తల్లికి వందనం అందరికీ ఇచ్చారా అని ప్రశ్నిస్తే సమాధానం లేదు.తల్లికివందనం డబ్బులో పూర్తిగా తల్లుల ఖాతాల్లో జమ కాలేదు. చాలామంది ఖాతాల్లో ఏడెనిమిది వేలే జమ అయ్యాయి. మేం చెప్పిన విషయాలు అవాస్తవమని నిరూపిస్తే మా వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటామని చెప్పా. మేం వేసిన ప్రశ్నకు అడ్డగోలుగా మంత్రి సమాధానం చెబుతున్నారు. 15 ఏళ్లు నేను కూడా మంత్రిగా చేశా. మేం బాధ్యతారాహిత్యంగా వివరాలు లేకుండా ఏ విషయాన్ని ప్రశ్నించం. ఇప్పటికైనా ప్రభుత్వం బుద్ధి తెచ్చుకోవాలి. మీకు చేతనైతే మీ అధికారులతో ఎంక్వైరీ చేయించండి. మేం చెప్పింది అసత్యమని నిరూపించండి. ఈ సమావేశాలు ముగిసేలోపు తల్లికి వందనం బకాయిలను పూర్తిగా చెల్లించాలి. ప్రతిపక్షం చెప్పిన విషయాలను కనీసం పరిగణలోకి తీసుకోవడం కూడా ఈ ప్రభుత్వానికి చేతకావడం లేదు. ఈ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు చాలా బాధ కలిగిస్తున్నాయి. ఈ ప్రభుత్వం వచ్చాక కొత్తదా ఒక్క వితంతు పెన్షన్ కూడా ఇవ్వలేదు. గత వైఎస్సార్‌సీపీలో ఏడాదికి రెండు సార్లు కొత్త పెన్షన్లు ఇచ్చాం. కానీ ఈ ప్రభుత్వం ఒక్క కొత్త పెన్షన్ కూడా ఇవ్వలేదని బొత్స సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మూడవ తరగతి నుంచే అందుబాటులోకి 'ఏఐ'

## విద్య సహా అన్ని రంగాల్లో ఏఐ విస్తరిస్తోంది

## అన్ని విధాలుగా ఏఐని అందుబాటులోకి తెస్తాం

## కృత్రిమ మేధ రంగంలో భారత్ అభివృద్ధి

## కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడి

న్యూఢిల్లీ,ఫిబ్రవరి12(నేషనలిస్ట్ వాయిస్):

కృత్రిమ మేధస్సు (ఏఐ) విధానాన్ని భారతదేశంలోని విద్యార్థులందరికీ చేరువ చేస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా విద్య సహా అన్ని రంగాల్లో ఏఐ విస్తరిస్తోందని అన్నారు. దేశంలో 30 కోట్ల మంది విద్యార్థులు ఉన్నారని, 3వ తరగతి విద్యార్థుల నుంచి ఆధునాతన పరిశోధనలు నిర్వహించే విద్యార్థుల వరకు కృత్రిమ మేధను అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. ఢిల్లీలో జరిగిన ఏఐ-కాంక్లేవ్-2026 సదస్సులో పాల్గొన్న ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ, కృత్రిమ మేధ రంగంలో భారత్ అభివృద్ధి చెందుతోందని అన్నారు. మన వద్ద మేధో సామర్థ్యానికి లోటు లేదన్నారు. కృత్రిమ మేధకు సంబంధించి పలు పరిశోధనలు జరుగుతున్నట్లు తెలిపారు. ఏఐకి సంబంధించిన పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలను సృష్టించడంలో సాంకేతిక సంస్థలు నిమగ్నమయ్యాయని అన్నారు.

# నాపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారు

## నేనెప్పుడూ మహదేవప్పకు ఫోన్ చేయలేదు

## మహదేవప్ప ఆత్మహత్యపై మంత్రి వాకిటి

హైదరాబాద్,ఫిబ్రవరి12(నేషనలిస్ట్ వాయిస్):

మక్తల్ మున్సిపాలిటీలో 6వ వార్డు బీజేపీ అభ్యర్థి మహదేవప్ప ఆత్మహత్యపై మంత్రి వాకిటి శ్రీహరి స్పందించారు. మహదేవప్ప ఆత్మహత్యతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆయన అన్నారు. తనపై చేస్తున్న ఆరోపణలు రుజువైతే తాను దేనికైనా సిద్ధమని అన్నారు. మహదేవప్పను బెదిరించినట్లుగా జరిగిన ప్రచారంపై మంత్రి స్పందించారు. బీజేపీ అభ్యర్థికి తాను ఎప్పుడూ ఫోన్ చేయలేదని స్పష్టం చేశారు. తన ఫోన్ కాల్ డేటాను పరిశీలించవచ్చని అన్నారు. పోస్టుమార్టం నివేదిక తర్వాత వాస్తవాలు వెలుగు చూస్తాయని అన్నారు. మహదేవప్ప ఆత్మహత్య కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతుందని అన్నారు. ఎన్నికల భయంతోనే మరణించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారని వివరించారు. కాగా, మహదేవప్ప ఆత్మహత్యకు సంబంధించి ఆయన భార్య సత్యమ్మ పోలీసులకు ఇచ్చిన లేఖ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తనకు ఎవరూ ఓటు వేయరనే భయంతో తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు ఆమె పోలీసులకు లేఖ ఇచ్చారు. ఓడిపోతాననే భయంతో క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకున్నట్లు ఆమె ఆ లేఖలో పేర్కొన్నారు.

# బంగ్లాదేశ్‌లో సార్వత్రిక ఎన్నికలు

## కొలువుదీరనున్న కొత్త ప్రభుత్వం

## 299 పార్లమెంటు స్థానాలకు ఎన్నికలు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి12(నేషనలిస్ట్ వాయిస్):

ఏడాదికి పైగా తీవ్ర రాజకీయ అనిశ్చితిలో ఉన్న బంగ్లాదేశ్ లో ఈరోజు సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. ఏడాదిన్నర క్రితం షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన తర్వాత ఆ దేశం రాజకీయ సంక్షోభంలో కూరుకుపోయింది. అప్పటి నుంచి ఆ దేశ పాలనను మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం పర్యవేక్షిస్తోంది. మహమ్మద్ యూనస్ ఢాకాలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల తర్వాత బంగ్లాదేశ్ లో కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. మొత్తం 299 పార్లమెంటు స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. 1,981 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. సుమారు 12.7 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. షేక్ హసీనా పార్టీ అవామీ లీగ్ ను ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించిన సంగతి తెలిసిందే. దీంతో, ఆ పార్టీ లేకుండానే తొలిసారి ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో ప్రధాన పోటీ బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ, జమాతే ఇస్లామీ కూటమి మధ్య ఉంది. షేక్ హసీనా ప్రస్తుతం ఇండియాలో ఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే. హసీనా ప్రభుత్వం పతనమైన తర్వాత ఆ దేశంలో హిందువులపై దాడులు జరుగుతున్నాయి. ఇప్పటివరకు పలువురు హిందువులను దారుణంగా హత్య చేశారు. ఈ ఎన్నికల్లో జమాతే ఇస్లామీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే హిందువులపై దాడులు మరింత పెరిగే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

# సభా వ్యవహారాలు పిల్లలు చూస్తున్నారు

## వారికి మనం ఏం సందేశం

## ఇవ్వాలో చూడండి: స్పీకర్

అమరావతి,ఫిబ్రవరి12(నేషనలిస్ట్ వాయిస్):

ఏపీ అసెంబ్లీ సమావేశాలు రెండోరోజు  కొనసాగాయి. గురువారం ఉదయం శాసనసభ మొదలైన వెంటనే స్పీకర్ అయ్యన్న పాత్రుడు ప్రశ్నోత్తరాలు చేపట్టారు. పలు నియోజకవర్గాల్లో సమస్యలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానాలు ఇచ్చారు. అనంతరం, నిర్ణీత గడువుకు 10 నిముషాల ముందే ప్రశ్నోత్తరాలు ముగిశాయి. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ.. బుధవారం సభలో వైసీపీ సభ్యులు ప్రవర్తించిన తీరును ప్రస్తావించారు. రాజకీయాలు, చట్ట సభలు, ప్రజాప్రతినిధుల గురించి తెలుసుకుంటారని విద్యార్థులను సభకు పిలిచామన్నారు. ఇలాంటి సమయంలో గవర్నర్ ప్రసంగిస్తుండగా కొందరు సభ్యులు అనుచితంగా వ్యవహరించారని.. కాపీలను చించి విసిరారని తెలిపారు. ఇలాంటివి జరగడం బాధ కలిగించిందంటూ స్పీకర్ ఆవేదన వ్యక్తం చేశారు. 'సభా వ్యవహారాలు చూసే పిల్లలకు మనం ఎలాంటి సందేశం ఇస్తున్నాం. ఇవాళ చాలామంది పిల్లలు సభా వ్యవహారాలు చూసేందుకు వచ్చారు. చట్టసభలు, రాజకీయాలు అంటే పిల్లలకు సానుకూలత ఏర్పడాలని వారిని ఆహ్వానించాం. సభ చూసేందుకు వచ్చిన పిల్లలు ఇక్కడి వ్యవహారాలు చూస్తే ఏమనుకుంటారో ఆలోచించాలి' అని స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడించారు.

# అమెరికా ట్రేడ్ డీల్ ఫ్యాక్ట్‌షీట్‌లో మార్పులు

## వాణిజ్య ఒప్పందంపై భారత్ కీలక ప్రకటన

న్యూఢిల్లీ,ఫిబ్రవరి12(నేషనలిస్ట్ వాయిస్):

ఇండియా-యూఎస్ మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై భారత్ కీలక ప్రకటన చేసింది. రెండు దేశాల పరస్పర ప్రయోజనాలకు అనుగుణంగా ఈ ట్రేడ్ డీల్ జరిగినట్లు వెల్లడించింది. ఈ వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన ఫ్రేమ్‌వర్క్ అమలుకు ఇరుదేశాలు కలిసి పనిచేస్తున్నాయని తెలిపింది. ఈ ట్రేడ్ డీల్‌కు సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌పై ఫ్యాక్ట్‌షీట్‌లో అమెరికా ఇటీవల చేసిన సవరణలు రెండు దేశాల మధ్య భాగస్వామ్య అవగాహనలను ప్రతిబింబిస్తాయని స్పష్టం చేసింది. ఈ మేరకు విలేకరుల సమావేశంలో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణ్?ధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. ట్రేడ్ డీల్‌పై ఫ్యాక్ట్‌షీట్‌లో వైట్ హౌస్ చేసిన మార్పుల గురించి రణ్?ధీర్ జైస్వాల్‌ను విలేకరులు ప్రశ్నించారు. "ఇండియా-యూఎస్ మధ్యంతర వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌పై విడుదల చేసిన ఉమ్మడి ప్రకటన ఇరుపక్షాల మధ్య పరస్పర అవగాహనకు నిదర్శనం. ఇరుదేశాలు పరస్పర ప్రయోజనాల కోసం వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈ డీల్‌కు సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌పై ఇరుదేశాలు ఫిబ్రవరి 7న ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. భారత్, అమెరికా ఇప్పుడు ట్రేడ్ డీల్‌కు సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌ను అమలు చేయడానికి, మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడానికి కలిసి పనిచేస్తున్నాయి. యూఎస్ ఫ్యాక్ట్ షీట్‌లోని సవరణలు ఇరుదేశాల ఉమ్మడి ప్రకటనలో ఉన్న పరస్పర అవగాహనలను ప్రతిబింబిస్తాయి." అని రణ్‌ధీర్ జైస్వాల్ తెలిపారు. ఇటీవలే ఇండియా-యూఎస్ మధ్యంతర వాణిజ్య ఒప్పందం ఖరారైంది. ఈ నేపథ్యంలో కీలక అంశాలతో కూడిన ఫ్యాక్ట్ షీట్‌ను శ్వేతసౌధం సోమవారం రిలీజ్ చేసింది. ఆ తర్వాత కొన్ని గంటల్లోనే దానిలో ఇబ్బందికర అంశాల్లో మార్పులు చేపట్టింది. భారత ప్రభుత్వం కొన్ని పప్పు ధాన్యాలపై సుంకాలను తగ్గిస్తుందంటూ తొలుత పేర్కొన్న యూఎస్ ఆ తర్వాత ఆ లైన్‌ను తొలగించింది. నట్స్, సోయాబీన్ ఆయిల్, వైన్ వంటి జాబితా నుంచి పప్పు ధాన్యాలను తీసేసింది. అలాగే 500 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తుల కొనుగోళ్లకు 'భారత్ కట్టుబడి ఉంది' అన్న పదాన్ని 'కొనుగోలు చేయాలనే ఉద్దేశంతో ఉంది' అన్నట్లు మార్చేసింది.కాగా, భారత్‌కు అమెరికా ఎగుమతి చేసే వ్యవసాయ, పాడి ఉత్పత్తులపై సుంకాలను తగ్గించేందుకు మన దేశం తొలి నుంచి ఒప్పుకోవడం లేదు. అమెరికాతో ట్రేడ్ డీల్ వల్ల భారత రైతులకు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఎటువంటి నష్టం ఉండదని ఇటీవల కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూశ్ గోయల్ వెల్లడించారు. ఈ క్రమంలోనే ఫ్యాక్ట్‌షీట్‌లో అమెరికా సవరణలు చేయడం గమనార్హం. వాస్తవానికి ఫ్యాక్ట్‌షీట్‌ను శ్వేతసౌధం సోమవారమే రిలీజ్ చేసింది. అయితే 24 గంటల వ్యవధిలోనే దానిలో మార్పులు చేసింది. కొన్ని పదాలు, నిబంధనల విషయంలో అమెరికా వెనక్కి తగ్గింది. అయితే ఈ ఫ్యాక్ట్‌షీట్‌లో చేసిన సవరణల గురించి తాజాగా భారత్ క్లారిటీ ఇచ్చింది. ఈ వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన ఫ్రేమ్‌వర్క్ అమలుకు ఇరుదేశాలు కలిసి పనిచేస్తున్నాయని స్పష్టం చేసింది.అలాగే బంగ్లాదేశ్‌లో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలపైనా విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణ్?ధీర్ జైస్వాల్ స్పందించారు. ఎన్నికల కార్యకలాపాలను పర్యవేక్షించడానికి ఢాకా నుంచి భారత్‌కు అధికారిక ఆహ్వానం అందిందని వెల్లడించారు. అయితే బంగ్లాదేశ్ ఎన్నికల్లో ఇండియా జోక్యం చేసుకుంటుందనే భావనను నివారించడానికి తాము ఢాకాకు పరిశీలకులను పంపకూడదని నిర్ణయించుకున్నామన్నారు. "బంగ్లాదేశ్ ఎన్నికల కార్యకలాపాలను పర్యవేక్షించడానికి పరిశీలకులను పంపమని భారత్‌కు ఆహ్వానం అందింది. అయినా మేము ఎన్నికలను పర్యవేక్షించడానికి పరిశీలకులను బంగ్లాదేశ్‌కు పంపలేదు. బంగ్లా ప్రజలు ఏ విధమై తీర్పు ఇస్తారో వేచి చూస్తాం. బంగ్లాదేశ్‌లో స్వేచ్ఛాయుతమైన, న్యాయమైన, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరగాలని మేం కోరుకున్నాం " అని రణ్‌ధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు.

# ప్రభుత్వ కొత్త ఆరోగ్య పథకం

## అపరిమిత వైద్య సేవలు అందేలా పథకం

## ఉద్యోగుల హెల్త్‌కేర్ ట్రస్ట్ సమావేశంలో సీఎస్ వెల్లడి

హైదరాబాద్,ఫిబ్రవరి12(నేషనలిస్ట్ వాయిస్):

రాష్ట్రంలో ఉద్యోగుల నూతన ఆరోగ్య పథకాన్ని పది రోజుల్లో ప్రారంభించాలని నిర్ణయించారు. ఉద్యోగులు తమ మూల వేతనంలో ఒకటిన్నర శాతం చందా ఇస్తే అంతే మొత్తంలో ప్రభుత్వం వాటాగా ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. సచివాలయంలో సీఎస్ రామకృష్ణారావు అధ్యక్షతన ఉద్యోగుల హెల్త్‌కేర్ ట్రస్ట్ సమావేశం జరిగింది.ఉద్యోగులు, పెన్షనర్లు, వారి డిపెండెంట్లకు నగదు రహిత అపరిమిత వైద్య సేవలు అందేలా కొత్త ఈహెచ్ఎస్ పథకం ఉంటుందని ఉద్యోగ సంఘాలు తెలిపాయి. పోలీస్ శాఖకు ఆరోగ్య భద్రత, ఎక్సైజ్ శాఖ సహాయత పథకాలను కూడా ఈహెచ్?ఎస్?లో చేర్చే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందని అన్నారు. ఏటా ఉద్యోగులు, పెన్షనర్ల చందా రూ.528 కోట్లు కానుండగా ప్రభుత్వం రూ.528 కోట్ల రూపాయలు ఇవ్వనుంది. నూతన ఈహెచ్ఎస్ వివరాలను వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.రాష్ట్రంలో లక్షా 44 వేల మంది ఉద్యోగులు, పెన్షనర్లతో పాటు వారి డిపెండెంట్లు 12 లక్షల 84వేల ఉన్నారని తెలిపారు. ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్?లో ఉద్యోగ సంఘాల నుండి ఆరుగురు ప్రతినిధులు, పెన్షనర్ల నుండి ఇద్దరు సభ్యులుంటారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల నుంచి ఒకరిని ట్రస్టు సీఈవోగా నియమిస్తారు. త్వరలో మార్గదర్శకాలు రూపొందించడంతో పాటు భవిష్యత్తులో అవసరమైన మార్పులు, చేర్పులు చేయనున్నట్లు సీఎస్ తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలు, మోడల్ స్కూల్స్, గురుకులాల సిబ్బందికి కూడా ఈహెచ్ఎస్ వర్తింప చేయాలని ఉద్యోగ సంఘాలు కోరగా పథకం ప్రారంభమైన తర్వాత ట్రస్టులో తీర్మానం చేయవచ్చునని సూచించారు. పక్క రాష్ట్రాల్లో అత్యవసరంగా చికిత్స పొందినప్పుడు ఈహెచ్?ఎస్? వర్తింపజేసే విషయం కూడా పరిశీలిస్తామని తెలిపారు. నగదు రహిత వైద్య సేవల కోసం ఇప్పటి వరకు 515 ఆసుపత్రులను గుర్తించినట్లు అధికారులు వివరించారు. సమావేశంలో ఉన్నతాధికారులు సీవీ ఆనంద్, మహేష్ దత్ ఎక్కా, సందీప్ కుమార్ సుల్తానియా, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.ప్పుడు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులకు నగదు రహిత ఆరోగ్య సేవలను రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా అమలు చేస్తున్నారు. ఇప్పటివరకు ఈ సేవలను ఉచితంగా అందించినప్పటికీ అవి నామమాత్రంగా ఉంటున్నాయి. ప్రైవేట్? హాస్పిటళ్లకు బకాయిలు సకాలంలో చెల్లించకపోవడంతో ఉద్యోగుల కార్డులు ఆసుపత్రుల్లో సరిగా చెల్లుబాటు కావడం లేదు. మొదట బిల్లులు చెల్లించి రీయింబర్స్‌మెంట్‌కు అప్లై చేసుకున్నా బిల్లుల్లో సగం మొత్తం కూడా తిరిగి రావడం లేదు. నూతనంగా అమలు అయ్యే పథకంలో ఉద్యోగుల బేసిక్ నుంచి ఒకటిన్నర శాతం డబ్బు భాగస్వామ్యంతో నూతన మార్గదర్శకాలు విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధం అయినట్లు తెలుస్తోంది. ఉదాహరణకు ఒక ప్రభుత్వ ఉద్యోగికి రూ.50 వేల బేసిక్ ఉంటే నెలకు రూ.750 వరకు నూతన పథకంలో ఉద్యోగి కాంట్రిబ్యూషన్‌గా చెల్లించాల్సి ఉంటుందని సమాచారం. తొలుత ఈ పథకాన్ని బీమా విధానంలో అమలు చేయాలనుకున్నా తరువాత ట్రస్టు విధానంలోనే అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్టు పర్యవేక్షణలోనే ఇది కొనసాగనుందని సమాచారం.

# భూ కేటాయింపులపై శాసన మండలిలో వాడీవేడి చర్చ

## పెట్టుబడుల రాకుండా వైకాపా కుట్రలు - రియల్ ఎస్టేట్ సంస్థలకు భూ కేటాయింపులు అబద్ధం

## క్రెడిబులిటీ ఉన్న ఐదు సంస్థలకే 99 పైసల చొన్నున కేటాయింపు - విపక్ష సభ్యుల ఆరోపణలు తిప్పికొట్టిన మంత్రి లోకేశ్

అమరావతి,ఫిబ్రవరి12(నేషనలిస్ట్ వాయిస్):

రాష్ట్రానికి పెట్టుబడులు రాకూడదని వైకాపా కుట్రలు చేసిందని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. పరిశ్రమలకు భూ కేటాయింపులపై శాసన మండలిలో వాడీవేడి చర్చ జరిగింది. కంపెనీల పేరిట రియల్ ఎస్టేట్ సంస్థలకు అప్పనంగా భూములను కట్టబెట్టారంటూ వైకాపా సభ్యులు చేసిన ఆరోపణలను మంత్రి లోకేశ్ తిప్పికొట్టారు. క్రెడిబులిటీ ఉన్న ఐదు సంస్థలకే 99 పైసల చొప్పున భూములు కేటాయించామని.. ఆధారాలు లేకుండా విమర్శలు చేస్తే సహించబోమని లోకేశ్ చెప్పారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్లే 18 నెలల్లో  భారీగా పెట్టుబడులు వచ్చాయన్నారు. ఆర్సెలార్ మిత్తల్ ప్రాజెక్ట్ ఉత్తరాంధ్రకు రానుందని.. దీనికి భూములు కేటాయించామని మంత్రి లోకేశ్ అన్నారు. టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి సంస్థలకు భూములు ఇవ్వడం తప్పా? అని నిలదీశారు. వైకాపా పాలనలో విశాఖకు కనీసం ఒక్క కంపెనీ అయినా తీసుకొచ్చారా అని ప్రశ్నించారు.  మండలిలో భూ కేటాయింపులపై వాడివేడి చర్చ నడుస్తోంది. కంపెనీలకు 99 పైసలకు ఎకరం భూమిలిచ్చారనే అంశంపై వాగ్వాదం నడిచింది. భూమిలిచ్చినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తానని గతంలోనే ఛాలెంజ్ చేశానని, వాళ్లు ఆధారాలు తీసుకురాలేకపోయారని మంత్రి లోకేష్ అన్నారు. క్రెడిబులిటీ ఉన్న కంపెనీలకే భూములు ఇస్తున్నాం అని లోకేష్ స్పష్టం చేశారు. రియల్ ఎస్టేట్ సంస్థలకు భూములు ఎలా ఇస్తారు? అని శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. రహేజా రియల్ ఎస్టేట్ వ్యవస్థ కాదని మంత్రి అచ్చెన్నాయుడు బదులిచ్చారు. మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ? 'విశాఖను ఐటీ క్యాపిటల్‌గా చేయాలని ప్లాన్ ప్రకారం ముందుకు వెళుతున్నాం. ఇరవై లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. ఉద్యోగాల కల్పన మా ప్రభుత్వ లక్ష్యం. ప్రభుత్వానికి ఆదాయం తగ్గినా ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాం. ఐటీ రంగంలో ఐదు కంపెనీలలో ఐదు లక్షల ఉద్యోగాల కల్పన మా లక్ష్యం. దేశంలో నే 23.5శాతం పెట్టుబడులు ఏపీకి వస్తున్నాయి' అని అన్నారు. శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. 'వైజాగ్‌లో 2006లోనే ఐటీ ఎకో సిస్టమ్ ఏర్పాటు చేశాం. 2019 వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక అదానీ డేటా సెంటర్ వచ్చింది. వైజాగ్‌లో చంద్రబాబు కుటుంబ సభ్యులకు ఐదు వేల కోట్ల భూములు ఇస్తున్నారు. గీతంకి భూములు కేటాయింపుపై వాక్ ఔట్ చేస్తున్నాం' అని అన్నారు. భూ కేటాయింపుల ప్రశ్నకు ప్రభుత్వ సమాధానానికి నిరసనగా ఆ ప్రశ్న నుంచి వైసీపీ ఎమ్మెల్సీలు వాకౌట్ చేశారు. శాసనమండలిలో 99 పైసలుకు పరిశ్రమలకు భూములు కేటాయింపుపై వైసీపీ ఎమ్మెల్సీ మాధవరావు ప్రభుత్వానికి ప్రశ్న వేయగా.. ఐదు కంపెనీలకు 99 పైసలకు భూములు కేటాయించినట్లు మంత్రి లోకేష్ తెలిపారు. 'గత 20 నెలల్లో ఏయే కంపెనీలకు 99 పైసలకే భూములు ఇచ్చారు. ఎవరికి ఎన్ని ఎకరాలు ఎంత ధరకు ఇచ్చారో చెప్పలేదు. గతేడాది ప్రారంభమైన కంపెనీలకు కూడా 99 పైసలుకే భూమిలిచ్చారు. విజయవాడలో రూ.156 కోట్ల పెట్టుబడులకు రూ.600 కోట్ల విలువైన భూమిలిచ్చారు. అమరావతికి టెండర్లు పిలిచారు. లూలు సంస్థకు ఎందుకు టెండర్లు పిలవలేదు. రూ.3 వేల కోట్ల విలులైన భూమిని రియల్ ఎస్టేట్ సంస్థకు 99 పైసలుకే లీజుకు ఇచ్చారు. రియల్ ఎస్టేట్ సంస్థలు స్థలాలు కొనుక్కోలేవా. 5 వేల కోట్ల విలువైన భూములను విశాఖలోని ఓ విద్యాసంస్థ తమ ఆధీనంలో ఉంచుకుంది. ఆ సంస్థ కేవలం తాము వెయ్యి కోట్ల విలువైన భూమినే ఆక్రమించామని చెప్తోంది. వెయ్యి కోట్ల విలువైతే భూములను ఆక్రమించొచ్చా?' అని ఎమ్మెల్సీ మాధవరావు అడిగారు. మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ? 'ఎంవోయూలన్నీ క్లారిటీగా ఉన్నాయి. 99 పైసలుకి 5 కంపెనీలకు మాత్రమే భూములు కేటాయించాం. కాగ్నిజెంట్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్, రహేజా, మదర్స్ అండ్ ఇంటర్నేషనల్ కు 99 పైసలుకే భూమిలిచ్చాం. హైదరాబాద్లో రహేజా మైండ్ స్పేస్లో లక్ష మంది ఐటీ రంగంలో పనిచేస్తున్నారు. రహేజా గ్లోబల్ బిల్డ్ కాపబులిటీ సెంటర్లు నిర్మిస్తుంది. మేం భూమిలిచ్చిన ప్రతీ కంపెనీ క్రెడిబులిటీ ఉన్నవే. రహేజా వాళ్ళు లక్ష ఎకరాల్లో నిర్మాణాలు చేసి సాఫ్ట్వేర్ కంపెనీలకు అ÷-దదెకు ఇస్తారు. మేము పారదర్శకంగానే వాళ్లకు భూములు ఇస్తున్నాం. దానివల్ల వాళ్లు చేసిన నిర్మాణాల్లో పెద్ద ఎంఎన్సీ కంపెనీలకు ఇచ్చాం తప్ప అయానా.. గయానా కంపెనీలకు ఇవ్వలేదు' అని బదులిచ్చారు.

# దూరదర్శన్ తొలితరం న్యూస్ రీడర్ సరళా మహేశ్వరి కన్నుమూత

హైదరాబాద్,ఫిబ్రవరి12(నేషనలిస్ట్ వాయిస్):

భారత టెలివిజన్ రంగంలో సుపరిచితమైన ముఖం, దూరదర్శన్ సీనియర్ న్యూస్ యాంకర్ సరళా మహేశ్వరి (71) కన్నుమూశారు. ఆమె మృతి పట్ల దూరదర్శన్ నేషనల్ చానల్ సోషల్ మీడియా వేదికగా తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఆమె సౌమ్యమైన స్వరం, స్పష్టమైన ఉచ్చారణ, వార్తలను హుందాగా అందించే తీరుతో భారతీయ వార్తా ప్రపంచంలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని నివాళి అర్పించింది. "దూరదర్శన్ కుటుంబం తరపున సరళా మహేశ్వరికి హృదయపూర్వక నివాళులు. ఆమె తన సరళత, హుందాతనంతో వీక్షకులలో చెరగని ముద్ర వేశారు" అని డీడీ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. సరళాతో కలిసి పనిచేసిన సీనియర్ యాంకర్ షమ్మీ నారంగ్ కూడా ఆమె మృతిపై విచారం వ్యక్తం చేశారు. "సరళా సౌజన్యానికి, మర్యాదకు ప్రతిరూపం. అపారమైన భాషా పరిజ్ఞానం కలిగిన వ్యక్తి" అని ఆయన పేర్కొన్నారు. ఆమె మృతితో టెలివిజన్ జర్నలిజంలో ఒక స్వర్ణయుగం ముగిసిందని మహిళా కాంగ్రెస్ అభివర్ణించింది. ఢిల్లీ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్న సమయంలో, 1976లో సరళా మహేశ్వరి దూరదర్శన్‌లో న్యూస్ అనౌన్సర్‌గా తన కెరీర్‌ను ప్రారంభించారు. భారత టెలివిజన్ రంగంలో లైవ్‌లో వార్తలు చదివిన తొలితరం యాంకర్లలో ఆమె ఒకరు. 1984 వరకు డీడీలో పనిచేసి, ఆ తర్వాత యూకే వెళ్లి 1986 వరకు బీబీసీలో న్యూస్ రీడర్‌గా సేవలందించారు. 1988లో తిరిగి భారత్‌కు వచ్చి మళ్లీ దూరదర్శన్‌లో చేరారు. బ్లాక్ అండ్ వైట్, తొలితరం కలర్ టీవీల కాలంలో తన ప్రశాంతమైన, హుందా శైలితో ఆమె ప్రతి ఇంట్లోనూ సుపరిచితమైన, విశ్వసనీయమైన యాంకర్‌గా నిలిచారు.

# పాతబస్తీలో రౌడీ గ్యాంగ్ హల్‌చల్

## వ్యాపారిపై తల్వార్‌తో దాడి

**హైదరాబాద్,ఫిబ్రవరి12(నేషనలిస్ట్ వాయిస్):**

హైదరాబాద్ పాతబస్తీలో రౌడీషీటర్ల ఆగడాలు మితిమీరుతున్నాయి. తాజాగా కాలాపత్తర్ ప్రాంతంలో రౌడీషీటర్ అసద్, అతని గ్యాంగ్ చేసిన దాడి స్థానికంగా తీవ్ర భయాందోళనలు సృష్టించింది. చట్టాన్ని, పోలీసులను ఏమాత్రం లెక్కచేయకుండా వారు జరిపిన ఈ దాడి దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. కాలాపత్తర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫాతిమా ఆస్పత్రి వద్ద ఈ దారుణం చోటుచేసుకుంది. రౌడీషీటర్ అసద్ తన అనుచరులతో కలిసి ఒక షాప్ యజమానిపై కత్తితో దాడికి తెగబడ్డాడు. షాప్ యజమాని తన మోటార్ సైకిల్‌పై కూర్చుని ఉండగా, అసద్ గ్యాంగ్ ఆకస్మికంగా తల్వార్లతో విరుచుకుపడింది. దాడి చేసిన అనంతరం, వారు షాపులోని ఫ్రిడ్జ్‌ను ధ్వంసం చేశారు. అంతేకాకుండా షాప్ అద్దాలను కూడా పగలగొట్టి హంగామా సృష్టించారు. ఈ ఘటనతో స్థానికులు భయంతో వణికిపోతున్నారు. అయితే, ఈ రౌడీషీటర్ పాత నేరస్తుడని పోలీసులు చెబుతున్నారు. రౌడీషీటర్ అసద్ ఆగడాలపై అప్పటి నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ గతంలోనే పీడీ యాక్ట్ నమోదు చేశారు. అసద్ నేర ప్రవృత్తిని పరిగణనలోకి తీసుకున్న పోలీసులు, అతనిపై రాష్ట్ర బహిష్కరణ విధించారు. రాష్ట్ర బహిష్కరణ ఉత్తర్వులు ఉన్నప్పటికీ అసద్ పాతబస్తీలో ఎలా తిరుగుతున్నాడు..?, ఈ దాడికి గల కారణాలేమిటి..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా కేసు నమోదు చేసి, నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. రౌడీషీటర్ల వరుస దాడులతో పాతబస్తీ ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు మరింత కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# సింగరేణి సిఎండిగా బుద్ధప్రకాశ్ బాధ్యతలు

**హైదరాబాద్,ఫిబ్రవరి12(నేషనలిస్ట్ వాయిస్):**



సింగరేణి సంస్థ చైర్మన్, ఎండీగా నియమితులైన సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ గురువారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో అధికారిక బాధ్యతలు స్వీకరించారు. 2002 బ్యాచ్ తెలంగాణ కేడర్‌కు చెందిన బుద్ధ ప్రకాష్ గతంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖకు ప్రభుత్వ కార్యదర్శిగా పనిచేశారు. రవాణా, భూమి రికార్డులు , సామాజిక సంక్షేమంలో విస్తృత అనుభవం ఆయనకు ఉంది. రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపుల కమిషనర్ , ఇన్‌స్పెక్టర్ జనరల్, సర్వే సెటిల్మెంట్లు అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ , భూభారతి ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు.

# సింగరేణిలో కార్మిక సమ్మె ప్రభావం

## సమ్మెతో పూర్తిగా నిలిచిన పనులు

**పెద్దపల్లి,ఫిబ్రవరి12(నేషనలిస్ట్ వాయిస్):**

దేశవ్యాప్త సమ్మెలోభాగంగా సింగరేణి రామగుండం ఏరియాలోని ఆర్జీ-3, అర్జీ-2, ఏపీఏ ప్రాంతాల్లో పర్మనెంట్, కాంట్రాక్ట్ కార్మికులు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొన్నారు. కార్మికుల ఐక్య సమ్మెతో పనులు నిలిచిపోయాయి. కేంద్ర ప్రభుత్వం 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగా ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ కార్మిక వర్గం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో బీఎంఎస్ మినహా అన్ని కార్మిక సంఘాలు పాల్గొన్నాయి. భూగర్భ, ఓపెన్ కాస్ట్ గనులలో కార్మికులు స్వచ్ఛందంగా విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు.గోదావరిఖని 2వ బొగ్గు గని ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో నాయకులు నిరసన చేపట్టారు. నాలుగు లేబర్ కోడ్ ల వల్ల కార్మికుల హక్కులను హరించి వేస్తుందని నాయకులు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని లేదంటే భవిష్యత్తులో కార్మికులకు మనుగడ ఉండదన్నారు. అలాగే గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న సింగరేణి బ్లాక్ లను సింగరేణి సంస్థకు కేటాయించాలని డిమాండ్ చేశారు.

# కార్మిక చట్టాలకు నిరసనగా బంద్

## తెలంగాణలో పలుచోట్ల ఆందోళన

**హైదరాబాద్,ఫిబ్రవరి12(నేషనలిస్ట్ వాయిస్):**

కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా చేపట్టిన సమ్మె ప్రశాంతంగా కొనసాగింది. తెలంగాణ రాష్ట్రంలో సమ్మెతో ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో సేవలు నిలిచిపోయాయి. సార్వత్రిక సమ్మెకు సహకరించాలని డ్రైవర్లు ఎక్కడికక్కడే బస్సులు, కార్లు, ఆటోలను అడ్డుకున్నారు. రోడ్డుపైనే వాహనాలను నిలువరించి ప్రయాణికులను దించేస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని చోట్ల కాలి నడకనతో తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు. అన్ని వర్గాల ప్రజలు తమ సమ్మెకు సహకరించాలని డ్రైవర్లు ప్రజలను వేడుకుంటున్నారు. సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొన్నారు. కార్మికుల ఐక్య చర్యతో పనులు నిలిచిపోయాయి. కాగా, కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 12న భారత్ బంద్‌కు కేంద్ర కార్మిక, రైతు సంఘాల ఐక్య వేదిక పిలుపునిచ్చింది. సమ్మె కారణంగా బ్యాంకింగ్, బీమా, రవాణా రంగాలకు అంతరాయం ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక, జాతి వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను ప్రతిఘటిస్తూ దేశవ్యాప్త సమ్మెను నిర్వహిస్తున్నట్లు జనవరి 9న కొన్ని కార్మిక సంఘాలు ఐక్యంగా ప్రకటించిన విషయం తెలిసిందే.

# పారామెడికల్ కాలేజీ విద్యార్థుల ఫీజు మదింపు

**హైదరాబాద్,ఫిబ్రవరి12(నేషనలిస్ట్ వాయిస్):**

రాష్ట్రంలోని పారా మెడికల్ కళాశాలల్లో చదివే దాదాపు 30 వేల మంది విద్యార్థుల ఫీజు స్ట్రక్చర్ వివరాలను ఈ-పాస్ లో వెంటనే అప్లోడ్ చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమా శాఖ మంత్రి అడ్లూరి లక్షణ్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని పారా మెడికల కళాశాలల్లో చదువుతున్న ఎస్.సి. ఎస్.టి, బీ.సి లకు చెందిన విద్యార్థులకు సంబందించిన ఫీజు స్ట్రక్చర్ ను 2024 -25 నుండి ఈ-పాస్ లో పెట్టనందున దాదాపు 30 వేల మంది విద్యార్థులు స్కాలర్షిప్స్ కోల్పోయే ప్రమాదం ఉందని పారా మెడికల అసోసియేషన్ అధ్యక్షులు ఎం. శ్రీనివాస్, రావు, కార్యదర్శి మోహన్ రెడ్డి లు నేడు మంత్రి లక్షణ్ కుమార్ కు విజ్ఞాపన పత్రాన్ని అందించారు. దీనిపై స్పందించిన మంత్రి ఈ విషయంలో వెంటనే తగు చర్యలు తీసుకోవాల్సిందిన సంబంధిత అధికారులను ఆదేశించారు.

# 15న సంత్ సేవాలాల్ జయంతి

## బంజారా భవన్‌లో కార్యక్రమాలు

**హైదరాబాద్,ఫిబ్రవరి12(నేషనలిస్ట్ వాయిస్):**

ఈ నెల 15 వ తేదీ ఉదయం 11.00 గంటలకు హైదరాబాద్లో ఉన్న బంజారాహిల్స్ లోని సేవాలాల్ బంజారా భవన్లో లంబాడీ గిరిజనుల సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి ఘనంగాజరుగనుంది. ఈ జయంతి ఉత్సవాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు, రాష్ట్రానికి చెందిన అందరు గిరిజన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక కార్పొరేటర్ తదితర ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని గిరిజన సంక్షేమ శాఖామాత్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా లంబాడీ గిరిజన సాంప్రదాయ పద్ధతి ప్రకారం సంత్ సేవాలాల్ ఆరాధన కార్యక్రమాలు, గిరిజన సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.ఈ సందర్భాన్ని పురస్కరించుకుని గౌరవ మంత్రివర్యులు మాట్లాడుతూ 2024 నాటి సేవాలాల్ జయంతి కార్యక్రమంలో పాల్గొని గౌ. ముఖ్యమంత్రి శ్రీ అనుముల రేవంత్ రెడ్డి గారు అప్పటి వరకు వేడుకలకు ఖర్చు పెడుతున్న రూ. కోటిని రూ. రెండు కోట్లుగా రెట్టింపు చేయడమే కాకుండా బంజారా ఉద్యోగులకు ఉత్సవాలు జరుపుకోవడానికి వీలుగా ఫిబ్రవరి 15 నాడు స్పెషల్ లీవ్ శాంక్షన్ చేశారని గుర్తు చేశారు. ఈ నెల 15 నుంచి 21 వరకు అన్ని జిల్లాలలోని అన్ని ఎమ్మెల్యే నియోజకవర్గాలలో జరుగనున్న సేవాలాల్ జయంతి ఉత్సవాల నిర్వహణకై రాష్ట్ర ప్రభుత్వం రూ. రెండు కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన ప్రజలు, ప్రజా ప్రతినిధులు, మీడియా మిత్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరుతూ అందరికీ ఆహ్వానం పలికారు.

# గర్భిణీ మహిళ రక్షణకు చర్యలు

## మానవ హక్కుల కమిషన్ ఆదేశం

**హైదరాబాద్,ఫిబ్రవరి12(నేషనలిస్ట్ వాయిస్):**

లంగాణ మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ అధ్యక్షతన గురువారం మహేష్ ఫిర్యాదును పరిశీలించింది. యాదగిరిగుట్ట ఆలయంలో భాగ్యతో లవ్ మ్యారేజ్ చేసుకున్న అనంతరం, ఆ వివాహానికి వ్యతిరేకంగా ఉన్న ఆమె తండ్రి మరియు బావ కలిసి కల్వకుర్తి సమీపంలోని ఆసుపత్రిలో ఆమె నాలుగు నెలల గర్భాన్ని బలవంతంగా తొలగించేందుకు ప్రయత్నించారని, ఈ తీవ్ర ఒత్తిడి కారణంగా ఒక దశలో ఆమె ఆత్మహత్యకు కూడా ప్రయత్నించిందని, అలాగే పోలీసుల వైపు నుంచి ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం ద్వారా నిర్లక్ష్యం జరిగిందని పేర్కొన్న ఆరోపణలను కమిషన్ తీవ్రంగా పరిగణించింది. మహిళ స్వేచ్ఛా మరియు స్వచ్ఛంద సమ్మతి లేకుండా గర్భస్రావం చేయడం చట్టపరంగా తీవ్రమైన నేరమని పేర్కొన్న హక్కుల కమిషన్. కల్వకుర్తి సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ మరియు వంగూరు పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోలను తక్షణమే ఫిర్యాదుపై స్పందించి చట్టప్రకారం అవసరమైన చర్యలు చేపట్టాలని, నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో వ్యవహారాన్ని పర్యవేక్షించాలని ఆదేశిస్తూ, ఈ విషయంపై 26.02.2026 నాటికి సమగ్ర నివేదిక సమర్పించాలని మరియు అత్యవసరంగా సంబంధిత అధికారులకు ఉత్తర్వులు తెలియజేయాలని ఆదేశించింది. ఇదిలావుంటే తెలుగు దినపత్రికలో 'అల్లరి చేస్తున్నాడని కన్నుపోయేలా దాడి? బాలుడిపై అంగన్వాడీ టీచర్ దాష్టీకం' అనే శీర్షికతో ప్రచురితమైన వార్తా నివేదికను సుమోటోగా కేసు నమోదుచేశారు. ఈ అంశం పై వివరణాత్మక నివేదికను సమర్పించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ వారిని ఆదేశించారు.

# స్పోర్ట్స్ హ్యాకథాన్‌కు పోస్టర్, లోగో ఆవిష్కరణ

## గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు మంత్రి వెల్లడి

**హైదరాబాద్,ఫిబ్రవరి12(నేషనలిస్ట్ వాయిస్):**

హైదరాబాద్ లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో స్పోర్ట్స్ హ్యాకథాన్‌కు పోస్టర్ / లోగోను మంత్రి వాకిటి శ్రీహరి, శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, హ్యాకథాన్ నిర్వాహకులు సందీప్ కుమార్ మక్తాలు ఆవిష్కరించారు. ప్రపంచంలోనే మొట్టమొద,అతిపెద్ద స్టేడియం స్థాయి స్పోర్ట్స్ ఇన్నోవేషన్ లీగ్ అయిన స్పోర్ట్స్ హ్యాకథాన్ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, మత్స్య, క్రీడా, యువజన సర్వీసులు శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. స్పోర్ట్స్ హ్యాకథాన్ కేవలం ఒక పోటీ కార్యక్రమం మాత్రమే కాదని, ఇది క్రీడలు మరియు సాంకేతికతను సమన్వయం చేసే విశ్వస్థాయి ఉద్యమమని మంత్రి పేర్కొన్నారు. సంప్రదాయ హ్యాకథాన్‌లకు భిన్నంగా, ప్రొఫెషనల్ స్టేడియంలో నిర్వహించబడే ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు ప్రత్యక్షంగా క్రీడల్లో పాల్గొని, ఆ అనుభవాన్ని ఆధారంగా చేసుకుని క్రీడలకు సంబంధించిన వాస్తవ సమస్యలకు సృజనాత్మక మరియు ఆచరణాత్మక పరిష్కారాలను రూపొందిస్తారని తెలిపారు. తెలంగాణలోని అన్ని 33 జిల్లాల నుండి యువత, క్రీడాకారులు, విద్యార్థులు, టెక్నాలజీ నిపుణులు మరియు స్టార్టప్‌లను ఒకే వేదికపైకి తీసుకురావడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని, సుమారు 10,000 మంది పాల్గొనేవారిని సమీకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని మంత్రి వెల్లడించారు. అంతేకాకుండా, కొంతమంది అంతర్జాతీయ ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననుండటం విశేషమన్నారు. ప్రపంచంలోనే మొదటి స్టేడియం స్థాయి స్పోర్ట్స్ హ్యాకథాన్ కావడంతో గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించే దిశగా కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. ఈ వినూత్న నమూనా ద్వారా తెలంగాణను క్రీడా ఆవిష్కరణల గ్లోబల్ కేంద్రంగా నిలబెట్టడం మా లక్ష్యమని స్పష్టం చేశారు.స్పోర్ట్స్ హ్యాకథాన్ ద్వారా యువతలో సృజనాత్మకత, ఆవిష్కరణాత్మక ఆలోచనలకు ప్రోత్సాహం లభిస్తుందని, క్రీడా రంగ భవిష్యత్తును రూపుదిద్దే చారిత్రాత్మక అడుగుగా ఇది నిలుస్తుందని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మార్చి 28, 29 తేదీలలో జరిగే స్పోర్ట్స్ హ్యాకథాన్ లో యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొనాలని మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు.


# గర్భిణీ మహిళ రక్షణకు చర్యలు

## మానవ హక్కుల కమిషన్ ఆదేశం

**హైదరాబాద్,ఫిబ్రవరి12(నేషనలిస్ట్ వాయిస్):**

లంగాణ మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ అధ్యక్షతన గురువారం మహేష్ ఫిర్యాదును పరిశీలించింది. యాదగిరిగుట్ట ఆలయంలో భాగ్యతో లవ్ మ్యారేజ్ చేసుకున్న అనంతరం, ఆ వివాహానికి వ్యతిరేకంగా ఉన్న ఆమె తండ్రి మరియు బావ కలిసి కల్వకుర్తి సమీపంలోని ఆసుపత్రిలో ఆమె నాలుగు నెలల గర్భాన్ని బలవంతంగా తొలగించేందుకు ప్రయత్నించారని, ఈ తీవ్ర ఒత్తిడి కారణంగా ఒక దశలో ఆమె ఆత్మహత్యకు కూడా ప్రయత్నించిందని, అలాగే పోలీసుల వైపు నుంచి ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం ద్వారా నిర్లక్ష్యం జరిగిందని పేర్కొన్న ఆరోపణలను కమిషన్ తీవ్రంగా పరిగణించింది. మహిళ స్వేచ్ఛా మరియు స్వచ్ఛంద సమ్మతి లేకుండా గర్భస్రావం చేయడం చట్టపరంగా తీవ్రమైన నేరమని పేర్కొన్న హక్కుల కమిషన్. కల్వకుర్తి సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ మరియు వంగూరు పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోలను తక్షణమే ఫిర్యాదుపై స్పందించి చట్టప్రకారం అవసరమైన చర్యలు చేపట్టాలని, నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో వ్యవహారాన్ని పర్యవేక్షించాలని ఆదేశిస్తూ, ఈ విషయంపై 26.02.2026 నాటికి సమగ్ర నివేదిక సమర్పించాలని మరియు అత్యవసరంగా సంబంధిత అధికారులకు ఉత్తర్వులు తెలియజేయాలని ఆదేశించింది. ఇదిలావుంటే తెలుగు దినపత్రికలో 'అల్లరి చేస్తున్నాడని కన్నుపోయేలా దాడి? బాలుడిపై అంగన్వాడీ టీచర్ దాష్టీకం' అనే శీర్షికతో ప్రచురితమైన వార్తా నివేదికను సుమోటోగా కేసు నమోదుచేశారు. ఈ అంశం పై వివరణాత్మక నివేదికను సమర్పించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ వారిని ఆదేశించారు.


# కాన్పూర్‌లో పాదచారులపై లంబోర్గి కారు

## ఘటనలో వ్యాపారవేత్త కుమారుడి అరెస్ట్

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి12(నేషనలిస్ట్ వాయిస్):**

ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో పాదచారుల పైకి లంబోర్గిని కారు దూసుకెళ్లిన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రమాదానికి కారణమైన కారును నడిపిన ప్రముఖ పొగాకు వ్యాపారి కేకే మిశ్రా కుమారుడు శివంను తాజాగా పోలీసులు అరెస్టు చేశారు. ఘటన జరిగిన నాలుగు రోజుల తర్వాత ఈ అరెస్టు చోటుచేసుకుంది. కాన్పూర్‌లోని వీఐపీ రోడ్‌లో ఆదివారం మధ్యాహ్నం వేగంగా వస్తున్న లంబోర్గిని కారు ఒక్కసారిగా అదుపుతప్పింది. ఈ క్రమంలో రోడ్డుపై ఉన్న పాదచారులు, వాహనాల పైకి అది దూసుకెళ్లింది. దీనికి ముందు ఈ లగ్జరీ కారు ఓ ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ కారు నడిపింది శివం మిశ్రానే అని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఈ క్రమంలో గురువారం ఉదయం అతడిని అరెస్టు చేశారు. అతడిని కోర్టులో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా.. బుధవారం ఈ కేసులో నాటకీయ పరిణామం చోటుచేసుకుంది. ప్రమాదానికి కారణమైన లంబోర్గిని కారును నడిపింది శివం కాదు.. తానే అంటూ మోహన్ అనే వ్యక్తి కాన్పూర్ కోర్టులో లొంగిపోవడానికి వచ్చాడు. ప్రమాదానికి కొన్ని క్షణాల ముందు శివం మూర్ఛపోయాడని.. అతడిని ఒక చేత్తో పట్టుకొని కారు నడిపానని వెల్లడించారు. ఈ క్రమంలో కారు ఓ ఆటోని ఢీకొట్టిందని, ఆ తర్వాత డివైడర్‌ను ఢీకొట్టి ఆగిపోయిందని వెల్లడించాడు. ప్రమాదం జరిగిన వెంటనే ఆటో లాకింగ్ సిస్టమ్ వల్ల తాను బయటకు రాలేకపోయానని, శివంను డ్రైవర్ సీటులోకి మార్చి.. తాను మరో సీటులోకి వెళ్లినట్లు వివరించాడు. అయితే, ప్రమాద సమయంలో కారు నడిపింది శివం మిశ్రానే అని పోలీసులు నిర్ధరించారు. ఘటన అనంతరం అతడిని డ్రైవర్ సీటు నుంచి బయటకు తీసిన వీడియోలు కూడా వెలువడ్డాయి. పోలీసుల వాదనలను గమనించిన న్యాయస్థానం మోహన్ లొంగిపోవడాన్ని నిరాకరించింది. దీనిపై వివరణాత్మక నివేదిక ఇవ్వాలని పోలీసులను కోరింది. ఘటనా సమయంలో కారు నడుపుతున్నది తానేనని, మిశ్రా కాదని ఒక వ్యక్తి స్థానిక కోర్టుకు వెళ్లి బుధవారం లొంగిపోయారు. అయితే మిశ్రా వాహనం నడిపాడని నిరూపించడానికి తమ వద్ద ఆధారాలు ఉన్నాయని పోలీసులు నిర్ధారించారు. కోర్టు ఎదుట లొంగిపోయేందుకు ఆయన పెట్టుకున్న అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. గురువారం ఉదయం పోలీసులు అతనిని అరెస్ట్ చేశారని, కోర్టు ఎదుట హాజరుపరుస్తారని పోలీస్ కమిషనర్ రఘుబీర్‌లాల్ తెలిపారు. మిశ్రాను ఢిల్లీలోని ఒక ఆస్పత్రి నుండి అదుపులోకి తీసుకున్నారని అన్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన 18ఏళ్ల ఈ రిక్షా డ్రైవర్ మహ్మద్ తాఫీక్ ఫిర్యాదు మేరకు పోలీసులు చర్యలు చేపట్టారు.

# రాహుల్ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

## లోక్‌సభలో బీజేపీ ఎంపీ నోటీసు!!

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి12(నేషనలిస్ట్ వాయిస్):**

లోక్ సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయాలంటూ బీజేపీ ఎంపీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు లోక్ సభలో బీజేపీ ఓ నోటీసును ఫైల్ చేసినట్లు సమాచారం. అయితే, రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా ప్రివిలేజ్ మోషన్ దాఖలు చేయలేదని తెలుస్తోంది. బడ్జెట్ సమావేశాల సందర్భంగా బుధవారం రాహుల్ గాంధీ లోక్ సభలో ప్రసంగించిన విషయం తెలిసిందే. రాహుల్ తన ప్రసంగంలో కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా కేంద్రం అమెరికాతో ట్రేడ్ డీల్ కుదుర్చుకుందని, ప్రధాని మోదీ దేశాన్ని అమెరికాకు అమ్మేశాడని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణె రాసిన బుక్ లో చైనా ఆక్రమణ విషయం స్పష్టంగా ఉందని, ఆ విషయంపై సభలో మాట్లాడకుండా అధికార పక్షం తనను అడ్డుకుంటోందని ఆయన ఆరోపించారు. ఈ ప్రసంగంపై కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు సభలోనే అభ్యంతరం వ్యక్తం చేశారు. ట్రేడ్ డీల్ తో భారత్ కు ఎలాంటి నష్టం లేదని వివరించారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలు దేశాన్ని అవమానించేలా ఉన్నాయని మండిపడ్డారు. ఈ క్రమంలోనే రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలంటూ నోటీసు ఇచ్చారు.

# ఎర్రకోట దాడి వెనుక జైషే హస్తం..

## నవంబర్ 9 నాటి దాడిలో 15 మంది మృతి

## జైషేపై ఐరాస సంచలన నివేదిక వెల్లడి

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి12(నేషనలిస్ట్ వాయిస్):**

పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న జైషే మహమ్మద్ (జేఈఎం) ఉగ్రవాద సంస్థపై ఐక్యరాజ్యసమితి (యూఎన్) సంచలన నివేదికను విడుదల చేసింది. గతేడాది ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన ఉగ్రదాడి వెనుక జైషే హస్తం ఉందని, ఆ సంస్థ మహిళలతో ప్రత్యేకంగా ఒక ఉగ్రవాద విభాగాన్ని కూడా ఏర్పాటు చేసిందని ఈ నివేదిక స్పష్టం చేసింది. ఐరాస భద్రతా మండలికి చెందిన ఆల్-ఖైదా, ఐసిస్ ఆంక్షల పర్యవేక్షణ బృందం ఈ నివేదికను రూపొందించింది. 2025 నవంబర్ 9న ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన దాడిలో 15 మంది మరణించారని, ఈ ఘటనతో జైషే మహమ్మద్‌కు సంబంధం ఉన్నట్లు తమకు సమాచారం అందిందని పేర్కొంది. ఈ దాడితో పాటు మరికొన్ని దాడులకు జైషే బాధ్యత వహించినట్లు ఒక సభ్య దేశం తెలిపినట్లు నివేదికలో పొందుపరిచారు. అంతేకాకుండా జైషే చీఫ్, అంతర్జాతీయ ఉగ్రవాది మసూద్ అజార్ 2025 అక్టోబర్ 8న 'జమాత్ ఉల్-ముమినత్' పేరుతో మహిళా విభాగాన్ని అధికారికంగా ప్రకటించినట్లు నివేదిక తెలిపింది.

# నేటి మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కు పకడ్బందీ ఏర్పాట్లు

## : జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్



నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ ముస్తాబాద్

సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేశామని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ తెలిపారు. సిరిసిల్ల సినారె కళామందిరంలో మాక్ కౌంటింగ్ ప్రక్రియ శుక్రవారం చేయగా, ఇంచార్జి కలెక్టర్, జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి తో కలిసి పరిశీలించారు. వేములవాడ సినారె కళామందిరంలో మాక్ కౌంటింగ్ ప్రక్రియను ఇంచార్జి కలెక్టర్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి పరిశీలించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలో సినారె కళామందిరాల్లో కౌంటింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వెల్లడించారు. బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచామని, ఇప్పటికే ఎస్పీ మహేష్ బి గితే తో కలిసి ఏర్పాట్లు పరిశీలించామని వివరించారు. శుక్రవారం ఉదయం 08.00 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని తెలిపారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కిస్తారని వివరించారు. ఒక్కో వార్డుకు ఒక టేబుల్ చొప్పున ఏర్పాటు చేశామని తెలిపారు. ఒక్కో టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్వైజర్, ఇద్దరు అసిస్టెంట్లు, మూడు టేబుల్ లకు కలిపి ఒక ఆర్ఓ, ఏఆర్ఓ ఉంటారని వెల్లడించారు. సిరిసిల్లలో మొత్తం 39 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 78 మంది కౌంటింగ్ అసిస్టెంట్లను నియమించామని తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు మొత్తం ప్రక్రియ పూర్తి చేస్తామని వివరించారు. వేములవాడ లో మొత్తం 28 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 56 మంది కౌంటింగ్ అసిస్టెంట్లను నియమించామని తెలిపారు. అధికారులు, సిబ్బందికి ఇప్పటికే శిక్షణ పూర్తి చేశామని తెలిపారు. ఈ ప్రక్రియ పర్యవేక్షణకు గెజిటెడ్ అధికారులను నియమించామని పేర్కొన్నారు. పరిశీలనలో ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, ఎన్నికల విభాగం అధికారులు శ్రీనివాసాచారి, మీర్జా ఫసహత్ అలీ బేగ్, అన్సార్ పాల్గొన్నారు.

## రాష్ట్ర కాంగ్రెస్ మైనార్టీసీ అధ్యక్షునిగా మహమ్మద్ ఇర్ఫాన్ అలీ నియామకం

నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ నిజామాబాద్ బ్యూరో

నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఇర్ఫాన్ అలీ, గురువారం రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షునిగా నియామకం అయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన సమావేశంలో మాట్లాడారు. తనను రాష్ట్ర కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా నియమించినందుకు జాతీయ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఇమ్రాన్ ప్రతాప్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఇందుకు సంహరించిన పిసిసి అధ్యక్షులు రాష్ట్ర కాంగ్రెస్ మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారులు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు ఎమ్మెల్యే భూపతి రెడ్డి లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ బాధ్యతను సక్రమంగా నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, కాంగ్రెస్ మైనారిటీ విభాగాన్ని రాష్ట్ర స్థాయిలో క్షేత్రం నుండి బలోపేతం చేస్తూ పార్టీ అభివృద్ధికి తోడ్పతానని తెలిపారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, ఇర్ఫాన్ అలీకి శుభాకాంక్షలు తెలిపి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సుచించారు. కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విపుల్ గౌడ్, అబుద్ బిన్ హందాన్, ప్రీతం, ముస్తఫా, అష్రఫ్ పాల్గొన్నారు



# మాదాపూర్‌లో హైడ్రా కూల్చివేతలు

## నిర్మాణాలు కూల్చివేస్తుండగా

## అడ్డుకున్న స్థానికులు

హైదరాబాద్,ఫిబ్రవరి12(నేషనలిస్ట్ వాయిస్):

హైదరాబాద్‌లోని మాదాపూర్ ఖానామెట్‌లో ఉద్రిక్తత నెలకొంది. సర్వే నెంబర్ 55లో రోడ్డుపై ఉన్న దుకాణాలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. ఇక్కడి అర్ధనారీశ్వర ఆలయం సమీపంలోని నిర్మాణాలను కూల్చివేస్తుండగా ఆలయ కమిటీ సభ్యులు, పుజారులు, స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో అక్కడ కాసేపు ఉద్రిక్తత ఏర్పడింది. ఈ నిర్మాణాలపై స్టేటస్ కో ఉందని అయినప్పటికీ హైడ్రా అధికారులు కూల్చివేశారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా దౌర్జన్యంగా కూల్చివేతలు చేపట్టారని ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని బాధితులు రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాగా, అనుమతులు లేకుండా భవనాలు, షెడ్డు నిర్మించారని ఆరోపిస్తూ హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. ప్రభుత్వ భూమిలో రోడ్డు పక్కన అనధికారికంగా దుకాణాలు ఏర్పాటు చేశారని, అవి అక్రమ నిర్మాణాలని హైడ్రా అధికారులు చెబుతున్నారు.

# రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు పచ్చజెండా

## కొత్తగా 114 విమానాల కొనుగోలుకు సన్నద్ధం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి12(నేషనలిస్ట్ వాయిస్):

త్రివిధ దళాల సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణ శాఖ మరో కీలక నిర్ణయం తీసుకుంది. 3.60 లక్షల కోట్ల రూపాయల విలువైన ఆయుధాలు, సైనిక పరికరాల కొనుగోలుకు కేంద్రం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు రక్షణశాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ నేతృత్వంలో సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ సంబంధిత ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. డీఏసీ ఆమోదించిన ప్రతిపాదనల్లో 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్ లభించింది. అదే విధంగా కాంబాట్ క్షిపణులు, ఎయిర్‌షిప్ ఆధారిత హై ఆల్టిట్యూడ్ సూడో శాటిలైట్ల కొనుగోలుకు అనుమతి లభించింది. వైభవ్ యాంటీ ట్యాంక్ మైన్స్, పీ-8ఐ విమానాల వంటి కీలక ఆయుధాలకు కూడా డీఏసీ ఆమోదం తెలిపింది. 'ఆత్మనిర్భర్ భారత్'కు ఇది మరింత ఊతమిస్తుందని రక్షణశాఖ తెలిపింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు వణుకు పుట్టించిన రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. మరికొన్ని రోజుల్లో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ భారత్ పర్యటనకు రానున్న వేళ ఈ డీల్‌కు డీఏసీ అమోదం తెలిపింది. 'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా రఫేల్ విమానాలను భారత్‌లోనే తయారు చేసే విధంగా కేంద్రం ప్రయత్నాలు చేస్తోంది. విమానాల విడిభాగాల తయారీ కోసం రఫేల్ మాతృ సంస్థ డసో ఏవియేషన్‌తో భారత్ చర్చలు జరపనుంది. ఫ్రాన్స్‌తో ఈ ఒప్పందం కుదిరితే భారత వైమానిక దళంలో రఫేల్ యుద్ధ విమానాల సంఖ్య 150కు చేరుకుంటుంది. ప్రస్తుతం భారత వాయుసేన దగ్గర 36 రఫేల్ యుద్ధ విమానాలు ఉన్నాయి.కాంబాట్ క్షిపణుల ద్వారా సుదూర లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించవచ్చని రక్షణశాఖ తెలిపింది. గగనతలంలో నిరంతరం నిఘా ఉంచేందుకు, ఇంటెలిజెన్స్ సమాచారం సేకరించేందుకు ఎయిర్‌షిప్ ఆధారిత హై ఆల్టిట్యూడ్ సూడో శాటిలైట్లు ఎంతో ఉపయోగపడతాయని వెల్లడించింది. స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన విభవ్ యాంటీ- ట్యాంక్ మైన్లు శత్రువుల యుద్ధ ట్యాంకర్‌లను సులభంగా అడ్డుకుంటాయని పేర్కొంది. ప్రస్తుతం ఉన్న ౧-72 ట్యాంకులు, ఆర్మోర్డ్ రికవరీ వెహికల్స్, ఇన్‌ఫాంట్రీ కాంబాట్ వెహికల్స్‌లను పూర్తిగా మరమ్మతు చేసి, వాటి జీవితకాలాన్ని పెంచుతామని రక్షణశాఖ తెలిపింది. సముద్ర జలాల్లో జలాంతర్గాములను పసిగట్టడంలో పీ-8ఐ యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ యుద్ధవిమానం ప్రపంచంలోనే అత్యుత్తమైనదని రక్షణశాఖ స్పష్టం చేసింది. భారత నావిక దళానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని వివరించింది. నౌకాదళ అవసరాల కోసం 4 మెగావాట్ల సామర్థ్యం గల మెరైన్ గ్యాస్ టర్బైన్ ఆధారిత జనరేటర్లను స్వదేశీ పరిజ్ఞాతంతో తయారు చేయనున్నట్లు వెల్లడించింది. సముద్ర నిఘా సామర్థ్యాన్ని పెంచేందుకు డోర్నియర్ విమానాలకు ఎలక్ట్రో-ఆప్టికల్ లేదా ఇన్‌ఫ్రా-రెడ్ సిస్టమ్స్‌ను అమర్చనున్నట్లు రక్షణశాఖ తెలిపింది.రఫేల్ యుద్ధ విమానాల తయారీలో ప్రముఖ సంస్థ అయిన దసో ఏవియేషన్, భారత్‌కు చెందిన టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ మధ్య గతేడాది జూన్‌లో నాలుగు చారిత్రాత్మక ఉత్పత్తి బదిలీ ఒప్పందాలు జరిగాయి. ఈ ఒప్పందం ప్రకారం హైదరాబాద్‌లో ఒక అత్యాధునిక ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతున్నారు. ఈ తయారీ కేంద్రంలో రఫేల్ యుద్ధ విమానానికి సంబంధించిన కీలకమైన నిర్మాణ భాగాలను ఇక్కడే తయారు చేస్తారు. ఇక్కడి నుంచి మొదటి ఫ్యూజ్‌లేజ్ విభాగాలు 2028 నాటికి బయటకు వస్తాయని చెబుతున్నారు.

# లెక్కింపు కేంద్రాల వద్ద భారీ భద్రత

## 12వేల మంది పోలీసులతో

## కట్టుదిట్టమైన ఏర్పాట్లు

## డీజీపీ శివధర్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్,ఫిబ్రవరి12(నేషనలిస్ట్ వాయిస్):

మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కోసం 12వేల మంది పోలీసులతో భారీ భద్రత ఏర్పాటు చేసినట్టు డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు సంబంధించి ఓట్ల లెక్కింపు పక్రియకు కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేశామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 123 కౌంటింగ్ కేంద్రాలను సిద్ధం చేశామని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా భద్రతను ఏర్పాటు చేసినట్లు డీజీపీ పేర్కొన్నారు. లెక్కింపు కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణ కోసం 12 వేల మంది పోలీసు బలగాలతో పాటు సాయుధ బలగాలు, క్విక్ రెస్పాన్స్ టీమ్స్ నిరంతరం పహారా కాస్తాయని, అదనపు భద్రత కోసం ప్రతి కౌంటింగ్ కేంద్రాన్ని సీసీటీవీ కెమెరాల నిఘాలో ఉంచామని తెలిపారు. వెబ్ కాస్టింగ్ విధానం ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితులను తన కార్యాలయ కమాండ్ కంట్రోల్ నుంచి పర్యవేక్షిస్తామని వివరించారు. లెక్కింపు కేంద్రాలకు వచ్చే మార్గాలను కఠినంగా నియంత్రిస్తున్నామని.. పాస్‌లు ఉన్న వారిని మాత్రమే లోపలికి అనుమతిస్తామని స్పష్టం చేశారు. ఏదైనా అల్లర్లు లేదా అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా కౌంటింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయన్నారు. కౌంటింగ్ పక్రియ విజయవంతంగా ముగిసేందుకు అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

## చంద్రబాబు, లోకేశ్‌నుకలిసిన బండ్ల గణేశ

అమరావతి,ఫిబ్రవరి12(నేషనలిస్ట్ వాయిస్):

సినీ నిర్మాత బండ్ల గణేశ్ గురువారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని తాను మొక్కుకున్న మొక్కును ఇటీవల తిరుమలకు పాదయాత్రగా వెళ్లి చెల్లించుకున్న నేపథ్యంలో, ఈ భేటీ జరిగింది. అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో చంద్రబాబును కలిసిన బండ్ల గణేశ్, ఆయనకు తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని అందజేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023లో చంద్రబాబును అక్రమ కేసుల్లో అరెస్టు చేసి జైలుకు పంపినప్పుడు బండ్ల గణేశ్ ఒక సంకల్పం తీసుకున్నారు. చంద్రబాబు జైలు నుంచి విడుదలై, తిరిగి ముఖ్యమంత్రి అయితే తిరుమలకు నడిచి వస్తానని మొక్కుకున్నారు. 2024 ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించి, చంద్రబాబు నాలుగోసారి సీఎం కావడంతో తన మొక్కు తీర్చుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో 'సంకల్ప యాత్ర' పేరుతో జనవరి 19న షాద్‌నగర్‌లోని తన ఇంటి నుంచి పాదయాత్ర ప్రారంభించారు. మొత్తం 23 రోజుల పాటు 535 కిలోమీటర్లు నడిచి, ఫిబ్రవరి 10న తిరుమల చేరుకున్నారు. రెండు రోజుల క్రితం శ్రీవారిని దర్శించుకుని మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం నేడు సీఎం చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా బండ్ల గణేశ్ ను ఆయన ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని అభినందించారు. పాదయాత్ర సాగిన తీరును, దారిపొడవునా పార్టీ కార్యకర్తలు తనకు అండగా నిలిచి ప్రోత్సహించారని బండ్ల గణేశ్ ముఖ్యమంత్రికి వివరించారు. ప్రముఖ సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ గురువారం రాష్ట్ర మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌తో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు.

# ఉగాదికి సనత్‌నగర్ టిమ్స్

## మార్చి రెండో వారానికల్లా పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశం

## సిద్ధమైన 16 ఆపరేషన్ థియేటర్లు

## రెడీగా సీటీ స్కాన్, ఎంఆర్ఐ మిషన్లు

## గుండె ఆపరేషన్ల కోసం క్యాథల్యాబ్

## అవయవమార్పిడి కోసం ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్

## ఏర్పాట్లపై మంత్రి దామోదర్ రాజనర్సింహ రివ్యూ

హైదరాబాద్,ఫిబ్రవరి12(నేషనలిస్ట్ వాయిస్):

పేదలకు కార్పొరేట్ స్థాయి సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని పూర్తి ఉచితంగా అందించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. ఉగాది పండుగ రోజున ఈ హాస్పిటల్‌ను ప్రారంభించి ప్రజలకు అంకితం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈలోగా సివిల్ పనులు, ఎక్విప్‌మెంట్ ట్రయల్స్ అన్నీ పూర్తి చేసి, హాస్పిటల్‌ను వైద్య సేవలు అందించేందుకు సిద్ధం చేయాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆఫీస్‌లో టిమ్స్ సనత్‌నగర్ పనుల పురోగతి, డాక్టర్లు, సిబ్బంది నియామకంపై మంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, డీఎంఈ డాక్టర్ నరేంద్ర కుమార్, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ ఫణీంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓపీ రూమ్‌లు, డయాగ్నస్టిక్స్, ఇన్‌పేషెంట్ డిపార్ట్‌మెంట్లు, వార్డులు, ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూల ఏర్పాటుపై మంత్రి ఆరా తీశారు. 1000 బెడ్ల కెపాసిటీతో నిర్మించిన సనత్‌నగర్ టిమ్స్‌లో మౌలిక వసతుల కల్పన తుది దశకు చేరుకుందని అధికారులు మంత్రికి వివరించారు. హాస్పిటల్ అత్యంత కీలకమైన 16 ఆపరేషన్ థియేటర్లు శస్త్రచికిత్సలకు సిద్ధంగా ఉన్నాయన్నారు. రోగ నిర్ధారణ కోసం అత్యాధునిక సీటీ స్కాన్, ఎంఆర్ఐ , డిజిటల్ ఎక్స్-రే మిషన్ల ఇన్‌స్టాలేషన్ పక్రియ పూర్తయ్యిందన్నారు. డయాగ్నస్టిక్స్ యంత్రాలు ఇన్‌స్టాలేషన్ జరుగుతోందన్నారు. మార్చి రెండో వారం నాటికి అన్ని పనులు, ఎక్విప్‌మెంట్ ఇన్‌స్టాలేషన్ పక్రియ పూర్తి చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. హాస్పిటల్ ప్రారంభమయ్యే నాటికి టెక్నీషియన్లకు, సిబ్బందికి ట్రైనింగ్ కూడా పూర్తి చేయాలని మంత్రి సూచించారు. సనత్‌నగర్ టిమ్స్‌ను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ కార్డియాక్ కేర్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఆర్గాన్ ట్రాన్స్‌ఎ÷-లాంటేషన్‌గా తీర్చిదిద్దాలని గతంలోనే అధికారులకు మంత్రి సూచించారు. ఇందుకు అనుగుణంగా అన్నిరకాల గుండె సంబంధిత ఆపరేషన్లు చేసేలా, అవయవమార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహించేలా క్యాథల్యాబ్స్, ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ థియేటర్ల ఏర్పాటుపై మంత్రి ఆరా తీశారు. క్యాథల్యాబ్ ఏర్పాటు పనులు చివరి దశలో ఉన్నాయని, ఓటీలు ట్రయల్ రన్‌కు సిద్ధంగా ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. నగరంలోని నిమ్స్, ఉస్మానియా, గాంధీ హాస్పిటల్‌పై పెరుగుతున్న రోగుల ఒత్తిడిని తగ్గించేందుకు టిమ్స్ సనత్‌నగర్ ప్రధాన భూమిక పోషిస్తుందని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. ఆయా హాస్పిటళ్లలో శస్త్రచికిత్సల కోసం నెలల తరబడి వేచి చూస్తున్న రోగులను ఇక్కడికి రిఫర్ చేసి, త్వరితగతిన వైద్యం అందించేందుకు ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు. దీనికి సంబంధించి ఆయా హాస్పిటళ్ల సూపరింటెండెంట్లు సమన్వయం చేసుకోవాలని మంత్రి సూచించారు. హాస్పిటల్ నిర్వహణకు అవసరమైన ప్రొఫెసర్లు, డాక్టర్లు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది నియామక పక్రియపై మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆరా తీశారు. పూర్తిగా కొత్త హాస్పిటల్ అయినందున.. డీఎంఈ, నిమ్స్ పరిధిలోని సీనియర్ డాక్టర్ల సేవలను సనత్‌నగర్ టిమ్స్‌లో వినియోగించుకోవాలని అధికారులకు మంత్రి సూచించారు. అలాగే, పారిశుధ్యం, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ సేవలను అత్యున్నత ప్రమాణాలతో ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ విషయంలో ఇప్పటికే నగరంలోని పలు కార్పొరేట్ హాస్పిటల్స్, నిమ్స్, ఎయిమ్స్‌లో అనుసరిస్తున్న పద్ధతులను డీఎంఈ నేతృత్వంలోని కమిటీ అధ్యయనం చేసి, నివేదిక అందజేసింది. ఆయా హాస్పిటల్స్‌లో అవలంభిస్తున్న బెస్ట్ ప్రాక్టీస్ విధానాలనే టిమ్స్‌లోనూ అమల్లోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. మెడికల్ సర్వీసెస్‌తో పాటు సానిటేషన్, సెక్యూరిటీ వంటి నాన్ మెడికల్ సర్వీసెస్ విభాగాలు కూడా పటిష్టంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. రోగులకు ఓపీ రిజిస్ట్రేషన్ నుంచి డిశ్చార్జి వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ-హెచ్ఎంఐఎస్ (౹-ఊఓఎ÷ూ) సాఫ్ట్‌వేర్ ద్వారా సేవలను అనుసంధానించాలని మంత్రి సూచించారు. రోగులకు, వారి సహాయకులకు నాణ్యమైన భోజనం అందించేందుకు సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు చేయాలని సూచించారు. మార్చి 15 నాటికి పెండింగ్‌లో ఉన్న చిన్న చిన్న పనులన్నీ పూర్తి చేసి, ఉగాది నాటికి హాస్పిటల్‌ను ప్రారంభానికి సిద్ధం చేయాలని మంత్రి స్పష్టం చేశారు.

# మహా శివరాత్రి జాతర ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్

నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ ముస్తాబాద్

మహా శివరాత్రి జాతర సందర్భంగా వేములవాడలో చేస్తున్న ఏర్పాట్లను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ గురువారం పరిశీలించారు. పార్కింగ్ ఏరియా, క్యూ లైన్లు, పారిశుధ్య పనులు, ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులకు సులభంగా దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. పరిశీలనలో డీఆర్డీఓ గీత, ఆర్ అండ్ బీ ఈఈ నరసింహాచారి, డీఈ శాంతయ్య, ఆలయ ఈఈ రాజేష్ పాల్గొన్నారు



# కౌంటింగ్ అధికారులు, సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి; జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్

నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ ముస్తాబాద్

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ నేతృత్వంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ లో కౌంటింగ్ అధికారులు, సిబ్బంది ర్యాండమైజెషన్ ప్రక్రియ గురువారం పూర్తి చేశారు. జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి తో కలిసి ప్రక్రియను ఇంచార్జి కలెక్టర్ పూర్తి చేశారు. కార్యక్రమంలో డీఈఓ జగన్ మోహన్ రెడ్డి, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, ఈడీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.



# ఎన్నికల కౌంటింగ్ కి సర్వం సిద్ధం

## అధికారులకు దిశ నిర్దేశం చేసిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్

నేషనలిస్ట్ వాయిస్ న్యూస్, నిర్మల్ బ్యూరో ఫిబ్రవరి 12.

శుక్రవారం నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎస్పీ లిడా.జి.జానకి షర్మిల ఐపీఎస్‌లి తెలిపారు. కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు, విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రత్యేక దిశానిర్దేశం చేశారు.కౌంటింగ్ ప్రక్రియ ఎటువంటి అంతరాయం లేకుండా సజావుగా సాగేందుకు తగిన చర్యలు తీసుకున్నామని, శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు.



# ఉజ్వలా పథకం గ్యాస్ కనెక్షన్లు అందజేత

నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం చికోడు గ్రామంలో బిజెపి నాయకుల ఆధ్వర్యంలో 22 మంది గృహిణులకు ఉజ్వల పథకం గ్యాస్ కనెక్షన్లు అందజేశారు. నియోజకవర్గ బిజెపి కన్వీనర్ కరెడ్ల మల్లారెడ్డి మాట్లాడుతూ సుమారు 475 ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు అందజేసినట్లుగా పేర్కొన్నారు. ఈ పథకము మహిళలకు వరప్రదాయని లాంటిదని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆంజనేయులు, వార్డు సభ్యులు బాధ నరేష్, నాయకులు సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.



# మహిళల ఆరోగ్యం,"ప్రగతి"కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ ఆదిలాబాద్ :

మహిళల ఆరోగ్యం,పరిశుభ్రత,సాధికారత లక్ష్యంగా చేపట్టిన "ప్రగతి" కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమం గురువారం జైనథ్ మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ (టీజీఎంఎస్) జూనియర్ కళాశాలలో ప్రారంభించారు.దేశంలోని ప్రముఖ టెలికాం మౌలిక వసతుల సంస్థ ఇండస్ టవర్స్ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా,పింకిషే ఫౌండేషన్‌తో కలిసి ఈ కార్యక్రమాన్ని చేపట్టింది.జిల్లా కలెక్టర్ రాజర్షి షా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,మహిళల ఆరోగ్యం,విద్యపై పెట్టే పెట్టుబడి సమాజ భవిష్యత్తును ప్రభావితం చేస్తుందన్నారు.రుతుక్రమంపై ఉన్న అపోహలను తొలగించి కిశోర బాలికలు,మహిళల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు అవసరమని పేర్కొన్నారు."ప్రగతి" కార్యక్రమాన్ని జిల్లాలో నిబద్ధతతో అమలు చేయడం అభినందనీయమన్నారు.విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువుపై దృష్టి సారించి ఐఐటీ,ట్రిపుల్ ఐటీ వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో అవకాశాలు సాధించాలని సూచించారు.ఇండస్ టవర్స్ ప్రతినిధి అరుణ్ మాట్లాడుతూ,మహిళల ఆరోగ్య పరిరక్షణకు తమ సంస్థ కట్టుబడి ఉందన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన పెంచడం ద్వారా మహిళల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు.అనంతరం మోడల్ స్కూల్ కు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించి,ఈ సందర్భంగా అధికారులను జిల్లా కలెక్టర్ అభినందిస్తూ శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ సలోని చాబ్రా,సంతోష్ రామ్,సీసీఈఓ అరుణ్,పింకిషే ఫౌండేషన్ ప్రతినిధులు శాతిని గుప్తా,అరుణ్ గుప్తా,జైనథ్ సర్పంచ్ మమత,ప్రత్యూష, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# 14న మైనార్టీ గురుకుల విద్యాలయం ఐఐటి నిట్ ప్రవేశ పరీక్ష

నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ నిర్మల్ బ్యూరో ఫిబ్రవరి 12.

తెలంగాణ మైనారిటీ గురుకుల విద్యాలయాల సంస్థ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రాంతీయ సమన్వయ కర్త కెప్టెన్. సలీముద్దీన్ ప్రెస్ నోట్ ప్రకారం తేది : 14-02-2026 శనివారశీ రోజున ఉదయం 10:00 గం॥లకు చించోలి ఎక్స్ రోడ్, ఆర్టీఓ ఆఫీస వెనుక గల మైనార్టీ గురుకుల విద్యాలయం బాలుర నందు ఐఐటీ, నీట్ సిఓఈ -సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో ప్రవేశాల కోసం రాత పరీక్ష నిర్వహించబడును. ఇందులో ఎంపికైన విద్యార్థులకు రెండు సంవత్సరాలు ఇంటర్మీడియేట్ తో పాటు ఐఐటి నీట్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వబడును. కావున విద్యార్థులు మరియు తల్లిదండ్రులు ఇట్టి అవకాశమును వినియోగించుకోవాలి.14-02-2026 శనివారం రోజు పరీక్షకు హాజరైఅయ్యే విద్యార్థులు ఒక గంట ముందు హాల్ టికెట్ తో పరీక్ష కేంద్రానికి చేరుకొవాలి. విద్యార్థులకు మరియు తల్లి దండ్రులకు సలహాలు మరియ సూచనలకు ఈ క్రింది ఫోన్ నెంబరలను 9948936602, 9553719316, 7396220768 సంప్రదించాలి.




# ఆదిలాబాద్ పీఠాన్ని కాంగ్రెస్ హస్తగతం చేసుకుంటుంది.

- నరేష్ జాదవ్,కంది శ్రీనివాస రెడ్డి.

## కౌంటింగ్ టెన్షన్ నుండి రిలీఫ్ కోసం ప్రత్యేక వాహనంలో తరలింపు

నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ ఆదిలాబాద్ :

ఆదిలాబాద్ మున్సిపల్ పీఠాన్ని తప్పకుండా కైవసం చేసుకుంటామని ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరేష్ జాదవ్,అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు.మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ గుర్తుపై పోటీచేసిన పార్టీ అభ్యర్దులతో గురువారం పట్టణం లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో సమావేశం నిర్వహించారు.వార్డుల వారీగా ఓటింగ్ జరిగిన తీరు గురించి చర్చించారు.తప్పకుండా గెలుస్తామన్న ధీమాను వ్యక్తం చేసారు.అనంతరం కౌంటింగ్ టెన్షన్ నుండి రిలీఫ్ గా ఉండేందుకు అభ్యర్దులను ప్రత్యేక వాహనాల్లో శిబిరాలకు తరలించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ముఖ్య నాయకులతో పాటు పోటీ చేసిన అభ్యర్దులు పాల్గొన్నారు.




# నిరాశపర్చిన హెచ్ ఎస్ నిర్ణయాలు: టిఎస్పిటిఎ

నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ హైదరాబాద్ బ్యూరో



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు నగుదురహిత వైద్యం అందించడానికి ఉద్దేశించిన ఈ హెచ్ ఎస్ పథకం అమలుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఉద్యోగులను తీవ్రంగా నిరాశపరిచిందని గురువారం తెలంగాణ స్టేట్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ షౌకత్ అలీ, ఆర్ రోహిత్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. గత పది సంవత్సరాల నుండి ఉద్యోగుల ప్రమేయం లేకుండా పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యం ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా గుర్తించబడిన ఆసుపత్రుల్లో వైద్యం చేయించాలని కోరుతూ వచ్చామని, దానికి భిన్నంగా నేడు ప్రభుత్వం నిర్ణయించడం అత్యంత విచారకరమని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఉచిత వైద్యం అందించవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పైనే ఉన్నదని, ప్రస్తుత నిర్ణయంతో ఉద్యోగులపై కంట్రిబ్యూషన్ కింద పెద్ద భారం పడుతున్నదని, దానికి రాష్ట్ర ప్రభుత్వం కూడా సమాన వాటా చెల్లిస్తుందని చెప్పారని, కానీ వాస్తవానికి ప్రభుత్వ ఉద్యోగులు చెల్లించే ఒకటిన్నర శాతం కాంట్రిబ్యూషన్ నిధులతోనే నగదురహిత వైద్యం అందించ వచ్చును. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద పైసా కూడా చెల్లించాల్సిన అవసరం ఉండదని, ఇందులో కేవలం పర్యవేక్షణ చెయడం ఒక్కటే ఉంటుందని వారు తెలిపారు . ఉద్యోగులపై కంట్రిబ్యూషన్ కింద భారం పడే విధానం కోసమైతే ఉద్యోగులు 12 సంవత్సరాలుగా ఎందుకు ఎదురు చూడవలసిన వచ్చిందని అని వారు ప్రశ్నించారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునః సమీక్షించుకుని ఉద్యోగులపై ఎటువంటి భారం లేకుండా, పూర్తిగా ప్రభుత్వం యొక్క నిధులతోనే నగదు రహిత వైద్యం అందించాలని వారు ముఖ్యమంత్రి కి విజ్ఞప్తి చేశారు.

# మున్సిపాలిటీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి పటిష్ట బందోబస్తు.

## - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

## - కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత.

నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ ఆదిలాబాద్ :

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికల లెక్కింపు ప్రక్రియలో ప్రతిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలియజేశారు.కౌంటింగ్ కేంద్రం పూర్తిగా మూడంచల భద్రతతో పటిష్టమైన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు.ఓట్ల లెక్కింపు కార్యక్రమం స్థానిక టిటిడిసి ప్రాంగణం నందు జరగనుండగా ప్రాంగణం పరిసర ప్రాంతాలలో 163బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలులో ఉందని,ప్రజలు గుంపులు గుంపులుగా తిరగడానికి అనుమతులు లేవని తెలిపారు.ముఖ్యంగా ఎన్నికలలో విజయం పొందిన నాయకులు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడానికి అనుమతులు లేవని తెలిపారు.మరుసటి రోజు సంబంధిత అధికారుల అనుమతులు తీసుకొని నిర్దేశించిన రోజు మాత్రమే విజయోత్సవ ర్యాలీలను నిర్వహించాలని తెలిపారు.టపాకాయలు పేల్చడానికి,డీజే సౌండ్ లకు అనుమతులు లేవని స్పష్టం చేశారు.ప్రజలందరూ నియమ నిబంధనలు పాటించి,ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు పాల్పడకుండా ప్రశాంతంగా ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తి అయ్యే విధంగా సహకరించాలన్నారు.కౌంటింగ్ సందర్భంగా "ఐ లవ్ ఆదిలాబాద్ నుండి మావల పోలీస్ స్టేషన్ వరకు" ట్రాఫిక్ ఆంక్షలు ఉండనున్నట్టు,రేపు ఉదయం నుండి ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ పూర్తి అయ్యేంతవరకు ఆంక్షలు కొనసాగుతాయని ప్రజలు పట్టణంలోని అంతర్గత రోడ్లను వినియోగించుకోవాలని సూచించారు.ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.కౌంటింగ్ కేంద్రాలలోనికి వచ్చే ఏజెంట్లకు గానీ అభ్యర్థులకు గానీ సెల్ఫోన్లను,ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతులు లేవని,అదేవిధంగా ఇంకు పెన్నులు లాంటి వాటిని తీసుకురావద్దని సూచించారు.




## స్ట్రాంగ్ రూమ్ సెంటర్ ను సందర్శించిన అడిషనల్ డీసీపీ లా& ఆర్డర్

**నేషనలిస్ట్ వాయిస్ /ఖమ్మం**

ప్రియదర్శిని ఇంజనీరింగ్ కాలేజ్ లో ఏర్పాటు చేసిన ఎదులాపురం మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ సెంటర్ / స్ట్రాంగ్ రూమ్ ను అడిషనల్ డీసీపీ ప్రసాద్ రావు సందర్శించి భద్రత ఏర్పాట్లనుపరిశీంచారు. స్ట్రాంగ్ రూమ్ కు రక్షణ కల్పిస్తున్న ఆర్మ్డ్ ఫోర్స్ గార్డు ను తనిఖీ చేశారు. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లపై పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు.







## ఆడబిడ్డల పెళ్లికి ఆర్థిక భరోసా రూ.21 వేలు అందజేస్తున్న సర్పంచ్ షరీఫ్

**జహీరాబాదనేషనలిస్ట్ వాయిస్.**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ఝరాసంగం, ఫిబ్రవరి 13: ఝరాసంగం మండల పరిధిలోని సిద్ధాపూర్ గ్రామ సర్పంచ్ షరీఫ్ గ్రామంలో వివాహం చేసుకునే ప్రతి ఆడబిడ్డకు ఆర్థికంగా అండగా నిలుస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. గ్రామంలోని ప్రతి ఆడబిడ్డ పెళ్లికి రూ.21 వేల ఆర్థిక సహాయం అందిస్తానని ఇచ్చిన హామీని ఆయన నిలబెట్టుకుంటున్నారు.సోమవారం రాత్రి గ్రామంలో జరిగిన ఓ వివాహ వేడుకకు హాజరైన సర్పంచ్ షరీఫ్, వధూవరులను ఆశీర్వదించి తన వంతు బాధ్యతగా రూ.21 వేల నగదు అందజేశారు. ఆడబిడ్డల పెళ్లిళ్లు తల్లిదండ్రులకు భారంగా మారకూడదన్న ఉద్దేశంతో ఈ సహాయం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ షరీఫ్ మాట్లాడుతూ, గ్రామంలో ప్రతి ఆడబిడ్డకు మేనమామలా అండగా ఉండటమే తన లక్ష్యమని చెప్పారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఆయన చేస్తున్న సేవలను గ్రామస్తులు అభినందిస్తున్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు మోసిన్ భాయ్, రాంరెడ్డి, మొయిజ్ తదితరులు పాల్గొని సర్పంచ్ షరీఫ్ సేవలను కొనియాడారు.

## ఘనంగా సీనియర్ న్యాయవాది రాజేష్ కుమార్ జన్మదిన వేడుకలు

**నేషనలిస్ట్ వాయిస్ - కూకట్ పల్లి...**

కూకట్‌పల్లి సీనియర్ న్యాయవాది రాజేష్ కుమార్ జన్మదినాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు ఆయనకు పుట్టినరోజు శు భాకాంక్షలు తెలియజేశారు. కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సహచర న్యాయవాదులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ మరియు పలు బార్ కమిటీలకు వైస్ ప్రెసిడెంట్‌గా, జాయింట్ సెక్రటరీగా రాజేష్ కుమార్ అందించిన సేవలను సభ్యులు గుర్తు చేసుకున్నారు. బార్ అభివృద్ధికి, న్యాయవాదుల సంక్షేమానికి ఆయన చేసిన కృషిని ప్రశంసించారు. అనంతరం రాజేష్ కుమార్ మాట్లాడుతూ తనపై చూపిన ప్రేమాభిమానాలకు న్యాయవాదులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. వారి ఆశీస్సులు, మద్దతు ఇలాగే కొనసాగితే రాబోయే బార్ అసోసియేషన్ ఎన్నికల్లో జనరల్ సెక్రటరీగా సేవలందించడానికి సిద్ధంగా ఉన్నానని వెల్లడించారు. ఎల్లప్పుడూ న్యాయవాదుల సేవలో ఉంటానని సోదర భావంతో పేర్కొన్నారు.




# రహస్య టెలికాన్ఫరెన్స్ కలకలం

## : మంత్రి, ఉద్యోగ సంఘాల నేతలపై బీజేపీ ఫిర్యాదు

### ఆడియో సాక్ష్యాలతో కలెక్టర్‌ను కలిసి వినతి సస్పెన్షన్, క్రిమినల్ కేసుల డిమాండ్

**నేషనలిస్ట్ వాయిస్/ఖమ్మం, ఫిబ్రవరి 12:**

లీకైన ఆడియో వ్యవహారం జిల్లాలో రాజకీయంగా తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ నేపథ్యంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు, జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావుతో కలిసి జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఆడియో సాక్ష్యాలను అధికారులకు సమర్పించి తక్షణ విచారణ చేపట్టాలని కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దేవకీ వాసుదేవరావు మాట్లాడుతూ, రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉద్యోగ సంఘాల నేతలతో రహస్యంగా టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల నిర్వహణపై చర్చించడం అత్యంత ఆందోళనకరమన్నారు. ప్రభుత్వ సేవలో ఉన్న ఉద్యోగులు రాజకీయ పార్టీ ప్రయోజనాల కోసం పనిచేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పని వ్యాఖ్యానించారు. లీకైన ఆడియోలో ఉద్యోగ సంఘాల నేతలు '100% పోలింగ్ వేయిస్తాం', 'బంగారు పళ్లెంలో పెట్టి గెలిపిస్తాం' వంటి వ్యాఖ్యలు చేయడం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని బహిరంగంగా ధిక్కరించినట్లేనని ఆయన అన్నారు. వార్డుల వారీగా ఉద్యోగుల వివరాలను చదివి వినిపించడం ద్వారా ప్రభుత్వ సమాచారాన్ని రాజకీయ ప్రయోజనాలకు వినియోగించిన అనుమానం కలుగుతోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ఆరోపించిన ఆయన, ఈ ఘటనపై జిల్లా యంత్రాంగం మరియు ఎన్నికల సంఘం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంబంధిత ఉద్యోగ సంఘాల నేతలను సర్వీసు నుంచి సస్పెండ్ చేయడంతో పాటు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొంగల సత్యనారాయణ, నున్నా రవి, గుత్తా వెంకటేశ్వరరావు, నల్లగట్టు ప్రవీణ్ కుమార్, వీరెల్లి రాజేష్, రవి రాథోడ్, అల్లిక అంజయ్య, దొడ్డ అరుణ, రవి గౌడ్, కొణతం లక్ష్మీనారాయణ, బోయినపల్లి సురేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.




# నిజాంపేట్ సర్కిల్లో సమ్మెలో పాల్గొన్న కార్మిక సంఘాలు .

## కార్మిక సంఘం నాయకుల, కార్మికుల ప్రదర్శన.

**కుత్బుల్లాపూర్ నేషనలిస్ట్ వాయిస్-**

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చెయ్యాలని దేశవ్యాప్తంగా జాతీయ కార్మికులు సంఘాల పిలుపు మేరకు నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని అలీఫ్, బాచుపల్లి పరిశ్రమిక వాడల్లో పరిశ్రమల యాజమాన్యాలు స్వచ్ఛందంగా బంద్ ఇవ్వడం వల్ల కార్మికులు సమ్మె లో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చెయ్యడం జరిగింది. నిజాంపేట్, ప్రగతి నగర్లో జరిగిన కార్యక్రమానికి ఏఐటీయూసీ నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు ఆశి. యాదయ్య నాయకత్వం వహించగా ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలభిందెల శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక మోడీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తూ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని అందులో భాగంగానే నూతన లేబర్ కోడ్లను తీసుకొని వచ్చి 100 సంవత్సరాల క్రితం సాధించుకున్నటువంటి ఎనిమిది గంటల పని దినం ఉద్యోగ భద్రత యూనియన్ల ఏర్పాటు జీతభత్యాల కొరకు సంప్రదింపులు లాంటి అనేక చట్టాలను నిర్వీర్యం చేసి కంపెనీ యాజమాన్యాలకు అధికారమిచ్చి కార్మికులకు తీవ్రమైన అన్యాయానికి గురై చేస్తున్నారని, కార్పొరేట్ పెట్టుబడిదారులకు లక్షల వారికి ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. ఈ సమ్మెలో దేశవ్యాప్తంగా 30 కోట్ల మంది అసంఘటిత కార్మికులు పాల్గొంటున్నారని ఇది మోడీ ప్రభుత్వానికి హెచ్చరిక లాంటిదని వెంటనే నాలుగు లేబర్ కొడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు అలీఫ్, బాచుపల్లిలోని పారిశ్రామిక ప్రాంతాలకు తిరిగి కార్మికులను బందులో పాల్గొనేలా చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నిజాంపేట్ సర్కిల్ కార్యదర్శి పొన్నకంటి దస్తగిరి, ఏఐటీయూసీ నాయకులు శివ రెడ్డి,బాబురావు, నర్సమ్మ, భాగ్యమ్మ, పుష్పమ్మ, బ్రహ్మానందం,కృష్ణ తో పాటు వందలాదిమంది కార్మికులు పాల్గొన్నారు




## కల్లూరు ఏసీపీ కార్యాలయం కల్లూరు మున్సిపల్ ఓట్ల లెక్కింపు సందర్బంగా పటిష్టమైన చర్యలు : కల్లూరు ఏసీపీ

**నేషనలిస్ట్ వాయిస్/ ఖమ్మం**

కల్లూరు మున్సిపల్ ఎన్నికల లెక్కింపు ప్రశాంతంగా పారదర్శకంగా ఉండేలా గట్టి భద్రతా ఏర్పాట్లు చేసినట్లు కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ అన్నారు. కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 24ఐ7 పోలీసు నిఘాతో మూడు అంచెల భద్రతా వ్యవస్థ అమలులో ఉందన్నారు. కౌంటింగ్ హాళ్లలోకి మొబైల్ ఫోన్లు, పెన్నులు, ఇంక్, ఎలక్ట్రానిక్ పరికరాలు, బ్యాగులు, ఇతర అనధికార వస్తువులు నిషేధించబడ్డాయని, ×ఐ కార్డులు కలిగిన ఎన్నికల సిబ్బంది, ఆమోదించబడిన కౌంటింగ్ ఏజెంట్లకు మాత్రమే ప్రవేశం ఉంటుందన్నారు.ట్రాఫిక్ మళ్లింపులు, ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేయబడ్డాయని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున, కౌంటింగ్ కేంద్రాల దగ్గర సమావేశాలు, నినాదాలు, ఆటంకాలకు అనుమతించబడదని అన్నారు. ఉల్లంఘనలపై కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు.





## కేటిఆర్ ను కలిసిన తాజా మాజీ కార్పొరేటర్లు

**నేషనలిస్ట్ వాయిస్ - కూకట్ పల్లి...**

కూకట్ పల్లి నియోజకవర్గ కార్పొరేటర్లు ,తమ పదవీ కాలం విజయవంతంగా ముగియడంతో, కూకట్ పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ని కలసిన తాజా మాజీ కార్పొరేటర్లు.



## శాంతి భద్రతల పరిరక్షణే సైబరాబాద్ పోలీస్ లక్ష్యం

**నేషనలిస్ట్ వాయిస్ - కూకట్ పల్లి...**

శాంతి భద్రతల పరిరక్షణే సైబరాబాద్ పోలీస్ లక్ష్యం అని అన్నారు ,బాలానగర్ డివిజన్ ఏ సి పి నరేష్ రెడ్డి, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ప్రారభించి 24 ఏళ్ళు అయిన సందర్భంగా ,కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ లో బాలానగర్ ఏసిపి నరేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ,కూకట్ పల్లి ఎస్ హెచ్ఓ కేవి సుబ్బారావు ,ఎస్సై లు సిబ్బందితో కలిసి జాతీయ జెండా ఆవిష్కరించారు, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా బాలానగర్ ఏసిపి నరేష్ రెడ్డి మాట్లాడుతూ, శాంతి భద్రత పరిరక్షణలో ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడేది లేదని, ప్రజా భద్రతే లక్ష్యంగా పని చేస్తామని,ప్రస్తుత సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ,రంగారెడ్డి జిల్లా పరిధిలో ఉండగా, ఈ ప్రాంతం అభివృద్ధి చెందంతో పాటుగా , దొంగతనాలు, దోపిడీలు , నేరాలు పెరగడంతో వాటిని అదుపు చేసేందుకు 2003 ఫిబ్రవరి 12 న సైబరాబాద్ కమిషనరేట్ ఏర్పాటు చేయడం జరిగిందని, సైబారాబాద్ కమిషనరేట్ ఏర్పాటు తరువాత నేరాలు అదుపు చేయడం జరిగిందని, పోలీస్ కమిషనరేట్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కమిషనర్ ఆదేశాల మేరకు అన్ని పోలీస్ స్టేషన్ల లో వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరిగిందని అన్నారు.



# సంపాదకీయం

## దివాళా పథకాలకు అడ్డుకట్ట వేసేదెవరు

ఉచిత పథకాలు రాష్ట్రాల, దేశ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేస్తున్నా..అధికారంలో ఉన్నవారు పట్టించుకోవడం లేదు. రాష్ట్రాలు ఆర్థికంగా దివాళా తీస్తున్నా, జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉన్నా పట్టించుకోవడం లేదు. తెలంగాణలో ఇప్పుడు జీతాలు కూడా అప్పులు చేసి ఇవ్వాల్సి వస్తోంది. విపక్షంలో ఉన్నవారు మరిన్ని ఉచితపథకాల గురించి డిమాండ్ చేస్తున్నారు. మొన్నటి మున్సిపల్ ఎన్నికల్లో ఏమేమి చేశామో అని కాంగ్రెస్ వివరించింది. విపక్ష బిఆర్ఎస్ మాత్రం ఇవ్వని జాబితా చదివింది. తులం బంగారం ఇచ్చారా..రైతుబంధు వేశారా..పెన్షన్లు నాలుగు వేలు ఇచ్చారా అంటూ నిలదీశారు. గురుకులాలు అధ్వానంగా మారడానికి కాంగ్రెస్ కారణమన్నారు. ఇకపోతే ఇప్పటి లక్షా 25కోట్ల అప్పుల చేశారని అంటున్నారు. పెన్షనర్ల బకాయిలు చెల్లించడం లేదు. ఎపిలో జగన్ కూడా ఇదే తరహాలో ఫలానా పథకం ఆగిందని ఆరోపిస్తున్నారు. చంద్రబాబు కూడా చేతిక ఎముక లేదన్నట్లుగా పథకాలను అందిస్తున్నారు. ఈ పథకాలు కొంప ముంచుతున్నా ,రాష్ట్రాలను దివాళా తీయిస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలో ఉచితానుచితాలు మరచి ఎప్పటి కప్పుడు ఆకర్షణీయ పథకాలను గుప్పిస్తున్నారు. అధికారంలో లేన్నప్పుడు ఉచితాల గురించి విమర్శించినవారే, తీరా అధికారంలోకివస్తే అదే ఓటర్లను ఆకట్టుకునేందుకు ఉచిత పథకాలను ఏకరువు పెడుతున్నారు. ఎన్నికల్లో విపరీతంగా డబ్బులు పంచి పెడుతున్నారు. అభివృద్ధిని పక్కనపెట్టి ఎన్నికల్లో ప్రయోజనం పొందడాని కన్నట్లు ఉచితాల మీద ఉచితాలు ప్రకటిస్తున్నారు. వీటివలన పేదలకు చెప్పుకోదగిన శాశ్వత ప్రయోజనం దక్కదు సరికదా, అత్యవసరంగా లాభపడేది పార్టీలు మాత్రమే. ప్రభుత్వాలు ఆర్థికంగా దివాలా కొడుతున్నాయి. జీతాలు ఇవ్వాలంటే మళ్ళీ అప్పులకు దేబిరించాల్సి వస్తోంది. ఉచిత పథకాలతో ప్రజలు సోమరులుగా మారి, పనిచేయడానికి ముందుకు రారని సుప్రీంకోర్టు చేసిన హెచ్చరికను ఎవరూ పట్టించు కున్నట్లు లేదు. అత్యున్నత ధర్మాసనం వ్యాఖ్యలను కూడా సీరియస్‌గా తీసుకోవడం లేదు. ప్రజల బతుకులు బాగుపడే శాశ్వత ఆలోచన చేయడమే ప్రభుత్వ కర్తవ్యం కావాలి. ప్రస్తుత పరిస్థితులలో ఓటు కొనుక్కోకూడదు. ఓటు అమ్ముకోకూడదు అని చెబితే వినే వారెవరూ లేరు. ఉచితాల పంపిణీలపై రాజకీయ నాయకులకు కనువిప్పు కావాలి. ప్రభుత్వం ద్వారా అన్నీ ఉచితంగా పొందాలనే మనస్తత్వం కారణంగా దేశంలో అభివృద్ధి కుంటుపడిపోతోంది. ఉచిత పథకాలకి ఖజానా ఖాళీ అయిపోతోంది. దానిని నింపడానికి మళ్ళీ అప్పులు. ఈ పద్ధతి ఏ ప్రభుత్వానికీ మంచింది కాదు. లక్షల కోట్లు అప్పులు తెచ్చి, వడ్డీలు కట్టలేక, ఉద్యోగుల జీతాలు కూడా భారమై ప్రభుత్వాలు నవ్వుల పాలవుతున్నాయి. జీతాలు కూడా చెల్లించ లేనప్పుడు మళ్లీ జనం నుంచే వసూలు చేయాలి. ఓటర్లకు ఆశ పెట్టి తాత్కాలిక లబ్దిని చేకూర్చడం ఎంతవరకు సబబో నేతలు ఆలోచన చేయడం లేదు. ఉచితాల పంపిణీ వలన జనంలో పేదరికం తగ్గిపోయిం దని చెప్పడం అలవాటు చేసుకున్నారు. ముఖ్యంగా అధికారంలోకి రావడానికి అనేక విధాలుగా ఉచిత పథకాలపై హామీలు గుప్పిస్తూ, తీరా అధికారంలోకి వచ్చాక చేతు లెత్తేయడం పరిపాటిగా మారింది. దీనిపై సుప్రీం ధర్మాసనం గట్టిగానే హెచ్చరించినా పట్టింపు లేదు. ఉచిత రేషన్, ఉచిత గ్యాస్, ఉచిత ఇల్లు, ఉచిత బియ్యం, ఉచితంగా పెన్షన్ వంటివన్నీ ఖజానాను దివాళా తీయిస్తున్నాయి. ఎన్నికల సంఘం కూడా దీనిపై దృష్టి సారించాలి. సంక్షేమం అవసరమే కానీ మోతాదు మించకుండా చూసుకోవడం మంచి పద్ధతి. ఆధునిక భారతదేశం అంధకార యుగంలోకి జారిపోతోందని ప్రధాని నరేంద్ర మోడీ ఒకా నొక సందర్భంలో ఆందోళన వ్యక్తం చేసారు. ఉచితాలను అమలు చేస్తే ఎక్స్ ప్రెస్ వేలు, విమానాశ్రయాలు, రక్షణ కారిడార్లను నిర్మించలేమని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ గతంలో హెచ్చరించారు. ఆనాడు దీనిని అనేక రాజకీయపార్టీలు కూడా వ్యతిరేకించాయి. మోడీకి సంక్షేమం పట్ల సానుకూల వైఖరి లేదని విమర్శించారు. కానీ ఎంతో విచిత్రంగా ఆ తర్వాత ఏడాది మధ్యప్రదేశ్‌లో లక్ష్మీమోహనాపథకం క్రింద మహిళలకు నెలకు రూ.1250 చొప్పున చెల్లిస్తామని, క్రమంగా దాన్ని రూ. 3వేల వరకు పెంచుతామని భారతీయ జనతా పార్టీ ప్రకటించింది. మొన్న మహారాష్ట్రలో కూడా ఇదేవిధంగా ఇలాంటి పథ కాన్నే ప్రకటించారు. బీహార్‌లో కూడా ఇలాంటి పథకంతోనే గట్టెక్కారు. అంతకు ముందు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కూడా అంతేచేసింది. దీన్నిబట్టి ఉచితాలను వ్యతిరేకించినవారే సమయాను కూలంగా వాటిని మళ్లీ తెరపైకి తెస్తున్నారు. నగదుబదిలీల వల్ల ప్రజల వినియోగ సామర్థ్యం పెరిగి ఆర్థిక వ్యవస్థకు ఎంతో కొంత తోడ్పడుతుందనే వాదన ఒకటి ఉన్నది. అయితే ఉచిత మంత్రం అన్నిసార్లూ అందరికీ ఉపయోగపడదన్నది నిన్న మొన్నటి ఢిల్లీ ఎన్నికల్లో కేజీవాల్, ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో జగన్ వంటి వారి ఓటమిని ఆపలేకపోయాయి. అందుకే అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలు ఉచితాల విషయమై రాజ్యాంగపరంగా నిషేధాలు విధించడం అవసరమేమో ఆలోచించాలి. భారతదేశ ఆర్థిక పరిస్థితిని ఆందోళనకర స్థాయికి తీసుకెళ్తాయని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. తెలంగాణ, ఎపిల అభివృద్ధికి ఉచిత పథకాలే అడ్డంకిగా మారాయి. తక్షణం వాటిని నివారించడంతో పాటు. ఈ బాధ్యతను కేంద్రప్రభుత్వమే తీసుకోవాలి. ఎన్నికల సంఘం కూడా ఈ పథకాల ప్రకటనలను నిషేధించాలి. ఒకసారి ఉచిత పథకాలు ప్రవేశ పెట్టాక వాటిని సమీక్షించుకునేందుకు ఏ ప్రభుత్వం ముందుకు రావడం లేదు. కిలో రూపాయి బియ్యం ఇందుకు ఉదాహరణ.

# మానసిక ఆనందాన్ని కల్గించే రేడియో



టీవీ అందరికీ ఒక ఇమేజ్ ఇస్తుంది, కానీ రేడియో లక్షలాది మెదడుల్లో లక్షలాది ఇమేజ్‌లకు జన్మనిస్తుంది.“
పెగ్గీ నూనన్ అన్నారు
వీడియో రేడియో స్టార్‌ను చంపిందని ప్రజలు అంటున్నారు, కానీ వాల్ స్ట్రీట్ జర్నల్ కాలమిస్ట్ పెగ్గీ నూనన్ అన్నారు రేడియో దజన్ల కొద్దీ సంవత్సరాలుగా ఎందుకు మనుగడలో ఉందో నిరూపిస్తుంది: ఇది శ్రోతలు టీవీ చేయలేని విధంగా వారి ఊహలను ఉపయోగించుకోవడానికి అనుమతిస్తుంది. ఈ కోట్ నూనన్ జ్ఞాపకాల నుండి వచ్చింది, వాట్ ఐ సా ఎట్ ది రివల్యూషన్: ఎ పొలిటికల్ లైఫ్ ఇన్ ది రీగన్ ఎరా.
ప్రపంచంలో అత్యంత సన్నిహితమైన మరియు సామాజికంగా వ్యక్తిగత మాధ్యమం రేడియో.“హ్యారీ వాన్ జెల్ అన్నారు
హ్యారీతో మేము హృదయపూర్వకంగా ఏకీభవిస్తున్నాము. రేడియో సన్నిహితంగా మరియు సామాజికంగా వ్యక్తిగతంగా లేకపోతే, మనకు రేడియో స్వర్ణయుగం ఉండేది కాదు , టాక్ రేడియో యొక్క ఆధునిక పునరావృతం, పాడ్‌కాస్ట్‌లు నేడు ఇంత ప్రజాదరణ పొంది ఉండేవి కావు. ప్రజలను చేరుకోగల రేడియో సామర్థ్యం గురించి వాన్ జెల్‌కు అన్నీ తెలుసు: అతను 1925 నుండి 1975 మధ్య అమెరికన్ రేడియో అనౌన్సర్.
మా ఆశీర్వాదకరమైన రేడియో. ఇది మనకు ప్రపంచంలోకి కళ్ళు మరియు చెవులను ఇస్తుంది. మేము మంచి సంగీతం కోసం మాత్రమే జర్మన్ స్టేషన్‌ను వింటాము. మరియు ఆశ కోసం మేము వింటాము.“అన్నే ఫ్రాంక్ అన్నారు ప్రియమైన అన్నే ఫ్రాంక్ తన ప్రసిద్ధ డైరీలో రాసిన ఈ కోట్, రేడియో ఎలా ప్రాణాలను కాపాడుతుందో చూపిస్తుంది. రేడియో సాధారణంగా ఆనందం కోసం ఉపయోగించబడుతుంది, కానీ క్లిష్టమైన విషయాలకు కూడా ఉపయోగించవచ్చు. అన్నే చెప్పినట్లుగా, రేడియో యొక్క రెండు పద్ధతులు మానవాళి శ్రేయస్సుకు ముఖ్యమైనవి.
సంగీతంతో మిమ్మల్ని చుట్టుముట్టండి. రేడియోను ఆన్ చేయడం మర్చిపోవద్దు అని–
లిసా ఎం.అన్నారు
ఆకాశవాణి వార్తలు చదువుతుంది ప్రయాగ రామకృష్ణ అంటూ రోజు శ్రావ్యంగా వార్తలు రేడియో లో వస్తాయి
ఎన్నో ఎఫ్ ఎం కేంద్రాలు వున్నాయి
రోజంతా అనేక కార్యక్రమాలు వస్తున్నాయి
కోట్లాది మంది శ్రోతలు వున్నారు
అరుణోదయపు ఆకాశం అంచులపై
అలసిన నిశ్శబ్దాన్ని తడిమే స్వరం రేడియో.
చిన్న పెట్టె గుండెలో
ఎన్నో ప్రపంచాల స్పందన.
గాలి తంతుల మీద జారే గీతం,
దూర గ్రామాల దుఃఖానందాలు,
పట్టణ వీధుల పరుగులు,
ఒకే తరంగంలో చేరిన మనసులు.
చాయ్ కప్పు పక్కన మెల్లగా వినిపించే వార్తలు,
పాత పాటలలో జ్ఞాపకాల పరిమళం,
ప్రకటనల మధ్యలో నవ్వుల చిరుజల్లులు
ఇల్లు మొత్తం మేల్కొల్పే మధుర మ్రోగు.

చ ూ చే
కళ్లకన్నా
వినే హృదయానికే దగ్గరైన స్నేహితుడు,
అడగక ముందే తోడు నిలిచే
అనాదిగా కొత్తగానే ఉండే మాయ స్వరం.
సిగ్నల్ కొంచెం దూరమైనా
సంబంధం మాత్రం తగ్గదు;
రేడియో
మన ఊపిరి తాకే తరంగాల కథ. ప్రపంచ రేడియో దినోత్సవం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 13న నిర్వహించ బడుతుందిరేడియో మాధ్యమ ప్రాధాన్యతను తెలియజేయడానికి ఈ దినోత్సవం జరుపుకుంటారు.
విద్యుదయస్కాంత శక్తి గల రేడియో తరంగాలను 1886లో మొదటి సారిగా ప్రముఖ జర్మన్ భౌతిక శాస్త్రవేత్త అయిన హెన్రిచ్ హెర్ట్జ కనిపెట్టారు. రేడియో తరంగాలను తొలిసారిగా గుర్తించిన హెన్రిచ్ హెర్ట్జ పేరిట రేడియో తరంగాల ఫ్రీక్వెన్సీని హెర్ట్జ లతో కొలవడం కొలవడం ప్రారంభించారు. ఇటాలియన్ శాస్త్రవేత్త గుగ్లిఎల్మో మార్కోనీ 1895 - 96 సంవత్సరం నాటికి రేడియో తరంగాలను శబ్ద తరంగాలుగా మార్చి ప్రసార మాధ్యమాలుగా వాడుకలోకి తీసుకు వచ్చారు.

### “మొదటి సారిగా రేడియో ప్రసారాలు:”

1920 నవంబరు 2 న అమెరికాలోని పిట్స్‌బర్గ్ లో మొట్టమొదటి రేడియో ప్రసారం కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అమెరికా అధ్యక్షుడిగా హార్డింగ్ ఎన్నికయ్యారు అనే వార్తను పిట్స్‌బర్గ్ కేంద్రంగా ప్రపంచంలోనే తొలిసారిగా రేడియో వార్తా ప్రసారం మొదలైంది. అనంతరం ఇంగ్లాండ్ లో 1922 అక్టోబర్

18 న
బ్రిటిష్ బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్ స్థాపించారు. 1922 నవంబరు 14 బీబీసీ లండన్ కేంద్రంగా తన ప్రసారాలను ప్రారంభించింది.

### భారతదేశంలో రేడియో చరిత్ర:

దేశంలోనే తొలిసారిగా, 1923 లో రేడియో క్లబ్ ఆఫ్ బాంబే రేడియో ప్రసారాలను ప్రారంభించింది. బ్రిటిష్ హయాంలో 23 జూలై 1927 న తొలి రేడియో స్టేషన్ బాంబేలో ప్రారంభమైంది. ఇండియన్ బ్రాడ్ కాస్టింగ్ కంపెనీ అప్పటి వైస్రాయ్ లార్డ్ ఇర్విన్ ప్రారంభించారు. 1936 లో ఇండియన్ బ్రాడ్ కాస్టింగ్ కంపెనీ పేరును ఆలిండియా రేడియోగా మార్చారు. ఆలిండియా రేడియో అధికారికంగా 1956 నుండి ఆకాశ వాణిగా పిలువబడుతుంది.

### ఆల్ ఇండియా రేడియో:

ఆలిండియా రేడియోను ప్రభుత్వ ఆధీనంలో పనిచేస్తుంది. ఇది కేంద్ర ప్రభుత్వ సమాచార, ప్రసార యంత్రాంగ అధ్వర్యములో స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రసార భారతికి చెందిన విభాగము. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చేనాటికీ భారత దేశంలో కేవలం 6 ఆలిండియా రేడియో కేంద్రాలు మాత్రమే ఉండేవి. అవీ: 1) బొంబాయి 2) కలకత్తా 3)ఢిల్లీ 4) మద్రాసు5) తిరుచిరాపల్లి6) లక్నో కేంద్రాలు. 2025నాటికీ దేశవ్యాప్తంగా 679 ఆలిండియా రేడియో కేంద్రాలు పని చేస్తున్నాయి.
1946, ఫిబ్రవరి 13న ఐక్యరాజ్యసమితి రేడియో ప్రారంభించబడింది కాబట్టి, ఆ సందర్భంగా ప్రతిఏటా ఫిబ్రవరి 13న ఈ

దినోత్సవం
జరుపుకునేలా జనరల్ కాన్ఫరెన్స్ 36వ సమావేశంలో ప్రపంచ రేడియో దినోత్సవాన్ని ప్రకటించాలని బోర్డు యునెస్కోకు సిఫారసు చేసింది. ఐక్యరాజ్యసమితి సభ్య దేశాలు, ఐక్యరాజ్యసమితి సంస్థలు, అంతర్జాతీయ ప్రాంతీయ సంస్థలు, వృత్తి సంఘాలు, ప్రసార సంఘాలు, ప్రభుత్వయేతర సంస్థలు మొదలైనవన్ని ప్రపంచ రేడియో దినోత్సవాన్ని జరుపుకోవాలని బోర్డు ఆహ్వానించింది. ప్రపంచ రేడియో దినోత్సవాన్ని జనరల్ అసెంబ్లీలో ఆమోదించడానికి, ప్రపంచవ్యాప్తంగా ఈ దినోత్సవం జరుపుకునే విధంగా యునెస్కో డైరెక్టర్ జనరల్ ఈ తీర్మానాన్ని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ దృష్టికి తీసుకురావాలని బోర్డు అభ్యర్థించింది. ఈ అభ్యర్థనను యునెస్కో జనరల్ కాన్ఫరెన్స్ పరిగణించి, 36 సి/63 ఫైల్‌లో ఉన్న తీర్మానాన్ని ఆమోదించింది. ప్రపంచ రేడియో దినోత్సవాన్ని 2011 నవంబరులో యునెస్కోలోని అన్ని సభ్య దేశాలు ఏకగ్రీవంగా ప్రకటించాయి.అప్పటి నుంచి ప్రతి ఏటా 13న ఈ రేడియో దినోత్సవం జరుపుకుంటారు.
కార్యక్రమాలు
స్త్రీ పురుషుల సమానత్వం కోసం లింగబేధం సంబంధిత అంశాల, విధానాల రూపకల్పనకు శ్రీకారం చుట్టేందుకు రేడియో స్టేషన్ యజమానులకు, ప్రభుత్వాలకు, కార్యదర్శులకు యునెస్కో అవగాహన కల్పిస్తుంది.
మహిళా రేడియో జర్నలిస్టుల రక్షణను పెంపొందించడం కోసం కృషి చేస్తుంది.ప్రతి రోజు రేడియో ను విందాం ఉల్లాసంగా ఉందాం

# మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు

## : జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నేషనలిస్ట్ వాయిస్ న్యూస్, నిర్మల్ బ్యూరో ఫిబ్రవరి 12.




మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.గురువారం పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, ఓట్ల లెక్కింపు విధుల్లో పాల్గొననున్న సిబ్బందికి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల వారీగా కౌంటింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించనున్న సిబ్బందికి అవసరమైన సూచనలు ఇచ్చారు. సమయపాలన అత్యంత ముఖ్యమని, సిబ్బంది నిర్ణీత సమయానికి కౌంటింగ్ కేంద్రాలకు హాజరుకావాలని ఆదేశించారు. అన్ని నియమాలను తూచా తప్పకుండా పాటిస్తూ, పారదర్శకంగా వేగవంతంగా కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు వీరారెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో పోలింగ్ విజయవంతంగా నిర్వహించినందుకు సిబ్బందిని అభినందించారు. అదే క్రమశిక్షణతో ఓట్ల లెక్కింపును కూడా పూర్తి చేయాలని పేర్కొన్నారు. సిబ్బందికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించామని తెలిపారు.అనంతరం కౌంటింగ్ హాలుల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలు, సిబ్బంది సహకారంతోనే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ప్రశాంతం: సిపి సాయి చైతన్య

**నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ ప్రతినిధి నిజామాబాద్**

ప్రజలు, సిబ్బంది సహకారంతోనే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడం జరిగిందని గురువారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లాలో నిజామాబాదు, బోధన్, ఆర్మూర్, భీంగల్ లో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల షెడ్యూల్డు వెలువడిన నాటి నుండి ఫిబ్రవరి 11 వరకు ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా కృషి చేసిన అన్ని రాజకీయ పార్టీలకు, ప్రజలందరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. శాంతి భద్రతల కోసం కిందిస్థాయి ఉద్యోగుల నుంచి ఉన్నతాధికారుల వరకు ఎనలేనికృషి చేయడం జరిగిందని,ప్రజలు మరియు పోలీసు అధికారుల మధ్య సమన్వయంతోనే ఈ ఎన్నికలు నజావుగా నిర్వహించడానికి ఎంతో తోడ్పడటం జరిగిందని తెలిపారు.



## కార్మికులను కట్టు బానిసలు చేస్తామనుకున్న కేంద్ర ప్రభుత్వం

**నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ ప్రతినిధి మందమర్రి**

నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు 29 చట్టాలను 4 లేబర్ కోడ్లుగా అమలు చేయడాన్ని నిరసనగా ఈరోజు కార్మిక జెఎసి నాయకుల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మెలొ సింగరెణి కార్మికులు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా కార్మిక జేఏసీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నీఅంతగా అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేయడాన్ని నిరసనగా ఈరోజు సంఘటిత, అసంఘటిత కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని సమ్మెను విజయవంతం చేశారని తెలిపారు. రెండవసారి కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పార్లమెంటులో 29 చట్టాలను 4 లేబర్ కోడులుగా చేసి కార్మికులను కట్టు బానిసలుగా మారుస్తున్నారని కార్మిక సంఘాలు లేకుండా పోరాడి సాధించుకున్న 8 గంటల పని దినాలను 12 గంటలుగా మారుస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను విదేశీ స్వదేశీ పెట్టుబడిదారులకు అమ్ముకుంటున్నారని తెలిపారు. తక్షణమే 4 లేబర్ కోడ్ విధానాలను వెనక్కు తీసుకొని పోరాడి సాధించుకున్న 29 చట్టాలనే అమలు చేయాలని లేకుంటే ఆందోళనలు, నిరసనలు, నిరవధిక సమ్మె చేసైనా సరే సాధించుకుంటామని హెచ్చరిస్తున్నామని అన్నారు. రాబోయే రోజుల్లో మేనేజ్మెంట్ కి వ్యతిరేకంగా జరిగే ఏ పోరాటానికైనా కలిసికట్టుగా, ఐక్యతతో పోరాడుదామని అన్నారు. జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమ్మెలో ఏఐటీయూసీ, ఐఎన్టియుసి, సిఐటియు, టిబిజికెఎస్ నాయకులు కార్యకర్తలు కార్మికులు పాల్గొన్నారు.



## బీజేపీ నాయకులు పద్మ ప్రసాద్ ఆధ్వర్యంలో వోటర్ నమోదు 9 వ రోజు విజయవంతం

**నేషనలిస్ట్ వాయిస్:నిజాంపేట్**

బీజేపీ సీనియర్ నాయకులు మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా బిల్డర్స్ సెల్ కన్వీనర్ పద్మ ప్రసాద్ ఆధ్వర్యములో నిజాంపేట్ డివిజన్లో ఓటర్స్ నమోదు వర్క్ షాప్ గత 10 రోజులుగ కొనసాగుతుంది.కాలనీ ప్రజలకి ఓట్ల నమోదుపై అవగాహన కల్పిస్తూ 18 సంవత్సరాల వయస్సు వచ్చిన నూతన ఓటర్స్ వేరే ప్రాంతాల నుండి ఇక్కడకి వచ్చి ఇక్కడే నివాసం ఉండే ఓటర్స్ కి అడ్రస్ చేంజ్ ఓట్లు డిలేట్ అవుతే మళ్లీ నమోదు లాంటి సేవలు అందించడం జరుగుతుంది.ప్రజలకి ప్రధాన ప్రజాసౌమ్య హక్కు అయిన ఓటు నమోదు అవకాశం కల్పించే ఒక అవకాశం ఒక గొప్ప అనుభూతి అని పద్మ ప్రసాద్ అన్నారు.గత 10 రోజులుగా ఈ కార్యక్రమం కొనసాగుతుందని ఇంకా ఎవరు అయినా ప్రజలు ఓటు నమోదు చేసుకోవాలని అనుకుంటే బాలాజీ హిల్స్ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన వర్క్ షాపులో నమోదు చేసుకోవచ్చునని తెలిపారు.





# కౌంటింగ్ కేంద్రాల వద్ద తూ.చా తప్పకుండా నిబంధనలు పాటించాలి: సిపి సాయి చైతన్య

**నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ నిజామాబాద్ బ్యూరో**

కౌంటింగ్ కేంద్రాల వద్ద తూ.చా తప్పకుండా నిబంధనలు పాటించాలని గురువారము నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఒక ప్రకటనలో పేర్కొన్నారుకౌంటింగ్ పూర్తి అయిన తర్వాత ఎలాంటి విజయవత్సవ ర్యాలీలకు అనుమతి లేదని,163 బిఎన్ఎస్ఎస్ చట్టము పటిష్టంగా అమలు జరుగుతుందని, నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు 2026 లో జరిగిన రెండవ సాధారణ ఎన్నికలకు సంబంధించి, 13న ప్రభుత్వ పాలిటెక్నిక్ (బాలురు) నిజామాబాద్, విజయమేరి హై స్కూల్, బోధన్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పిప్రి రోడ్, ఆర్మూర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, భీమ్‌గల్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు, 16న మేయర్, చైర్‌పర్సన్‌ల ఎన్నికల ప్రక్రియ సందర్భంగా, ప్రజాశాంతి, శాంతి మరియు ప్రశాంతతను కాపాడాలనే ఉద్దేశ్యంతో, నిషేధ ఉత్తర్వులను జారీ చేయడం జరిగిందని అన్నారు. లెక్కింపు కేంద్రం నుండి 5 కిలోమీటర్ల వ్యాసార్థంలో (05) లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమిగూడడాన్ని నిషేధం. ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమిగూడడాన్ని మరియు ఏ విధమైన ఊరేగింపులను నిర్వహించ రాదు, పూర్తిగా నిషేధం. విజయోత్సవ ర్యాలీ, బైక్ ర్యాలీ, పటాకులు కాల్చడం నిషేధించబడింది. ప్రజా రహదారులపై లేదా బహిరంగ ప్రదేశాలలో శాంతి భద్రతలకు భంగం కలిగించే లేదా ప్రజలకు అసౌకర్యం, చికాకు లేదా ప్రమాదాన్ని కలిగించే వ్యక్తులు గుమిగూడడాన్ని నిషేధం. ముందస్తు అనుమతి లేకుండా నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో ఎలాంటి బహిరంగ సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించడాన్ని నిషేధించడం.వివిధ వర్గాలు లేదా వ్యక్తుల మధ్య మతపరమైన వైరం లేదా ద్వేషాన్ని సృష్టించే లేదా చట్టాన్ని లేదా చట్టబద్ధమైన అధికారాన్ని ధిక్కరించే లేదా భంగం కలిగించే నేరానికి దారితీసే చిత్రాలు, ఫ్లెక్సీలు, చిహ్నాలు, ప్లకార్డులు లేదా ఏదైనా ఇతర వస్తువులను ప్రదర్శించడం, ప్రసంగించడం, సంజ్ఞ చేయడం లేదా అనుకరించడం, లేదా వ్యాప్తి చేయడం నిషేధం. ఊరేగింపులు, పెద్ద సమావేశాలు లేదా సమావేశాలలో వ్యక్తులు కౌంటింగ్ కేంద్రం నుండి ఒక కి.మీ. వ్యాసార్థంలో జెండాలు, లాఠీలు, తుపాకీలు లేదా దాడి లేదా రక్షణ కోసం ఆయుధాలుగా ఉపయోగించగల ఏవైనా ఇతర ఆయుధాలతో లేదా లేకుండా కర్రలను తీసుకెళ్లడాన్ని నిషేధించడం జరిగింది.రహదారులు, బహిరంగ ప్రదేశాలు, ప్రజలు రద్దీగా ఉండే ఇతర ప్రదేశాలలో షామియానాలు, పందళ్లు, ఖన్నత్ వంటి తాత్కాలిక నిర్మాణాలను నిర్మించడాన్ని నిషేధం గలదు. ముందస్తు అనుమతి లేకుండా ఏదైనా సంస్థ, ప్రజా సభ్యులు మొదలైన వారు మైకులు/పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ వాడటం, వాహనాల ద్వారా హారన్ వాడటం నిషేధం గలదు. సంగీతం, పాటలు పాడటం లేదా ప్రసంగాలు లేదా స్పీకర్లు లేదా ఇతర వాయిద్యాల ద్వారా ప్రసారం చేయడాన్ని నిషేధించడము జరిగింది. నిషేధ ఉత్తర్వులు ఈనెల 13 నుంచి 17 వరకు అమలులో ఉంటాయని అన్నారు.

# కార్మిక శక్తిని తాకట్టు పెట్టేందుకే లేబర్ కోడ్స్

### మోడీపాలన లో కార్మిక హక్కుల హననం

### -కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నేతల హెచ్చరిక - ఖమ్మంలో భారి ప్రదర్శన

**నేషనలిస్ట్ వాయిస్/ ఖమ్మం :**

దేశంలోని కార్మిక శక్తిని కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టేందుకే కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ అమల్లోకి తీసుకు వచ్చిందని అఖిలపక్ష, కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. నాలుగు లేబర్ కోడ్స్ పాటు విద్యుత్, -విత్తన సవరణ బిల్లులు, వి బి జీరాంజీ చట్టం కూడా దేశ ప్రజల పాలిట శాపంగా మారాయని వాటిని తక్షణం రద్దు చేయాలని నేతలు డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం ఖమ్మంలోని పెవిలియన్ మైదానం నుంచి జె డ్పి సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సమ్మెకు అన్ని కార్మిక సంఘాలు, బ్యాంకు ఉద్యోగ సంఘాలు, సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతు సంఘాలు సంపూర్ణ మద్దతునిచ్చాయి. పెవిలియన్ మైదానంలో వివిధ కార్మిక సంఘాల అధ్యక్షులు గాదె లక్ష్మి నారాయణ, నరాల -నరేష్నా యుడు, కళ్యాణం వెంకటేశ్వరరావు, కె. శ్రీనివాస్, వెంకన్న, ఎం డి వై పాషా అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ జాతీయ సమితి-సభ్యులు బాగం హేమంతరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, కాంగ్రెస్ నాయకులు నాగండ్ల దీపక్ చౌదరి, ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సిపిఐ (ఎంఎల్) మాస్లైన్ జిల్లా కార్యదర్శి -గోకినేపల్లి వెంకటేశ్వరరావు, వివిధ సంఘాల నాయకులు ఎస్ కె ఖాసీం, గుండాల కృష్ణ తదితరులు ప్రసంగించారు. బ్రిటిష్ పాలన కాలంలో సైతం కార్మికులు పోరాడి కార్మిక చట్టాలను, హక్కులను సాధించుకున్నారని దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న హక్కులను మోడీ ప్రభుత్వం రద్దు చేస్తుందని ఆరోపించారు. 50 కోట్ల కార్మిక హక్కులను ఒక శాతం జనాభా కలిగిన కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు లేబర్ కోడ్స్ను తీసుకు వచ్చారని ఆయన తెలిపారు. ఏ ప్రభుత్వం ఇంత వరకు కార్మికులకు అనుకూల చట్టాలు చేయలేదని కార్మికుల పోరాట -ఫలితంగానే పాలకులు చట్టాలు తీసుకు వచ్చారని వారు తెలిపారు. ఇప్పటికే ప్రైవేటీకరణ వేగం పెంచిన మోడీ ప్రభుత్వం యావత్ దేశ -సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే క్రమంలోనే 29 కార్మిక చట్టాలను మార్చారన్నారు. మోడీ



తీసుకు వచ్చిన చట్టాలలో సంక్షేమం, హక్కులు లేకపోగా ఆ చట్టాలకు సంక్షేమ చట్టాలని పేరుపెట్టడం నేతి బీరకాయలో నేతి చందమేనన్నారు. తక్షణమే లేబర్ కోడ్లను రద్దు చేసి పాత చట్టాలను కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెకు వచ్చిన స్పందన చూసిన తర్వాతనైనా తమ నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వం మార్చుకోవాలన్నారు. లేని పక్షంలో తగిన ఫలితాన్ని అనుభవించక తప్పదని వారు హెచ్చరించారు. ఈ ప్రదర్శనలో వివిధ సంఘాల -నేతలు కొండపర్తి గోవిందరావు, శింగు నర్సింహారావు, బిజి క్లెమెంట్, వై. విక్రం, తోట రామాంజనేయులు, రావి శివరామకృష్ణ, మోహన్రావు, -పిల్లి రమేష్, జాకీరుద్దీన్, పోటు కళావతి, విష్ణువర్ధన్, భూక్యా శ్రీను, సంగయ్య, పాల్వంచ కృష్ణ, రాజేష్, రవి, సైదా, మెరుగు సత్యనారాయణ, పొన్నం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





# సమన్వయంతో మహా శివరాత్రి జాతర విజయవంతం చేయాలి:ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



**నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ ముస్తాబాద్**

మహా శివరాత్రి జాతరను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించి.. విజయవంతం చేయాలని ఇంచార్జి కలెక్టర్, మహా శివరాత్రి జాతర కమిటీ చైర్ పర్సన్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఈ నెల 14, 15, 16 తేదీల్లో మహా శివరాత్రి జాతర సందర్భంగా అన్ని శాఖల అధికారులతో రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ నుంచి ఇంచార్జి కలెక్టర్ గురువారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భీమేశ్వర ఆలయంలో మహా శివరాత్రి జాతర సందర్భంగా భక్తులు స్వామి వారి దర్శనాన్ని సౌకర్యంగా చేసుకునేలా తుది దశ ఏర్పాట్లు ముమ్మరంగా చేయాలని ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా బస్ లు సిద్ధం చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. జడ్పీ డిప్యూటీ సీఈఓ, వేములవాడ మున్సిపల్ కమిషనర్, జిల్లా పంచాయతీ అధికారి సంయుక్తంగా ఆలయ పరిసరాలు, పార్కింగ్ స్థలాలు, క్యూ లైన్లు ఇతర చోట్ల మూడు షిఫ్టులో సిబ్బంది ఉండేలా చూడాలని ఆదేశించారు. జాతరకు ముందు నుంచి తరువాత మూడు రోజుల వరకు పారిశుధ్య సేవలు అందించాలని సూచించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆద్వర్యంలో బస్సు స్టాండ్, పార్కింగ్ స్థలాలు, ఇతర చోట్ల పూర్తి వివరాలతో హెల్ప్ డెస్క్ లు సిబ్బంది అందుబాటులో పెట్టాలని, ప్రతి చోట అన్ని వివరాలతో కూడిన సైన్ బోర్డులు పెట్టించాలని తెలిపారు. ఆలయంలోని క్యూల వద్ద, పార్కింగ్ స్థలాల వద్ద, బస్సు స్టాండ్లలో తాగునీటి సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. సెస్ అధికారులు భీమేశ్వర ఆలయం, బద్ది పోచమ్మ ఆలయం, ఇతర చోట్ల 24 గంటల పాటు విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు కూడా చేసుకోవాలని, అధికారులు, సిబ్బంది ఉండాలని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖా ఆద్వర్యంలో భీమన్న ఆలయం, ప్రసాదం కౌంటర్, పార్కింగ్ స్థలాలు ఇతర చోట్ల వైద్యులు, సిబ్బంది, అంబులెన్స్ లతో సిద్దంగా ఉండాలని వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా, అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అగ్ని మాపక శాఖా అధికారులు ప్రధాన ఆలయాల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలు చెక్ చేయాలని, వారి సిబ్బంది గుడి ఆవరణలో జాతర సమయంలో సిద్దంగా ఉండాలని సూచించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు భక్తులకు అందించే ప్రసాదం, ఇతర ఆహార పదార్థాలను పరిశీలించాలని ఆదేశించారు. క్యూ లైన్లు, వీఐపీలు, కళ్యాణ కట్ట, ఇతర చోట్ల రద్దీ నియంత్రణ, దర్శనం పూర్తి చేసేందుకు జిల్లా స్థాయి అధికారులను నియమించామని, వారు ఆయా ఏర్పాట్లను పర్యవేక్షించాలని తెలిపారు. కోడెల నిర్వహణ, సంరక్షణ జిల్లా పశు సంవర్ధక శాఖ, ఆలయ అధికారులు సమన్వయంతో చూసుకోవాలని ఆదేశించారు. జాతర ఆవరణలో ప్లాస్టిక్ వస్తువులు వినియోగించకుండా చూడాలని సూచించారు. వృద్దులు, దివ్యాంగులకు సహాయం కోసం వీల్ చైర్లు వాలంటీరను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతర విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బందికి కావాల్సిన గదులు, ఆహారం, ఇతర సదుపాయాలు వేములవాడ ఆర్డీఓ, ఆలయ అధికారులు చూసుకోవాలని సూచించారు. అన్ని శాఖల జిల్లా అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని, జాతరకు వచ్చే భక్తులకు ఎక్కడా దర్శనం, వసతులలో ఇబ్బందులు రాకుండా చూడాలని స్పష్టం చేసారు. మీడియా సెంటర్ ఏర్పాటు చేయాలని, వీఐపీ, వీవీఐపీల దర్శనానికి అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. టెలీ కాన్ఫరెన్స్ లో ఎస్పీ మహేష్ బి గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, ఆలయ ఈఓ రమాదేవి పాల్గొన్నారు.

## ఒమన్?పై శ్రీలంక 105 పరుగుల తేడాతో భారీ విజయం

## టీ20 వరల్డ్?కప్?లో శ్రీలంక వరుసగా రెండో విజయం





టీ20 వరల్డ్?కప్?లో శ్రీలంక వరుసగా రెండో విజయం నమోదు చేసింది. కొలంబో వేదికగా ఒమన్?తో గురువారం జరిగిన మ్యాచ్?లో 105 పరుగుల భారీ తేడాతో నెగ్గింది. లంక నిర్దేశించిన 226 పరుగుల ఛేదనలో ఒమన్ తేలిపోయింది. లంక బౌలర్లు విజృంభించడంతో 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 120 పరుగులే చేయగలిగింది. దుష్మంత చమీర, మహీష్ తీక్షణ చెరో 2, దునిత్ వెల్లలాగే, డాసున్ హేమంత, కామిందు మెండిస్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు. భారీ లక్ష్య ఛేదనలో ఒమన్ పవర్? ప్లే లోనే ఒమన్ మూడు వికెట్లు కోల్పోయింది. ఆమిర్ ఖలీమ్ (6 పరుగులు), జితేందర్ సింగ్ (1 పరుగు), హమ్మద్ మీర్జా (9 పరుగులు) స్వల్ప స్కోర్లకే పెవిలియన్ చేరారు. అప్పుడు క్రీజులోకి వచ్చిన మహ్మద్ నదీమ్, వాసిమ్?తో కలిసి వికెట్ల పతనాన్ని కాసేపు అడ్డుకున్నాడు. ఈ ఇద్దరూ నాలుగో వికెట్?కు 42 పరుగులు జోడించారు. అయితే 11.5 వద్ద వాసిమ్?ను తీక్షణ ఔట్ చేశాడు. ఆ తర్వాతి ఓవర్లో తొలి బంతికే వినాయక్ శుక్లా (1 పరుగు) ఔట్ అయ్యాడు. ఇక ఒమన్?లో నదీమ్? ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించాడు. కానీ, నదీమ్ కావాల్సినంత వేగాంగా పరుగులు చేయలేదు. అతడు ఈ ఇన్నింగ్స్?లో 56 బంతులు ఆడినప్పటికీ చేసింది 53 పరుగులే. ఇందులో మూడు ఫోర్లు, ఒక సిక్స్? ఉన్నాయి. వాసిమ్ అలీ (27 పరుగులు) ఫర్వాలేదనిపించాడు. ఈ ఇద్దరు మినహా మిగిలిన బ్యాటర్లెవరూ రెండంకెల స్కోర్ చేయలేదు. చివర్లో వికెట్లు పడుతున్న నదీమ్ క్రీజులో నిలబడి తమ జట్టును ఆలౌట్ గండం నుంచి తప్పించాడు.కాగా, టీ20ల్లో పరుగులు పరంగా ఇది శ్రీలంకకు రెండో అతిపెద్ద విజయం. 2007 వరల్డ్?కప్?లో కెన్యాపై 172 పరుగుల భారీ తేడాతో లంక నెగ్గింది. పరుగుల పరంగా లంక జట్టుకు ఇదే భారీ విజయం. అటు ఒమన్?కు ఇదే అతి ఘోర ఓటమి. పొట్టి ఫార్మాట్?లో 100కు పైగా పరుగుల తేడాతో ఒడిపోవడం ఇదే తొలిసారి. గతంలో ఒమన్ 2025 ఆసియా కప్?లో పాక్?పై 93 రన్స్?తో ఓడింది.అంతకుముందు బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 225 పరుగుల భారీ స్కోర్ చేసింది. శ్రీలంక బ్యాటర్లలో కుశాల్ మెండిస్ (61 పరుగులు, 45 బంతుల్లో), పవన్ రత్నాయకే (60 పరుగులు, 28 బంతుల్లో; 8ఇ4, 1ఇ6), డాసున్ శనక (50 పరుగులు) హాఫ్ సెంచరీలతో అదరగొట్టారు. ఒమన్ బౌలర్లలో జితేన్ రామ్?నంది 2, సఫ్యాన్ మహ్మద్, జయ్ ఒడెద్ర తలో 1 వికెట్ దక్కించుకున్నారు.ఈ టోర్నీలో లంకకు ఇది వరుసగా రెండో విజయం. తొలుత ఐర్లాండ్?పై గెలిచిన లంక, తాజాగా ఒమన్?పై విక్టరీ కొట్టింది. దీంతో గ్రూప్ బీలో 4 పాయింట్లతో టాప్?లో ఉంది. ఇక శ్రీలంక తదుపరి మ్యాచ్?లో ఆస్ట్రేలియా (ఫిబ్రవరి 16), జింబాబ్వే (ఫిబ్రవరి 19) ఆడాల్సి ఉంది.



## భారత క్రికెటర్ల వాచ్‌ల విలువ కాదు పాక్ ఆటగాళ్ల నెట్‌వర్త్..?

## షోయబ్ అక్తర్ మాట్లాడినట్లు వైరల్‌గా మారిన ట్వీట్

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్-పాకిస్థాన్ హైఓల్టేజ్ మ్యాచ్‌కు రంగం సిద్దమైంది. ఈ మ్యాచ్‌పై నెలకొన్న సందిగ్దతకు ఐసీసీ తెరదించిన సంగతి తెలిసిందే. బంగ్లాదేశ్‌కు సంఘీభావంగా భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నామని ప్రకటించిన పాకిస్థాన్.. ఐసీసీ ఆంక్షలకు తలొగ్గి తమ నిర్ణయాన్ని మార్చుకుంది. భద్రతా కారణాలతో టీ20 ప్రపంచకప్ 2026 నుంచి తప్పుకున్న బంగ్లాదేశ్‌పై ఎలాంటి చర్యలు తీసుకోమని ఐసీసీ హామీ ఇవ్వడంతో భారత్‌తో మ్యాచ్ ఆడేందుకు పాకిస్థాన్ సిద్దమైంది.భారత్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లను పునరుద్దరించాలని ఈ సందర్భంగా పీసీబీ డిమాండ్ చేయగా.. ఐసీసీ తిరస్కరించింది. తమ పరిధిలో లేని వ్యవహారమని, బీసీసీఐని ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడమని ఆదేశించలేమని స్పష్టం చేసింది. మిత్ర దేశాల విజ్ఞప్తుల నేపథ్యంలో బాయ్‌కట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నామని పాకిస్థాన్ ప్రభుత్వం ఒక ప్రకటనను విడుదల చేసింది.దాంతో ఆదివారం(ఫిబ్రవరి 15) కొలంబో వేదికగా భారత్-పాకిస్థాన్ మ్యాచ్ జరగనుంది. పాకిస్థాన్ బాయ్‌కాట్ డ్రామా నేపథ్యంలో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కొలంబో పిచ్ స్పిన్‌కు అనుకూలంగా ఉండటం.. పాకిస్థాన్‌లో ఐదుగురు స్పిన్నర్లు ఉండటం ఈ మ్యాచ్‌పై హైప్‌ను క్రియేట్ చేస్తోంది. ముఖ్యంగా మిస్టరీ స్పిన్నర్ ఉస్మాన్ తారీక్ అద్భుత ప్రదర్శన కనబరుస్తుండటంతో భారత్‌కు గట్టి పోటీ ఎదురవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే ఈ మ్యాచ్‌పై సోషల్ మీడియా వేదికగా జోరుగా చర్చ జరుగుతోంది.అయితే ఈ చర్చ మధ్యలో కొన్ని ఫేక్ ట్వీట్స్, కామెంట్స్ కూడా నెటిజన్లను అయోమయానికి గురి చేస్తున్నాయి. భారత్‌తో పాకిస్థాన్ జట్టును పోల్చడం సరికాదని, భారత ఆటగాళ్ల వాచీల ధర అంత కూడా పాక్ ఆటగాళ్ల సంపాదన ఉండదని షోయబ్ అక్తర్ మాట్లాడినట్లు ఓ ఫేక్ ట్వీట్ వైరల్‌గా మారింది.భారత ఆటగాళ్లతో పాకిస్థాన్ ప్లేయర్లను అస్సలు పోల్చలేరు. మా క్రికెటర్ల నెట్‌వర్త్ భారత ఆటగాళ్లు వాడే ఖరీదైన వాచులతో సమానం.'అని షోయబ్ అక్తర్.. ఓ ప్రముఖ భారత న్యూస్ ఛానెల్‌తో అన్నట్లు ఓ ఫేక్ ట్వీట్ వైరల్‌గా మారింది. అయితే ఇందులో ఏ మాత్రం నిజం లేదు. ఈ కామెంట్స్‌ను అక్తర్ ఎక్కడా అనలేదు. పాకిస్థాన్‌పై ఉన్న కోపంతో ఓ భారత నెటిజన్ క్రియేట్ చేసిన పోస్ట్ అని ఈ విషయం స్పష్టంగా తెలుస్తోంది. ఎక్స్ ఏఐ చాట్‌బాట్ గ్రోక్ కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. ఇది నకిలీ పోస్ట్ అని తేల్చింది. మెగా టోర్నీల్లో పాకిస్థాన్‌పై భారత్‌దే పైచేయిగా ఉంది. ఆసియా కప్ 2025 టోర్నీలో మూడు మ్యాచ్‌లకు మూడింటిలోనూ భారత్‌పై పాకిస్థాన్ ఓటమిపాలైంది.

## హార్దిక్ పాండ్యా రికార్డుకు గురిపెట్టిన వైభవ్ సూర్యవంశీ..



ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందే క్రికెట్ అభిమానులకు అసలైన మజా ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ. ఒకప్పుడు హార్దిక్ పాండ్యా ఒకే ఇన్నింగ్స్‌లో 20 సిక్సర్లు బాది సృష్టించిన సునామీ గుర్తు ఉండే ఉంటుంది. ఇప్పుడు అదే టోర్నమెంట్‌లో ఈ చిచ్చరపిడుగు తన ప్రతాపం చూపించబోతున్నాడు. ఫిబ్రవరి 23 నుంచి ముంబైలో ప్రారంభం కానున్న ప్రతిష్టాత్మక డీవై పాటిల్ టీ20 టోర్నమెంట్?లో వైభవ్ ఆడటం దాదాపు ఖాయమైంది. డీవై పాటిల్ టీ20 టోర్నమెంట్ అంటేనే స్టార్ ప్లేయర్లకు అడ్డా. 2020లో గాయం నుంచి కోలుకున్న తర్వాత హార్దిక్ పాండ్యా ఇదే టోర్నీలో విశ్వరూపం చూపించాడు. కేవలం 55 బంతుల్లో 20 సిక్సర్లు, 6 ఫోర్లతో 158 పరుగులు చేసి క్రికెట్ లోకాన్ని ఆశ్చర్యపరిచాడు. కేవలం రెండు రోజుల వ్యవధిలోనే రెండు సెంచరీలు బాదిన పాండ్యా, అప్పట్లో ఈ టోర్నీ స్థాయిని అమాంతం పెంచేశాడు. ఇప్పుడు అదే వేదికపై వైభవ్ సూర్యవంశీ తన సత్తా చాటబోతున్నాడు. ప్రస్తుతం వైభవ్ సూర్యవంశీ పేరు మార్మోగిపోవడానికి బలమైన కారణం ఉంది. ఇటీవల ముగిసిన అండర్-19 వరల్డ్ కప్ 2026 ఫైనల్లో కేవలం 80 బంతుల్లోనే 175 పరుగులు బాది సంచలనం సృష్టించాడు. ఈ ఏడాది ఇప్పటికే అండర్-19 క్రికెట్‌లో రెండు సెంచరీలు సాధించిన వైభవ్, ఇప్పుడు సీనియర్ ప్లేయర్లతో తలపడేందుకు సిద్ధమయ్యాడు. ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడనున్న వైభవ్, దానికి ముందు ఈ టోర్నీని ఒక వార్మప్ సెషన్‌గా భావిస్తున్నాడు. తాజా సమాచారం ప్రకారం.. వైభవ్ ప్రస్తుతం రాజస్థాన్ రాయల్స్ ఆధ్వర్యంలో తాళేగావ్‌లో జరుగుతున్న శిక్షణా శిబిరంలో ఉన్నాడు. ఈ క్యాంప్ ఫిబ్రవరి 21న ముగియనుంది. ఆ తర్వాత తన స్వస్థలానికి వెళ్లి, తిరిగి ముంబై చేరుకుని డీవై పాటిల్ టోర్నీలో పాల్గొంటాడు. 16 జట్లు తలపడే ఈ టోర్నమెంట్‌లో వైభవ్ ప్రదర్శనను ఐపీఎల్ ఫ్రాంచైజీలు కూడా నిశితంగా గమనించనున్నాయి. డీవై పాటిల్ టీ20 టోర్నమెంట్ 2003లో ప్రారంభమైంది. దేశంలోని అత్యంత పురాతనమైన, క్రేజీ టీ20 టోర్నమెంట్లలో ఇది ఒకటి. గత 23 ఏళ్లుగా ఈ టోర్నీ ఎంతో మంది యువ ప్రతిభావంతులను వెలుగులోకి తెచ్చింది. రోహిత్ శర్మ, శిఖర్ ధావన్ వంటి దిగ్గజాలు కూడా ఒకప్పుడు ఇక్కడ ఆడినవారే. ఇప్పుడు 15 ఏళ్ల వయసులోనే వైభవ్ సూర్యవంశీ ఇక్కడ సత్తా చాటితే, ఐపీఎల్ 2026లో అతనే సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలవడం ఖాయం.

## పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌కు అభిషేక్ శర్మ దూరం?



టీ20 ప్రపంచ కప్ 2026 భారత్ తన రెండో మ్యాచ్ ఆడుతోంది. మొదటి మ్యాచ్‌లో అమెరికాపై విజయం సాధించింది. ఇప్పుడు రెండో మ్యాచ్ నమీబియాతో తలపడుతోంది. మొదటి మ్యాచ్‌లో తొలి బంతికే అవుట్ అయిన అభిషేక్ శర్మ ఆరోగ్యం ఇప్పుడు టీమిండియాను టెన్షన్ పెడుతోంది. అభిషేక్ కడుపు సమస్యతో ఇబ్బంది పడుతున్నాడు. ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. ఇప్పుడు, నమీబియాతో జరిగే రెండో మ్యాచ్ కోసం అభిషేక్ ప్లేయింగ్ ఎలెవెన్‌లో చోటు దక్కలేదు. మ్యాచ్‌కు ముందు టాస్ సందర్భంగా, భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అభిషేక్ శర్మ ఆరోగ్యం గురించి అప్‌డేట్ ఇచ్చాడు. సూర్య అప్‌డేట్ అభిమానులకు నిజంగా షాక్‌కి గురి చేసింది. పాకిస్తాన్‌తో జరిగే తదుపరి మ్యాచ్‌కు అభిషేక్ కూడా దూరంగా ఉండవచ్చని అతను చెప్పడం ఆందోళనకలిగిస్తోంది. టాస్ తర్వాత అభిషేక్ ఆరోగ్యం గురించి అడిగిన ప్రశ్నకు సూర్యకుమార్ యాదవ్ స్పందిస్తూ, "అభిషేక్ ఇంకా బాగా లేదు. అతను ఒకటి లేదా రెండు మ్యాచ్‌లకు దూరమవుతాడు" అని అన్నారు. సూర్య ప్రకటన స్పష్టంగా అర్థం ఏమిటంటే, నమీబియా తర్వాత, పాకిస్తాన్‌తో జరిగే తదుపరి మ్యాచ్‌కు కూడా అభిషేక్ దూరమవవచ్చు. భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్ ఫిబ్రవరి 15 ఆదివారం శ్రీలంకలోని కొలంబోలో జరుగుతుంది. ఈ మ్యాచ్‌కు అభిషేక్ తిరిగి వస్తాడా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. టోర్నమెంట్‌లో భారత్ ప్రధాన ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ అభిషేక్ శర్మ. అతని స్థానంలో ఓపెనింగ్ వస్తున్న సంజూ శాంసన్ ఫామ్‌లో లేడు. ఆయన ధాటిగా ఆడటానికి పరుగులు చేయడానికి ఇబ్బంది పడుతున్నాడు. అయితే, అమెరికాతో జరిగిన మ్యాచ్‌లో అభిషేక్ విఫలమయ్యాడు. ఖాతా తెరవకుండానే మొదటి బంతికే ఔటయ్యాడు. అయినప్పటికీ, పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌లో అభిషేక్ ఉండటం టీమ్ ఇండియాకు పెద్ద ప్రయోజనకరంగా ఉంటుంది. కానీ సూర్య చెప్పినదే నిజమైతే కచ్చితంగా భారత్‌కు మానసికంగా దెబ్బ తగిలినట్టే. 2025 ఆసియా కప్‌లో పాకిస్థాన్‌పై అభిషేక్ విధ్వంసకరమైన బ్యాటింగ్ చేశాడు. ఇప్పుడు పాకిస్తాన్‌పైనే కాకుండా ఆ వరల్డ్‌కప్ మొత్తంలో అభిషేక్ ధాటిగా ఆడటం భారత్‌కు చాలా అవసరం.



## సూపర్-8 రేసులో వెనుకబడ్డ ఇంగ్లాండ్

టీ20 వరల్డ్ కప్ 2026 రసవత్తరంగా సాగుతోంది. ప్రతి మ్యాచ్ తర్వాత పాయింట్ల పట్టిక తలకిందులవుతోంది. ఫిబ్రవరి 11న జరిగిన కీలక పోరులో వెస్టిండీస్ చేతిలో ఇంగ్లాండ్ ఓడిపోవడంతో సూపర్-8 ఈక్వేషన్స్ పూర్తిగా మారిపోయాయి. ఒకప్పుడు డిఫెండింగ్ ఛాంపియన్లుగా వెలిగిన ఇంగ్లాండ్ టీమ్, ఇప్పుడు తదుపరి రౌండ్‌కు చేరుతుందా లేదా అన్న ఆందోళనలో పడిపోయింది. ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరిగిన ఉత్కంఠ పోరులో వెస్టిండీస్ 30 పరుగుల తేడాతో ఇంగ్లాండ్‌ను చిత్తు చేసింది. దీంతో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన వెస్టిండీస్ 4 పాయింట్లతో గ్రూప్-సిలో అగ్రస్థానంలో నిలిచింది. ఇంగ్లాండ్ పరిస్థితి ఇప్పుడు అగమ్యగోచరంగా మారింది. ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఒకటి గెలిచి, ఒకటి ఓడిపోయినప్పటికీ.. రన్ రేట్ తక్కువగా ఉండటంతో స్కాట్లాండ్ కంటే వెనుకబడి మూడో స్థానంలో ఉంది. సూపర్-8కి వెళ్లాలంటే ఇంగ్లాండ్ ఇకపై ప్రతి మ్యాచ్ గెలవడమే కాకుండా ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది.సౌతాఫ్రికా, ఆఫ్ఘనిస్తాన్ మధ్య జరిగిన మ్యాచ్ క్రికెట్ చరిత్రలోనే నిలిచిపోతుంది. నిర్ణీత సమయంలో స్కోర్లు సమం కావడంతో ఏకంగా రెండు సూపర్ ఓవర్లు ఆడాల్సి వచ్చింది. చివరకు సౌతాఫ్రికా విజయం సాధించినా.. పాయింట్ల పట్టికలో మాత్రం రెండో స్థానానికే పరిమితమైంది. న్యూజిలాండ్ (ం1.919) రన్ రేట్ సౌతాఫ్రికా (ం1.425) కంటే మెరుగ్గా ఉండటంతో కివీస్ జట్టు అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఆఫ్ఘనిస్తాన్‌కు ఈ ఓటమి పెద్ద దెబ్బ అనే చెప్పాలి.గ్రూప్-బిలో ఆస్ట్రేలియా తన మొదటి మ్యాచ్‌లోనే భారీ విజయాన్ని అందుకొని పాయింట్ల పట్టికలో నంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఇతర జట్లతో పోలిస్తే ఆసీస్ రన్ రేట్ అత్యధికంగా ఉండటంతో ప్రస్తుతానికి ఆ గ్రూప్‌లో వాళ్లే బాస్‌లా కనిపిస్తున్నారు. ఇక్కడ కూడా సూపర్-8 రేసు కోసం తీవ్రమైన పోటీ నెలకొంది.ప్రస్తుతానికి గ్రూప్-ఏలో పాకిస్థాన్ రెండు మ్యాచ్‌లకు రెండు గెలిచి 4 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. అయితే టీమిండియా ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ మాత్రమే ఆడి విజయం సాధించింది. నేడు నమీబియాతో జరగబోయే మ్యాచ్‌లో భారత్ ఘనవిజయం సాధిస్తే, పాకిస్థాన్‌ను వెనక్కి నెట్టి నంబర్ వన్ స్థానానికి చేరుకుంటుంది. ఎందుకంటే భారత నెట్ రన్ రేట్ పాక్ కంటే చాలా మెరుగ్గా ఉంది. ఈ పోరు సూపర్-8 గ్రూపింగ్స్‌లో కూడా కీలకం కానుంది.



# యువతరానికి కనెక్ట్ అయ్యే హుషారు పిట్టలు



టాలీవుడ్ యువ నటులు అన్ను, వాసవి గణెశిషన్ జంటగా రూపొందుతోన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'హుషారు పిట్టలు'. పద్మ అమ్మ, బీవీజీ స్టూడియోస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి బిక్షు దర్శకుడు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ ఏషియన్ సురేష్ ఫిలింస్ విడుదల చేస్తుండగా. ఈ చిత్ర టీజర్‌ను ప్రముఖ నిర్మాత డి.సురేష్‌బాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ.. నిర్మాత బెక్కం వేణుగోపాల్ ద్వారా ఈ సినిమా గురించి తెలిసిందని, సినిమా చూడగానే ఇది నేటి యువతరానికి బాగా కనెక్ట్ అయ్యే రియలిస్టిక్ మూవీ అనిపించిందని ప్రశంసించారు. చిత్రంలోని నటీనటులందరూ అద్భుతంగా నటించారని, ప్రేక్షకులకు ఈ సినిమా తప్పకుండా నచ్చుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దర్శకుడు బిక్షు మాట్లాడుతూ.. 16 ఏళ్ల కష్టానికి ప్రతిఫలంగా ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం కావడం ఆనందంగా ఉందన్నారు. తన నిజజీవితంలో చుట్టుపక్కల జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా, యువతతో పాటు తల్లిదండ్రులు కూడా చూడాల్సిన ఒక బాధ్యతాయుతమైన కథను వినోదాత్మక శైలిలో రూపొందించానని తెలిపారు. సురేష్ ప్రొడక్షన్స్ వంటి పెద్ద సంస్థ ద్వారా సినిమా విడుదల కావడం తన అదృష్టమని పేర్కొన్నారు.నిర్మాత బెక్కం వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఈ సినిమా చూసినప్పుడు తనకు షాకింగ్‌గా అనిపించిందని, ప్రథమార్థం యూత్‌ఫుల్‌గా ఉంటూనే ద్వితీయార్థంలో ఎంతో మెచ్యూర్డ్ కంటెంట్ ఉంటుందని చెప్పారు. కంటెంట్ నచ్చడం వల్లే సురేష్ బాబు ఈ సినిమాను సపోర్ట్ చేస్తున్నారని, ఇది అందరిలో బాధ్యతను పెంచే చిత్రమని తెలిపారు.హీరో అన్ను తాను మాసినపల్లి రవి పాత్రలో కనిపిస్తానని చెప్పగా, హీరోయిన్ వాసవి గణెశిషన్ తన తొలి చిత్రంలోని పాత్ర అందరికీ నచ్చుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సంగీత దర్శకుడు చిన్ని చరణ్ మాట్లాడుతూ, ఈ సినిమా తనను మాస్ కమర్షియల్ మ్యూజిక్ డైరెక్టర్‌గా నిలబెడుతుందని ధీమా వ్యక్తం చేశారు. నిర్మాత వెంకట్ యాదవ్ మాట్లాడుతూ, ఏడేళ్ల అనుభవంతో, కథపై నమ్మకంతో ఈ సినిమాను నిజాయితీగా నిర్మించామని, యువతకు మంచి సందేశాన్ని ఇస్తుందని తెలిపారు. అన్ను, వాసవి గణెశిషన్‌తో పాటు గోవర్ధన్, సునీత్ మనోహర్, రమేష్, బలగం బాబు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి చరణ్-అర్జున్ సంగీతాన్ని అందించారు.

# అప్పలసూరిగా జగపతిబాబు

ఒకప్పటి ఫ్యామిలీ హీరో, ప్రస్తుతం స్టార్ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా దూసుకుపోతున్న జగపతి బాబు తాజాగా తన లుక్‌తో అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న 'పెద్ది' సినిమా కోసం ఆయన పూర్తిగా మారిపోయిన కొత్త రూపం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఫోటోను చూసిన నెటిజన్లు ఇతను జగపతి బాబా అంటున్నారు. ఈ చిత్రంలో జగపతి బాబు 'అప్పల సూరి' అనే కీలక పాత్రలో నటిస్తున్నట్లు ఇప్పటికే చిత్రబృందం ప్రకటించింది. ఆ పాత్ర కోసం ఆయన బాగా బరువు తగ్గి, వయసు ముదిరిన వ్యక్తిలా కనిపించేలా ప్రత్యేక మేకోవర్ తీసుకున్నట్టు తెలుస్తోంది. తాజాగా విడుదలైన సెట్స్ ఫోటోలో దర్శకుడు బుచ్చిబాబుతో మాట్లాడుతున్న జగపతి బాబు రూపం చూసి అభిమానులు షాక్ అవుతున్నారు. ఏ కోణంలో చూసినా ఆయన గుర్తుపట్టలేనంతగా మారిపోయారని పలువురు అభిప్రాయపడుతున్నారు. జగపతి బాబు బర్త్ డే సందర్భంగా ఈ పిక్ రిలీజ్ చేశారు మేకర్స్. గతంలో కూడా జగ్గూ భాయ్‌కి సంబంధించిన పిక్ ఒకటి షేర్ చేయగా, అది కూడా నెట్టింట వైరల్ అయింది. ఇక జగపతి బాబు గతంలో కూడా పాత్ర కోసం తన లుక్‌ను పూర్తిగా మార్చుకున్న సందర్భాలు ఉన్నాయి. అయితే ఈసారి 'పెద్ది' కోసం తీసుకున్న మేకోవర్ మాత్రం మరింత విభిన్నంగా ఉండటంతో సినిమాపై ఆసక్తి పెరిగింది. ఒకప్పుడు హీరోగా మెప్పించిన ఆయన, తర్వాత విలన్ మరియు క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించి వరుస విజయాలతో తన ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకున్నారు. ఇక రామ్ చరణ్ – జగపతి బాబు కాంబినేషన్ ఇప్పటికే 'రంగస్థలం' చిత్రంలో ప్రేక్షకులను ఆకట్టుకున్న విషయం తెలిసిందే. మరోసారి ఈ జోడీ 'పెద్ది'లో కనిపించబోతుండటంతో అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి. ఈ సినిమా ఏప్రిల్ 30న విడుదలకు సిద్ధమవుతుండగా, జగపతి బాబు పోషిస్తున్న పాత్ర ఎలా ఉండబోతుందో తెలుసుకోవాలనే ఉత్సుకత సినీ ప్రియుల్లో నెలకొంది. మొత్తానికి, 'పెద్ది' కోసం జగపతి బాబు చేసిన ఈ భారీ మేకోవర్ ఇప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది.






# సుహాస్ వైవిధ్యంగా హే భగవాన్

వైవిధ్యమైన కథలతో టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరో సుహాస్, తాజాగా 'హే భగవాన్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమయ్యారు. ఫిబ్రవరి 20న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ ట్రైలర్ చూస్తుంటే.. సీనియర్ నటుడు నరేష్ తన కుటుంబ వ్యాపారాన్ని రహస్యంగా నిర్వహిస్తుంటారు. ఆ వ్యాపారం ఏంటో ఎవరికీ చెప్పకూడదనే నిబంధన ఉంటుంది. అయితే తన తండ్రి వ్యాపారాన్ని సుహాస్ టేకోవర్ చేద్దామనుకుంటాడు. ఈ క్రమంలో ఎదురయ్యే సంఘటనలు ఏంటి అనేది ఈ చిత్ర కథాంశం. 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్' తర్వాత సుహాస్ మరియు శివానీ నాగారం మరోసారి జోడీ కట్టడం ఈ సినిమాపై అంచనాలను పెంచుతోంది. దర్శకుడు గోపీ అచ్చర ఈ చిత్రాన్ని అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించడమే కాకుండా, ÷-లక్లైమాక్స్‌లో ఒక మంచి ఎమోషనల్ టచ్ కూడా ఉంటుందని తెలిపారు. వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను త్రిశూల్ విజనరీ స్టూడియోస్ నిర్మించగా, బన్నీ వాస్ మరియు వంశీ నందిపాటి సంయుక్తంగా విడుదల చేస్తున్నారు.




# వెంకీ అట్లూరితో నాని మూవీకి ప్లాన్

స్టార్ కథానాయకుడు నాని ప్రస్తుతం వరుస హిట్లతో జోష్ మీద ఉన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ది ప్యారడైజ్ సినిమాతో బిజీగా ఉన్న నాని ఆ తర్వాత సుజిత్ దర్శకత్వంలో ఒక సినిమా చేయబోతున్నాడు. అయితే ఈ రెండు చిత్రాలు కాకుండా మరో క్రేజీ దర్శకుడితో నాని చేతులు కలపబోతున్నట్లు తెలుస్తుంది. 'సార్', 'లక్కీ భాస్కర్' వంటి వైవిధ్యమైన చిత్రాలతో వరుస విజయాలు అందుకున్న దర్శకుడు వెంకీ అట్లూరితో నాని సినిమా చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ చిత్రాన్ని టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మించబోతున్నాడు. 'జెర్సీ' వంటి నేషనల్ అవార్డ్ విన్నింగ్ సినిమా తర్వాత నాని ? సితార కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ ప్రాజెక్ట్ గురించి మరిన్ని వివరాలు త్వరలోనే చిత్రబృందం వెల్లడించనుంది. ప్రస్తుతం నాని శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో 'ది ప్యారడైజ్' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ చిత్రం మార్చి 26, 2026న విడుదలయ్యే అవకాశం ఉంది. దీని తర్వాత సుజీత్ దర్శకత్వంలో మరో సినిమా చేయనున్నారు. మరోవైపు వెంకీ అట్లూరి ప్రస్తుతం సూర్య హీరోగా 'విశ్వనాథన్ అండ్ సన్స్'చిత్రాన్ని పూర్తి చేసే పనిలో ఉన్నారు. ఈ కమిట్‌మెంట్లు అన్నీ పూర్తయిన తర్వాత, 2026 ద్వితీయార్థంలో నాని ? వెంకీ అట్లూరి ప్రాజెక్ట్ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.



# విజయ్ దేవరకొండ పెళ్లి ఓటిటి హక్కులు తిరస్కరించిన రౌడీబాయ్

టాలీవుడ్ మోస్ట్ క్రేజీ నటులుగా పేరు తెచ్చుకున్న విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారనే వార్తలు గత కొద్దిరోజులుగా ఫిల్మ్ నగర్లో చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే వీరి పెళ్లి వీడియో స్ట్రీమింగ్ హక్కుల కోసం ఒక ప్రముఖ అంతర్జాతీయ ఓటీటీ సంస్థ భారీ మొత్తాన్ని ఆఫర్ చేసినట్లు సమాచారం. అయితే ఈ ఆఫర్‌ను విజయ్ దేవరకొండ సున్నితంగా తిరస్కరించినట్లు తెలుస్తోంది. గతంలో నయనతార ? విఘ్నేష్ శివన్ వివాహ వీడియో స్ట్రీమింగ్ విషయంలో తలెత్తిన న్యాయపరమైన వివాదాలు, డాక్యుమెంటరీ విడుదల కావడానికి పట్టిన సమయం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ జంట అప్రమత్తమైనట్లు కనిపిస్తోంది. అలాగే తన వ్యక్తిగత జీవితంలోని అత్యంత ముఖ్యమైన వేడుకను వ్యాపారం చేయడం విజయ్‌కి ఇష్టం లేదని, అందుకే ఎన్ని కోట్లు ఆఫర్ చేసినా అంగీకరించలేదని సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి. తమ పెళ్లిని కేవలం కుటుంబ సభ్యులు, ఆత్మీయుల మధ్య అత్యంత ప్రైవేట్‌గా జరుపుకోవాలని వారు భావిస్తున్నట్లు తెలుస్తుంది. తాజా సమాచారం ప్రకారం, ఫిబ్రవరి 26న రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ ప్యాలెస్‌లో వీరి వివాహం జరగనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే దీనికి సంబంధించిన ఏర్పాట్లు కూడా ప్రారంభ మయ్యాయని నెట్టింట కొన్ని వీడియోలు వైరల్ అవుతున్నాయి. గతేడాది అక్టోబర్‌లోనే వీరిద్దరికీ నిశ్చితార్థం పూర్తయిందని వార్తలు వచ్చినప్పటికీ, ఈ జంట మాత్రం ఇప్పటివరకు అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయలేదు. ఏదేమైనా, తమ అభిమాన నటీనటులు ఒకటవుతుండటంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

PRINTED AND PUBLISHED by VASISTA PRINTERS 18-97, 306, 3RD FLOOR, RAJINIGANDHA COMPLEX, KAMALA NAGAR, CHAITANYAPURI, SAROORNAGAR, RANGAREDDY, TELANGANA - 500060, RNI No :TGTEL/25/A4284 EDITOR KOMMU SRINIVAS, Contact - 9666023180 & 8096660656